# Siddenki Yadagiri ‘Bathukupatam’ Kavitvam
# Samaajika Anusheelana

A Dissertation submitted to the University of Hyderabad in

Partial fulfillment of the Degree of

Master of Philosophy in Telugu

By

Thudum Mahesh

Reg. No. 20HTHL12

Supervisor

Prof. M. Gona Naik

Department of Telugu

School of Humanities

University of Hyderabad

Hyderabad–500 046

Telangana, India

January – 2023

# సిద్దెంకి యాదగిరి '*బతుకుపాఠం*' కవిత్వం సామాజిక అనుశీలన

(Siddenki Yadagiri 'Bathukupatam' Kavitvam Samaajika Anusheelana)

ఎం.ఫిల్. పట్టాకోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన వ్యాసం


పరిశోధకుడు

తుడుం మహేశ్

Reg. No. 20HTHL12

పర్యవేక్షణ

**ఆచార్య ఎం. గోన నాయక్**

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500046


జనవరి –2023

# DECLARATION

I, **Thudum Mahesh** hereby declare that this Dissertation entitled **'Siddenki Yadagiri 'Bathukupatam' Kavitvam Samaajika Anusheelana**' submitted by me under the guidance and Supervision of **Prof. M. Gona naik** is a bonifide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

Signature

Name: Thudum Mahesh

Regd. No. : 20HTHL12

Date:

# CERTIFICATE

This is to certify that the dissertation entitled '**Siddenki Yadagiri 'Bathukupatam' Kavitvam Samaajika Anusheelana**' submitted by **Thudum Mahesh** bearing Reg. No. **20HTHL12** in partial fulfilment of the requirements for the award of Master of Philosophy in Telugu is a bona fide work carried out by him under my supervision and guidance.

The dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma.

Further the student has passed tha following courses towards fulfilment of coursework required for M. Phil. (recommended by Doctorial Cammittee) on the basis of the following courses passed during his M. Phil. Program.

| Course code | Titile of the course | course credits | Pass/Fail |
|---|---|---|---|
| HT600 | Research methodology | 4 | Pass |
| HT601 | History of Telugu Research | 4 | Pass |
| HT602 | Specialzed Area | 4 | Pass |
| HT603 | Broad Field | 4 | Pass |

Signature of the Supervisor

Head, Department of Telugu

Dean, School of Humanities

# విషయసూచిక

పుట సంఖ్య

కృతజ్ఞతలు
ప్రస్తావన

## మొదటి అధ్యాయం

## సిద్దెంకి యాదగిరి జీవిత విశేషాలు(1 – 8)

1. 0. ఉపోద్ఘాతం 1
1.1.జనన వివరాలు 1
1.2. కుటుంబ నేపథ్యం 2
1.3.బాల్యం 2–3
1.4.విద్యాభ్యాసం 3
1.5. సాహిత్యానికి బీజం 3
1.6. సాంస్కృతిక నేపథ్యం 3–4
1.7. రచన ప్రారంభం తొలి రచన 4–5
1.8. సిద్దెంకి యాదగిరి రచనలు పరిచయం 5
1.8.1. మా తొవ్వ 5
1.8.2. బతుకు పాఠం 6
1.8.3. తప్ప 6–7
1.8.4. అచ్చు 7
1.8.5. తొండం బొక్కెన 7
1.9. వృత్తి – ప్రవృత్తి 7
1.10. సిద్దెంకి వివిధ సాహితీ సంస్థల అభినివేశం 8
1.11. సన్మానాలు సత్కారాలు 8

## రెండవ అధ్యాయం.

# *"బతుకు పాఠం"* కవిత్వం – వస్తు వైవిధ్యం(9-31)


| | |
|---|---|
| 2. 0. వస్తువు(Content) | 9 |
| 2. 1. వస్తువు లక్షణాలు | 10 |
| 2. 2. వస్తువు నిర్వచనాలు | 10 |
| 2. 3. *"బతుకు పాఠం"* కవిత్వం – తాత్వికత అంశాలు | 11 |
| 2. 3. 1. జీవితం | 11– 13 |
| 2. 3. 2. అమాయకత్వం | 13–15 |
| 2. 4. సామాజిక దృక్పథం | 15–16 |
| 2. 4. 1. సినిమా | 15 – 16 |
| 2. 4. 2. చేనేత కళ | 16–17 |
| 2. 4. 3. కులం | 17 |
| 2. 5. తెలంగాణ సంస్కృతి – సంప్రదాయం | 18 |
| 2. 5. 1. తెలంగాణలో బతుకమ్మ పండగ విశేషాలు | 18–21 |
| 2. 5. 2. హైదరాబాద్ | 22–24 |
| 2. 6. మానవ సంబంధాలు | 25 |
| 2. 6. 1. మాతృత్వం | 25–29 |
| 2. 6. 2. నాన్న ప్రేమ | 29–30 |
| 2. 6. 3. దాంపత్యం | 30–31 |
| 2. 6. 4. గురు శిష్యుల బంధం | 31 – 33 |
| 2. 7. స్మృతి కవిత్వం | 33 |
| 2. 7. 1. బాలగోపాల్ | 33–34 |
| 2. 7. 2. మైకేల్ జాక్సన్ | 34– 35 |
| 2. 7. 3. జాషువా | 35 – 36 |
| 2. 7. 4. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ | 36 –37 |

## మూడవ అధ్యాయం

## "*బతుకు పాఠం*" కవిత్వం – సామాజిక పరిశీలన(38–88)


3. 0. సామాజిక స్పృహ పదానికి అర్థాలు 38

3. 1. సమాజంలో సాహిత్యం పాత్ర 38 – 41

3. 2. రైతు వ్యధలు 41 – 45

3. 3. ప్రాంతీయ వాదం 45– 51

3. 4. ధ్వంసం అవుతున్న వృత్తి కళలు 51 –56

3. 5. దళిత జీవన సమస్యలు 56

3. 5 .1. కులం పుట్టుక 56–57

3. 5. 1. 1. దళిత పదానికి నిఘంటువులలో ఉన్న అర్థాలు 57

3. 5. 1. 2. దళిత నిర్వచనాలు 57 - 61

3. 6. రాజకీయ అంశాలు 61 - 67

3. 7. సామాజిక దురాక్రమాలు 67 – 69

3. 8. సింహావలోకనం 70 – 71

ఉపయుక్తగ్రంథాలు 72 – 74

అనుబంధం– I 75 –79

అనుబంధం– II 80 - 88

# కృతజ్ఞతలు

నాకు జన్మనిచ్చి విద్యాబుద్ధులు నేర్పిన నా తల్లిదండ్రులు శ్రీమతి తుడుం కళవ్వ, శ్రీ తుడుం యాదయ్యగార్లకు పాదాభివందనాలు.

నాకు సాంస్కృతిక, సాహిత్యోద్యమాల ఉగ్గుపాలను తాపిన నా మార్గదర్శకులు ప్రజా గాయకురాలు శ్రీమతి విమలక్కకు, శ్రీ మిత్ర దంపతులకు కృతజ్ఞతలు.

నాకు హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో పరిశోధన చేయుటకు అవకాశం కల్పించిన తెలుగు శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు.

నేను రాసే కవితలను ఎప్పటికప్పుడు పరిశీలించి, సరికొత్త దృక్పథాలను జోడించమని తన విలువైన సలహాలను, సందేశాలను నాకిచ్చి నన్ను ప్రోత్సహించిన మా గురువులు, నా కవితా మార్గదర్శి, తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వర రావుగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఆధునిక సాహిత్యం పట్ల నాకున్న అభిరుచికి తగినట్లు ఆధునిక బహుజన దృక్పథానికి చెందిన సిద్దెంకి యాదగిరిగారు రాసిన *"బతుకు పాఠం"* అనే కవితా సంపుటి నా ఎం. ఫిల్ పరిశోధన అంశంగా ఇచ్చిన నా గురువులు, పర్యవేక్షకులు ఆచార్య ఎం. గోనా నాయక్ గారికి కృతజ్ఞతలు.

ఎం. ఎ లో తమ బోధనలతో నన్ను ప్రభావితం చేసి పరిశోధన విద్యార్థి స్థాయికి చేర్చిన తెలుగు శాఖ అధ్యాపక వర్గం ఆచార్య రేమిల్ల వెంకట రామకృష్ణ శాస్త్రిగారికి, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణిగారికి, ఆచార్య ఎండ్లూరి సుధాకర రావుగారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, ఆచార్య జి. అరుణ కుమారిగారికి, ఆచార్య పిల్లలమర్రి రాములుగారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మిగారికి, డాక్టర్ బాణాల భుజంగరెడ్డిగారికి, డాక్టర్ దాసరి విజయ కుమారిగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

నేను ఏప్పుడు సంప్రదించినా వెంటనే స్పందిస్తూ నా సందేహాలకు, ప్రశ్నలకు సమాధానం ఇస్తూ నన్ను ప్రోత్సహించిన ఈ *"బతుకు పాఠం"* కవితా సంపుటి రచయిత సిద్దెంకి యాదగిరిగారికి కృతజ్ఞతలు.

నా పరిశోధనకు అవసరమైన సమాచారాన్ని పుస్తకాలను సేకరించుకోవడానికి అవకాశం కలిగించిన హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం ఇందిరాగాంధీ స్మారక గ్రంథాలయం సిబ్బందికి కృతజ్ఞతలు.

నేను నిజాం కళాశాలలో డిగ్రీ విద్యార్థిగా ఉన్న సమయంలో తన పాఠాలతో, ప్రసంగాలతో నన్ను ప్రభావితం చేసి నేను కేంద్ర విశ్వవిదాలయానికి వచ్చి విద్యనభ్యసించేందుకు ముఖ్య కారకులైన ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య చింతకింది కాసీంగారికి కృతజ్ఞతలు.

డప్పు డోలక్ మీద నేను తరికిటలు వాయిస్తుంటే నన్ను ఎంతగానో అభినందిస్తూ, ఆశీర్వదించే కవి, విమర్శకులు ఆచార్య కొలకలూరి ఇనాక్ గారికి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. మామిడి హరికృష్ణగారికి, బహుజన పాటల పెద్దయ్య మాష్టార్జిగారికి, తెలంగాణతల్లి విగ్రహ రూపశిల్పి బి. వి. ఆర్. చారిగారికి కృతజ్ఞతలు.

నేను ఎం. ఫిల్ స్థాయి వరకు వచ్చానంటే అందుకు కారణమైన నా తొలి దశ విద్యా గురువులు ఏర్పుల రామకృష్ణయ్యగారికి, జంగపల్లి యాదగిరిగారికి, సుక్క కన్నయ్యగారికి, ప్రేమ్ కుమార్ గారికి కృతజ్ఞతలు.

నన్ను వెన్ను తట్టి ప్రోత్సహించిన తెలంగాణ యువకవి, గాయకులు పసునూరి రవీందరన్నగారికి, జిలుకర శ్రీనివాసన్నగారికి, దరువు ఎల్లన్నగారికి, ఏపూరి సోమన్నగారికి, కుంట శ్రీనన్నగారికి, పెద్ద చీకోడ్ నర్సింలన్నగారికి, మోహనన్న (బైరగి)గారికి, తైదల అంజన్నగారికి, పొన్నాల బాలన్నగారికి, డప్పోల్ల రమేషన్నగారికి, సొన్నాయిల బాల్ రాజన్నగారికి, దరువు రమేషన్నగారికి, పద్మనాధునిపల్లె శ్రీనన్నగారికి, కందుకూరి శంకర్ బాబాన్నగారికి, నలిగంటి శరత్ గారికి, గుడిపల్లి రవిగారికి, సత్య కలకోటిగారికి, చెన్న రాజుగారికి కళాభివందనాలు.

నటన వైపు నా దృష్టి మల్లేలా, వారు దర్శకత్వం వహించిన సాంఘిక నాటకాలలో నన్ను భాగసామ్యం చేస్తూ, నన్నెంతగానో ప్రోత్సహిస్తూన్న రంగస్థల దర్శకులు, సినిమా నటులు సురభి సంతోష్, డా. అల్తాఫ్ హసన్, అజయ్ మంకెనపల్లి, దీనబాంధవ్, షేక్ జాన్ బషీర్ అన్న గార్లకు కళాభివందనాలు.

మేం ఒకే తల్లి కడుపున పుట్టకున్నా సొంత తమ్ముడిలా నన్నుచూస్తు, నా పిడికెడు గుండెకు ఎల్లప్పుడూ కొండంత ధైర్యాన్ని నూరిపోసే అందె భాస్కర్, గోపి స్వామి, అసుర పరశు అన్న గార్లకు కృతజ్ఞతలు.

ఎం. ఎలో నన్ను ప్రోత్సహించిన మిత్రులు శంకర్, శివ, అంజి, గణేష్, మధుసూదన్ రెడ్డి, రోహిత్, విశ్వనాథ్, రజినీకాంత్, ఇమ్రాన్, త్రిపురాంజనేయులు, మామునూరి చంటి, మాచపురం ప్రేమ్ కుమార్, ప్రణయ్ లకు కృతజ్ఞతలు.

కరోనా విలయ తాండవం చేస్తున్న కర్కశ రోజులలో ఆర్థికంగాను, మానసికంగాను ఎంతో బలాన్నందించి, కరోనా సమయంలో నాకు ఆశ్రయమిచ్చిన మేన బావలు, చెల్లెల్లు శ్రీ తిరుపతి, శ్రీమతి సుజాత దంపతులకు శ్రీ కరుణాకర్, శ్రీమతి కల్యాణి దంపతులకు లక్ష్మాపూర్ గ్రామ నివాసులకు కృతజ్ఞతలు.

ఎం. ఫిల్ పరిశోధనలో నాకు విలువైన సలహాలు ఇచ్చి సహాయం చేసిన రాజీవ్, కమలాకర్, శివకుమార్, నాగరాజు, మదన్మోహన్ రెడ్డి, విజయ్ కుమార్, మహేందర్, వెంకటాద్రి, మహేశ్, ప్రకాష్ అన్నలకు కృతజ్ఞతలు.

కష్టమొచ్చినా, హర్ష మొచ్చినా నాకు కొండంత ధైర్యాన్నిచ్చే నా బలం, ఆత్మీయ దళం అయిన కాట్న దిలీప్, కప్పల సురేశ్, ముల్లంబూడు అప్పన్ రాజ్ లకు నా హృదయాంజలిలు.

తుడుం మహేశ్

# ప్రస్తావన

నాకు మొదటినుంచి చదువుపై ఆసక్తి ఉండేది కాదు. నేను ఇంటర్ వరకు సాధారణ విద్యార్థిని. కానీ నేను డిగ్రీ నిజాం కళాశాలలో చేరిన తరువాత నా భావజాలం మొత్తం మారింది. అంతవరకు కుటుంబ పరిస్థితులకు పరిమితమైన నేను ఈ కళాశాలలో చేరిన తరువాత పాఠాన్ని బోధించే అధ్యాపకుల ద్వారా అనేక కొత్త విషయాలను తెలుసుకున్నాను. అందులో ముఖ్యమైనది ఈ సమాజంలో పిడించే వర్గం, పిడించబడ్డ వర్గం అనే అంశం. ఇందులో భాగంగా ఉన్నత వర్గాలకు చెందిన కొంతమంది కారణంగా దళిత, బహుజన ప్రజలు ఎన్నో రకరకల సమస్యలను ఎదుర్కుంటున్నారని ప్రత్యక్షంగా, పరోక్షంగా చూసి అనేక పర్యాయాలు చింతించాను. నా భావజాలం కూడా బహుజన దృక్పథం వైపు మల్లింది. నా భావజాలానికి తగినట్టు నా గురువులు, పర్యవేక్షకులు ఆచార్య ఎం. గోనా నాయక్ గారు ఆధునిక బహుజన దృక్పథానికి చెందిన సిద్దెంకి యాదగిరిగారు రాసిన "*బతుకు పాఠం*" అనే కవితా సంపుటి నా ఎం. ఫిల్ పరిశోధన అంశంగా ఎంచుకోమని సలహా ఇచ్చారు.

## 1. 0. ఉపోద్ఘాతం:

మన భారతదేశంలో వర్ణానికి పర్యాయ పదంగా కులం అనే మాటను ఉపయోగిస్తున్నారు. కులాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. ఆ కుల వ్యవస్థ కూడా ప్రధానంగా చాతుర్వర్ణం అనే భావన మీదనే నిర్మితమై ఉందని అది మనుస్మృతిలో స్పష్టంగా చెప్పారు. దీని ప్రకారం బ్రాహ్మణులు ముఖం నుండి క్షత్రీయులు భుజాల నుండి వైశ్యులు తొడలనుండి శూద్రులు పాదాల నుండి పుట్టారని నేటి వరకు ఒక భావన ఉంది. సిద్దెంకి యాదగిరిగారు కూడా ఈ చాతుర్వర్ణ వ్యవస్థలో చివరి వర్ణమైన శూద్రకులంలోజన్మించాడు. సిద్దిపేట జిల్లా, చిన్నకోడూరు మండలంలోని గోనెపల్లి గ్రామానికి చెందిన శ్రీమతి సిద్దెంకి లచ్చవ్వ, శ్రీ రాజయ్య దంపతులకు ఏకైక సంతానంగా 30 జూన్ 1980వ సంవత్సరంలో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించాడు.

సిద్దెంకి యాదగిరి వృత్తి రీత్యా వేములఘాట్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఈయన ప్రవృత్తి కవిత్వం, కథలు మరియు వ్యాసాలు రాయడం తన ప్రవృత్తిగా మార్చుకున్నాడు.

సిద్దెంకి యాదగిరి కవిత్వం, కథలు, సమీక్ష, పరిశోధన మొదలైన ప్రక్రియలలో రచనలు చేశారు. అవి *మా తొవ్వ* (కవితా సంపుటి) 2004, *బతుకు పాఠం* (కవితా సంపుటి ) 2014, *తప్ష* ( కథల సంపుటి) 2016, *అచ్చు* ( కవితా సంపుటి) 2020, *తొండం బొక్కెన* (కథల సంకలనం) 2021.

## 1. 1. పరిశోధన ఆవశ్యకత:

సమాజంలో బలహీన వర్గాలపై జరిగే అన్యాయాలను ప్రశ్నించే విధంగా ఆధునిక కవులు అనేక సాహితీ ప్రక్రియలను రాయడం జరిగింది. అందులో కవితా ప్రక్రియ ఒకటి. ముఖ్యంగా బహుజన దృక్పథంపై ప్రస్తుతం అనేక కవితలు రావడం విశేషం. కావున ఈ బహుజన దృక్పథానికి సంబందించిన కవితలను, ఇతర సాహితీ ప్రక్రియలను అధ్యాయనం చేయవలసిన ఆవశ్యకతవుంది. అందుకే నేను '**సిద్దెంకి యాదగిరి *"బతుకుపాఠం"* కవిత్వం సామాజిక అనుశీలన**' అనే అంశాన్ని నా ఎం. ఫిల్ పరిశోధనకై ఎంచుకున్నాను.

## 1. 2. పరిశోధన పరిధి:

సిద్దెంకి యాదగిరిగారు రాసిన సిద్దెంకి యాదగిరి '**సిద్దెంకి యాదగిరి *"బతుకుపాఠం"* కవిత్వం సామాజిక అనుశీలన**' మాత్రమే ఈ నా పరిశోధన పరిధి.

## 1. 3. పూర్వ పరిశోధనలు:

నాకు లభించిన సమాచారం మేరకు నేను ఎంచుకున్న అంశంపై ('**సిద్దెంకి యాదగిరి *"బతుకుపాఠం"* కవిత్వం సామాజిక అనుశీలన**') ఎటువంటి పరిశోధనలు జరగలేదు.

## 1. 4. అధ్యాయన విభజన:

నా పరిశోధనాంశం '**సిద్దెంకి యాదగిరి *"బతుకుపాఠం"* కవిత్వం సామాజిక అనుశీలన**' అనే అంశంగా తీసుకున్నాను. కాల పరిమితి నిమిత్తం ఈ పరిశోధనాంశాన్ని మూడు అధ్యాయాలుగా విభజించడం జరిగింది.

కథలు, వ్యాసం, కవిత్వం, పరిశోధన అనే ప్రక్రియలో రచనలు చేశారు సిద్దెంకి యాదగిరిగారు. వీటిల్లో నేను బతుకు పాఠం అనే కవితా సంపుటిని నా ఎం. ఫిల్ పరిశోధన అంశంగా ఎంచుకున్నాను. ఈ పరిశోధన అంశాన్ని పరిశోధన సౌలభ్యం కోసం మూడు అధ్యాయాలుగా విభజించడం జరిగింది.

మొదటి అధ్యాయం "**సిద్దెంకి యాదగిరి జీవిత విశేషా** ". ఈ అధ్యాయంలో సిద్దెంకి యాదగిరి జీవిత విశేషాలు, బాల్యం, విద్యాభ్యాసం, కుటుంబ విశేషాలు, వివిధ సాహిత్య సంస్థలతో తనకు ఉన్నటువంటి పరిచయాలు సభలు సమావేశాలు రచన వ్యాసంగం దశలు వివరిస్తాను వివిధ ప్రక్రియల్లో రాసిన రచనల గురించి పరిచయాన్ని తెలిపాను.

రెండవ అధ్యాయం '***బతుకు పాఠం"* కవిత్వం – వస్తు వైవిధ్యం**'. ఈ అధ్యాయంలో వస్తువు నిర్వచనాలు, వస్తువు లక్షణాలు కవిత్వంలో ఉన్న వివిధ రకాల వస్తువులైన తాత్విక చింతనను తెలిపే కవితలు సామాజిక దృక్పథం తెలిపే కవితలు సంస్కృతి సాంప్రదాయాలను తెలిపే కవితలు మానవ

సంబంధాలు తెలిపే కవితలు స్మృతి కవితలు ఇలా ఇలా వివిధ రకాల వస్తు వైవిధ్యాలను వివరిస్తూ వాటికి ఉదాహరణంగా కొన్ని కవితలను ఈ అధ్యాయంలో తెలిపాను.

మూడవ అధ్యాయం '"***బతుకు పాఠం***" **కవిత్వం – సామాజిక అంశాలు**' ఈ అధ్యాయంలో సామాజిక స్పృహ పదానికి అర్థాన్ని తెలుపుతూ సమాజంలో సాహిత్య పాత్రను వివరించాను. అదేవిధంగా సిద్దెంకి యాదగిరిగారు సాహిత్య లోకంలోకి ప్రవేశించేనాటికి దేశంలో ఉన్నటువంటి పరిస్థితులు, ఆ పరిస్థితులు తనపై ఎటువంటి ప్రభావాన్ని చూపించాయో, నేటి సామాజిక పరిస్థితులు ఎలా ఉన్నాయో అనే విషయాలముతో పాటు సామాజిక దృష్టితో ఆయన రాసిన కొన్ని కవితల గూర్చి ఇందులో తెలిపాను.

## 1. 5. ముగింపు:

ఇది ఎం.ఫిల్ కోర్సులో భాగంగా తీసుకున్న అంశం. ఇది ఒక సంవత్సర కాలంలో క్లాసులు వింటూ, కవిత్వానికి చెందిన అనేక రకాల పుస్తకాలను చదివి విషయాన్ని నా ఎం. ఫిల్ గ్రంథంలో పొందుపరచడం జరిగింది.

## మొదటి అధ్యాయం
# సిద్దెంకి యాదగిరి జీవిత విశేషాలు

### 1. 0. ఉపోద్ఘాతం:

తెలుగులో లిఖిత సాహిత్యం ప్రారంభమై దాదాపు 1000 సంవత్సరా  పూర్తి అయ్యింది. మౌఖిక సాహిత్యం వేయి సంవత్సరాల క్రితం నాటిది. మౌఖిక సాహిత్యాన్ని అంచనా వేయలేం. కాబట్టి మౌఖిక సాహిత్యం అతి పురాతనమైనదిగా చెప్పవచ్చు.

మౌఖిక సాహిత్యం అంటే ఆశువుగా పలికే అల్లిక సాహిత్యం. ఈ అల్లిక సాహిత్యం జానపద హృదయాల నుంచి పుట్టింది, ఉత్పత్తి కులాలు ఈ దేశ మూలవాసులు. ఇంకా చెప్పాలంటే అంటరానివారు, పీడనకు గురైన వారు, ఊరవతల వెలివేయబడిన దళితులుగా పిలువబడుతున్న మాల మాదిగలు అనవచ్చు.

బహుజనులు అలుపెరుగని కష్టం చేసి ఉన్నత కులాల అభివృద్ధికి తోడ్పడ్డారు. వారి వారి విధిలో భాగంగా అనేక పనుల్లో భాగమయ్యారు. అక్షరాలకు దూరమైన దళితులు ఆశువునే ఆశ్రయించారు. దళితులది శ్రమ సంస్కృతి. వారు చేస్తున్న పనిలో అలసటను మర్చిపోవడాని  ఆశువుగా మాటలు అల్లినారు, పాటలు పాడినారు. అభివృద్ధికి తోడ్పడ్డారు. నోటికొచ్చినట్లు లయబద్దంగా ఆలపించడం కైకట్టడం. కైగట్టడం అంటే ఆశువుగా వినిపించడం, విలపించడం, వ్యంగ్యాత్మక ఛలోక్తులను విసరడం, బతుకుదెరువు తత్త్వం చెప్పటమే. ఇలా అన్ని మిళితమైనదే శ్రమ సంస్కృతి, బహుజన సంస్కృతి అల్లిక సంస్కృతి.

ఈ అల్లిక వారసత్వం నుంచి అనేక మంది కవులు, రచయితలు, వాగ్గేయకారులు పుట్టుకొచ్చారు. ఆశువుగా పద్యాలు అల్లుతూ పాటలు పాడుతూ బహుళ ప్రజాదరణ పొందిన వారు బహుజన రచయితలు. ఈ కోవకు చెందిన వారే ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు డాక్టర్ సిద్దెంకి యాదగిరిగారు.

### 1. 1. జననం:

సిద్దిపేట జిల్లా, చిన్నకోడూరు మండలంలోని గోనెపల్లి గ్రామానికి చెందిన శ్రీమతి సిద్దెంకి లచ్చవ్వ, శ్రీ రాజయ్య దంపతులకు ఏకైక సంతానంగా 30 జూన్ 1980వ సంవత్సరంలో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించారు.

సిద్దెంకి యాదగిరిగారు గోనెపల్లి అనే కుగ్రామంలో జన్మించారు. పల్లెటూర్లు అనగానే కొన్నిరకాలైన ఆచారవ్యవహారాలు ఉంటాయి. కొంతమంది పల్లె వాసులు ఊరి గ్రామదేవతల, పేరంటాళ్ళ పేర్లను పెట్టుకుంటూ ఉంటారు. యాదగిరి నరసింహ స్వామి అనుగ్రహం చేత పుట్టాడని ఈయన తాతగారు యాదగిరి అని నామకరణం చేశారు.

## 1. 2. కుటుంబ నేపథ్యం:

మన భారతదేశంలో వర్ణానికి పర్యాయ పదంగా కులం అనే మాటను ఉపయోగిస్తున్నారు. కులాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. ఆ కులవ్యవస్థ కూడా ప్రధానంగా చాతుర్వర్ణం అనే భావన మీదనే నిర్మితమై ఉందని అది మనుస్మృతిలో స్పష్టంగా చెప్పారు. దీని ప్రకారం బ్రాహ్మణులు ముఖం నుండి క్షత్రీయులు భుజాల నుండి వైశ్యులు తొడలనుండి శూద్రులు పాదాల నుండి పుట్టారని నేటి వరకు ఒక భావన ఉంది.

సిద్దెంకి యాదగిరిగారు కూడా ఈ చాతుర్వర్ణ వ్యవస్థలోని చివరి వర్ణమైన శూద్రకులంలో జన్మించాడు. సమాజం ఈ కులాన్ని ఊరికి దూరంగా నెట్టేసింది. మూతికి ముంతను, నడుముకు తాటాకును కట్టి హేళన చేసి ఈ సమాజం చాలా కాలంపాటు అక్షరానికి అనర్హులను చేసింది. అందువలన ఈ కులానికి చెందినవాళ్ళు అనేక తరాలుగా బానిసలుగా జీవనం గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. అయితే గ్రామాల్లో మాత్రం దొరలు, భూస్వాములు, పటేల్లు మొదలైన వారంతా అధికారులుగా ఉండేవారు. వీరు ఇతర కులాల వారిచే వెట్టి పనులు చేయించుకునేవారు. సిద్దెంకి యాదగిరి తాత గాలయ్య, తండ్రి రాజయ్య ఇద్దరూ తమ ఊరి పటేల్ దగ్గర పాలేరులుగా పనిచేసేవారు. వీరి కుటుంబం అంతా కలిసి ఎంత వెట్టి పనులు చేసినా, కుటుంబ పోషణ అనేది చాలా కష్టమయ్యేది. అందుకుగాను తీరిక సమయాల్లో వ్యవసాయానికి అవసరం అయ్యే చేతాళ్ళు, నులక తాళ్ళను అల్లుతూ వాటిని అమ్మేవారు. ఆ అమ్మిన వాటికి వచ్చిన డబ్బులతో నిత్యావసర సరుకులు తెచ్చుకునేవారు. రెక్కాడితే గాని డొక్క నిండని పరిస్థితి. కొన్నాళ్ళ తరువాత ఇంటిల్లిపాది పనిచేసినా పూట గడవడం చాలా కష్టమైన రోజుల్లో రాజయ్య అదనపు పని కోసం గోనెపల్లి నుండి సిద్ధిపేటకు వచ్చి హమాలీ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు.

సిద్దెంకి యాదగిరి తల్లిదండ్రులు పెద్దగా చదువుకోకపోయినా తాము పడే కష్టం తమ కొడుకు పడకూడదని బాగా చదివించాలని కలలు కన్నారు. అనే విషయాన్ని సిద్దెంకి యాదగిరిగారు తాను రాసిన అనేక కవితలలో ప్రస్తావించారు.

## 1. 3. బాల్యం:

సిద్దెంకి యాదగిరి బాల్యం గోనెపల్లిలోనే గడిచింది. తను ఇక్కడే పెరిగినా సమాజంలో కుల భేదాలు ఉండడం వలన ఆయన జీవితానికి ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయి. తాత ముత్తాతల నుండి వారసత్వంగా వచ్చే ఆస్తులు ఏమి లేకపోవడం వలన పనిచేస్తే కానీ పూటగడవని పరిస్థితి. అలాగే ఇతను చదువుకోవడానికి ఆర్థికంగానూ, కుల పరంగానూ ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. వాళ్ల ఇంట్లో తాను ఏకైక సంతానం కావడం వలన చిన్నప్పటి నుండి ఇంట్లో వాళ్ళ అమ్మకి ఇంటి పనిలో వంట పనిలోను సహాయం చేసేవాడు. అదే విధంగా తనకు ఊహ తెలిసినప్పటి నుండి బడికెళ్లే రోజుల్లో సెలవు దొరికినప్పుడల్లా కూలీ పనికి వెళుతూ కుటుంబ పోషణలో వారి తండ్రికి ఆసరాగా ఉండేవా .

సిద్దెంకి యాదగిరి కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా ఉండటంచేత చదువుకోవాలని ఎంతో ఆసక్తి ఉన్నా కనీసం బస్సు పాసు తీసుకోవడానికి కూడా డబ్బులు లేకపోవడంతో ప్రతిరోజు గోనెపల్లి నుండి సిద్దిపేటకు రావడానికి పోవడానికి మొత్తం 30 కిలోమీటర్ల దూరం సైకిల్ తొక్కుతూ వెళ్ళి వచ్చేవారు. డిగ్రీ బి. ఎ చదువుతున్న రోజుల్లో వారానికి మూడు రోజులు క్లాసుకు వెళుతూ మూడు రోజులు ఇళ్లకు పెయింటింగ్ వేసే పనికి వెళ్ళేవారు.

## 1. 4. విద్యాభ్యాసం:

సిద్దెంకి యాదగిరి ప్రాథమిక మరియు ఉన్నత విద్యాభ్యాసం తన సొంత ఊరైనా గోనెపల్లిలో కొనసాగింది. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదవగా, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ (కామర్స్) పూర్తి చేశారు, ఆర్ట్స్ కళాశాల ఉస్మానియా విశ్వవిద్యాలయంలో యం. ఎ. తెలుగు చేశారు. ఇదే విశ్వవిద్యాలయంలో 'తెలంగాణ పాటల్లో సామాజిక చిత్రణ' (2017) అనే అంశంపై డాక్టర్ దాశరథుల బాలయ్యగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందారు.

## 1.5. సాహిత్యానికి బీజం:

యాదగిరి చిన్ననాటి నుండే విద్యాభ్యాసంలోనూ చురుకైన పాత్రను పోషించేవాడు. ప్రాథమిక విద్యాభ్యాసంలో రంగారెడ్డి సార్ అంటే భయం ఉండేది, ఉన్నత విద్యాభ్యాసంలో తెలుగు పట్ల మక్కువ కలిగించినది అష్టకాల నరసింహారెడ్డి సార్ మరియు శర్మ సార్ పద్యాలు విని తను కూడా పద్యాలు రాయాలని కలలుకన్నాడు. ఇంటర్ చదువు సిద్దిపేట జూనియర్ కళాశాలలో చదువుతున్నప్పుడు తన సాహిత్య అభిరుచికి స్పష్టమైన అవగాహన ఏర్పడి ఆటవెలది పద్యాలు, వచన కవిత్వం రాయడం ప్రారంభించాడు. ఆ సమయంలోనే వేముగంటి మురళి పరిచయం అయ్యాడు. వచన కవిత్వం వైపు ఎక్కువ దృష్టి మల్లేలా నందిని సిధారెడ్డి సార్ గారిని, మంజీరా రచయితల సంఘాన్ని పరిచయం చేశాడు. తత్ఫలితంగా వచన కవిత్వం మీదకు తన దృష్టి మళ్ళింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ తెలుగు చదువుతున్న రోజుల్లో అనేక సామాజిక అంశాలను కవితలుగా మలిచాడు.

## 1. 6. సాంస్కృతిక నేపథ్యం:

వీరి నానమ్మ సిద్దెంకి మల్లవ్వ చిన్ననాటి నుండే జానపద కథలు, వీధి భాగోతాలు, శాత్రాలు, పొడుపు కథలు, చిక్కుముడులు, జాంబవ పురాణం, మొదలైనటువంటి వాటిని గురించి నిరంతరం తెలియజేసేది అందువల్లనే చిన్నతనం నుండే సిద్దెంకి యాదగిరికి కళల పట్ల మక్కువ ఏర్పడింది. తద్వార డప్పు కొట్టడం, కోలాటం ఆడటం, పీర్ల పండుగకు వేషాలు కట్టడం, యక్షగానాలలో చిన్న చిన్న

పాత్రలు వేయడం మొదలైనవి చేసి కళాకారుడిగా పేరుతెచ్చుకున్నాడు. సమాజంలో గుర్తింపు పొందడానికి కళనే సరైన ఆయుధమని భావించాడు. అయితే తన బాల్యం నుండే సాహిత్యంలో అభిరుచి ఉన్నందువలన పాఠశాలలో జరిగే ప్రతి సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొంటూ పాటలు పాడుతూ ప్రేక్షకుల, పెద్దల మన్ననలు పొందారు.

నిమ్న కులంలో పుట్టడం వలన సామాజిక జీవితంలోనూ, విద్యార్థి జీవితంలోనూ, ఎన్నో అవరోధాలను, అవమానాలను, చవిచూడాల్సి వచ్చింది. వీటన్నింటిని భరించలేక మానసిక క్షోభను అనుభవించారు. ఈ సమాజంలోని అసమానతలను రూపుమాపడం కొరకై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి అనే ఆలోచన చిగురించింది. ఈయన విద్యార్థి దశలో ఉండగానే. ఈయన మిత్రులైన దరువు ఎల్లన్న, కుంట శ్రీను, రాయపోలు అంజన్న మొదలైన మిత్రులతో కలిసి 1999 డిసెంబర్ 20న 'దరువు కళా బృందం' అనే కళా సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థలో మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాన్యశ్రీ కాన్షీరామ్ లాంటి మహనీయులు పేద ప్రజలకు చేసిన సేవలను గురించి పాటలుగా మలిచి ప్రజలకు వివరిస్తూ, కుల నిర్మూలన దిశగా ప్రతి ఒక్కరు అడుగులు వేయాల్సిందిగా పిలుపునిస్తూ, వారే స్వయంగా కొత్త పాటలు రాసుకుని పాడుతూ ఆడియో క్యాసెట్ లుగా రూపొందించి జనంలో ప్రాచుర్యం పొందారు. అదేవిధంగా ఈ "దరువు కళాబృందం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కోరుతూ జరిగిన ఉద్యమంలో కీలక పాత్రను పోషించింది.

### 1. 7. రచన ప్రారంభం తొలి రచన:

సిద్దెంకి యాదగిరి 1998లో డిగ్రీ విద్యను అభ్యసిస్తున్నప్పటి నుండే చిన్న చిన్న కథలు, కవితలు రాసినప్పటికీ, ఆర్ట్స్ కాలేజీ *"ప్రజ్ఞా మ్యాగజైన్"*లో ప్రచురితమైన 'సెమట చదువులు'(2002) అనేది తొలి కవితగా వికీపీడియా ద్వారా తెలుస్తున్నది. ఆ కవిత ఇలా కొనసాగుతుంది.

"గ్లాసుతో నీరు దారెత్తి తాగుతుంటే
పూటగడవని కన్నీళ్ళు
మాపటాకలి తీర్చిన మంచినీళ్లు గుర్తుకొస్తయ్
పాయసం జూస్తే పిండి పాషమనిపించే
చపాతి జూస్తే జొన్న రొట్టె యాదికొచ్చే"

(సెమట సదువులు: పుట: 16)

అంటూ కన్న తల్లిదండ్రులను విడిచి, ఉన్న ఊరిని వదిలి క్యాంపస్ ఆవరణలోకి వచ్చిన తర్వాత తన ఊరిలోని జ్ఞాపకాలను తను అనుభవించిన కష్టాలను తలచుకుంటూ రాసిన కవిత చదువుతుంటే కంటతడి పెట్టిస్తుంది.

## 1. 8. సిద్దెంకి యాదగిరి రచనలు పరిచయం:

సిద్దెంకి యాదగిరి కవిత్వం, కథలు, సమీక్ష, పరిశోధన మొదలైన ప్రక్రియలలో రచనలు చేశారు. అవి *మా తొవ్వ* (కవితా సంపుటి) 2004, *బతుకు పాఠం* (కవితా సంపుటి)-2014, *తప్ప* (కథల సంపుటి) 2016, *అచ్చు* (కవితా సంపుటి) 2020, *తొండం బొక్కెన* (కథల సంకలనం) 2021.

### 1. 8. 1. మా తొవ్వ (2004):

1998 నుండి మొదలుకొని 2004 వరకు రాసిన కవితలన్నిటిని కలిపి కవితా సంపుటిగా తీసుకురావడం జరిగింది. ఇందులోని కొన్ని కవితలు వివిధ పత్రికల్లో ప్రచురితం అయ్యాయి.

ఇది సిద్దెంకి యాదగిరి తొలి కవితా సంపుటి. 20 డిసెంబర్ 2004లో ఠాగూర్ ఆడిటోరియం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన దరువు 5వ వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రజా గాయకుడు గద్దర్ గారి చేతులమీదుగా ఆవిష్కరించగా, దీన్ని దరువు ప్రచురణల సంస్థవారు ప్రచురించారు.

ఈ కవితా సంపుటిలో మొత్తం 30 కవిత ఉన్నాయి. ప్రధానంగా ఈ కవితలన్నీ సమాజాన్ని పట్టి పీడిస్తున్న దోపిడిని నిలదీస్తూ, సాంఘిక అసమానతల్లో ఉన్న దారుణాన్ని తిరస్కరిస్తూ, ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక అసమానతలకి, అణచివేతలకి వ్యతిరేకంగా వెలువడిన విస్ఫోటనం ఈ కవితా సంపుటి.

"కర్మ పేరుతో ధర్మం
అస్పృశ్యతను కొనసాగిస్తూ
సమానత్వం లేని మత పిచ్చి తీర్థం పుచ్చుకుని
మనమంతా ఒక్కటనే అర్థం
మనుషుల్లో ఎక్కడుంది?"

(నా పోరాటమే నా సందేశం: పుట: 01)

అంటూ ప్రశ్నిస్తూ మనిషిని మనిషిగా చూడని నాగరికత సంస్కృతి సాంప్రదాయ దురాచారాలు రూపుమాయాలంటూ ఆకాంక్షిస్తూ, సామాజిక న్యాయం కోసం, సమూల మార్పు కోసం, తమదైన భాషలో తమ గాయాల్ని, కాయాన్ని తరిచి చూసుకున్నప్పుడు వెలువడిన బాధ సందర్భాలే ఈ సంపుటిలోని కవితలు.

## 1. 8. 2. బతుకు పాఠం:

ఇది సిద్దెంకి యాదగిరి రెండవ కవితా సంపుటి. దీన్ని 2014లో దరువు ప్రచురణ సంస్థ వారు ప్రచురించారు.

అక్షరానికి దూరం చేయబడిన ప్రాంతం నుండి, ఊరి చివరి వాడ నుండి, అక్షరం యొక్క గాలి సోకని కుటుంబం నుండి, వాడ నుండి, కట్టు దాటి ఇక్కట్లు దాటి కవిత్వం అందుకోవడం అనేది ఒక విప్లవ సంకల్పంగా భావించవచ్చు. నిత్యం తన చుట్టూ ఉండే మిత్రుత్వం అక్షరాల పొందిక ఒక ఆటలాగా ఉంటుందని, మంచి పొందికను చదివి అక్షరాలు వ్రాసినప్పుడు కలిగే ఆనందం అంతా ఇంతా కాదంటాడు. అదేవిధంగా అక్షరాలను కొందరు పొందిక కోసం రాస్తే, ఇంకొందరు జీవితాన్ని చిత్రించడానికి రాస్తారు. ఇందులో రెండవ రకంకు చెందినవాడు సిద్దెంకి యాదగిరి. ఈ క్రింది కవితను చదివినప్పుడు స్పష్టంగా మనకు అర్థమవుతుంది.

**అసమానతలపై అక్షరాల పంజా ఎత్తి**
**అజ్ఞానంపై అక్షర దాడి చేయడానికి చైతన్యం పంపుతున్నా**
**ఆత్మీయత అక్షరాలై**
**చదువురానోళ్ళను అల్లుకుంట**
**చదివేటోళ్ల సారమై జవాబిస్తా**
**ఉదయం లేచింది మొదలు**
**ఊపిరి ఉన్నంతవరకు అక్షరాలే జీవితం**

(అక్షరాలా జీవితం: పుట: 34)

అంటూ అందరూ డబ్బులను ప్రేమిస్తూ ఉంటే యాదగిరి అక్షరాలని ప్రేమించారు అక్షరాలతోనే జీవిస్తానని ప్రకటించుకున్నాడు. కవిత్వాన్ని సాధనంగా పూని తన చుట్టూ ఉండే జీవితాలను ప్రతిబింబించడమే పనిగా అడుగులు వేస్తున్నారు. ఈ సంపుటిలోని కవితల నిండా అలుముకున్న తెలంగాణ పల్లె తల్లుల కడుపు కోత, తెగించిన తెలంగాణ పోరాట పటిమ స్పష్టమవుతుంది.

## 1.8.3. తప్ప(2016):

ఇది సిద్దెంకి యాదగిరి యొక్క తొలి కథల సంపుటి. 2016లో దీన్ని తెలంగాణ రచయితల సంఘంవారు ప్రచురించారు. తన చిన్నతనంలో తనకు కథలు, (శాత్రాలు) చెబుతూ తనకు కథల పట్ల ఆసక్తిని కలిగించిన తన నానమ్మ అయినా సిద్దెంకి మల్లవ్వకు ఈ పుస్తకం అంకితం ఇవ్వడం జరిగింది. ఇందులో మొత్తం పదిహేను కథలు ఉన్నాయి ఒక కథా వస్తువుతో మరొక కథా వస్తువు కు సంబంధం లేకపోవడం అనేది వీటి ప్రత్యేకత, వేటికవే భిన్నమైన వస్తువులు.

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ గురించి అంటరానితనం గురించి తెలంగాణ ఉద్యోగాలను ఆంధ్రా వాళ్ళు ఏ విధంగా దోచుకుంటున్నారో వివరిస్తూ, తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా అన్యాయానికి

గురవుతున్నదో తెలుపుతూ, మొక్కవోని ధైర్యంతో పోరాడి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంను ఎలా సాధించుకోవాలెనో బోధన చేస్తూ, వీటితో పాటుగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మధ్య ఉండవలసిన అవినాభావ సంబంధాలను గురించి చైల్డ్ లేబర్ లపై జరుగుతున్న హింసనునిరసించారు. ఏడు పదుల స్వతంత్ర భారతదేశంలో స్త్రీల పైన నిరంతరం జరుగుతున్న లైంగిక దాడి, హింస, దౌర్జన్యాలను గురించి మన కళ్ళకు కట్టినట్టుగా తన కథల ద్వారా వివరించారు.

అదే విధంగా అత్యంత దయనీయంగా జీవితాలను గడుపుతున్న దళిత, దళిత ఉపకులాల వారి ఎతలను, సామాన్య పాఠకులకు సైతం అర్థమయ్యేలా సరళంగా కథలు రాస్తూ, తన సామాజిక బాధ్యతను నిర్వర్తించాడు. తను రాసిన కథలకు బలం అతని భాష. ప్రజల నుడికారాలు, సామెతలు, పదబంధాలు ఈ పుస్తకానికి పుష్టిని చేకూర్చాయని చెప్పుకోవచ్చు.

## 1.8.4. అచ్చు(2020):

ఇది ఇతని మూడవ కవితా సంపుటి 2020లో దీన్ని మంజీరా రచయితల సంఘం వారు ప్రచురించారు. ఇందులో మొత్తం 59 కవితలు ఉన్నాయి. మాదిగ తత్వం, దళిత బహుజన తత్వం గురించి రాసిన కవితలు 30 ఉన్నాయి. సమకాలీన అంశాలపై రాసినటువంటి కవితలు 14 ఉండగా తన బాల్యం మరియు ఊరి జ్ఞాపకాలను స్మరించుకుంటూ రాసిన కవితలు 15 ఉన్నాయి.

## 1. 8. 5. తొండం బొక్కెన(2021):

ఇది ఉభయ తెలుగు రాష్ట్రాల తొలి దళిత కథా వార్షిక తొండం బొక్కెన కథాసంకలనం. దీన్ని 2021లో జంబూ సాహితి సంస్థ వారు ప్రచురించారు. ఈ సంకలనం యొక్క సంపాదకులు సిద్దెంకి యాదగిరి, గుడిపల్లి నిరంజన్, తప్పెట ఓదయ్య ఈ ముగ్గిరిలో సిద్దెంకి ముఖ్య పాత్ర పోషించారు. దీనిలో ఆచార్య కొలకలూరి ఇనాక్, జూపాక సుభద్ర, గోగు శ్యామల, వేముల ఎల్లయ్య, జిలుకర శ్రీనివాస్, డాక్టర్ పసునూరి రవీందర్, ఎండ్లూరి మానస, డాక్టర్ గడ్డం మోహన్ రావు మొదలైనటువంటి రచయితలు రాసిన కథలు ఉన్నాయి. బడుగు బలహీన వర్గాల ప్రజల జీవనంలో ఉన్న ఎన్నో సంఘర్షణల సంఘటనలు, పోరాటాలు, సంస్కృతి, కుల వృత్తుల జీవన వైవిధ్యంను ప్రతిబింబించే కథలు ఈ సంకలనంలో కనిపిస్తాయి.

## 1. 9. వృత్తి – ప్రవృత్తి:

సిద్దెంకి యాదగిరి వృత్తి రీత్యా వేములఘాట్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఈయన ప్రవృత్తి కవిత్వం, కథలు మరియు వ్యాసాలు రాయడం తన ప్రవృత్తిగా మార్చుకున్నాడు.

## 1. 10. సిద్దెంకి వివిధ సాహితీ సంస్థల అభినివేశం:

రచయిత సంఘంలోని వివిధ సాహిత్య సంస్థలతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, సంబంధం కలిగి ఉండటం అనేది సహజమైన విషయం. తను విద్యార్థిగా ఉన్నప్పటి నుండే రచనలు చేయడం ప్రారంభించడం వలన అనేకమంది సాహితీవేత్తలతో మరియు అనేక సాహితీ సంస్థలతో పరిచయాలను ఏర్పరుచుకున్నాడు.

ప్రస్తుతం సిద్దెంకి యాదగిరి మంజీరా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగాను, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి గా పని చేస్తున్నాడు. వీటితో పాటుగా ఫేస్బుక్ వేదికగా జంబూ సాహితీ పేరా మరియు తెలుగు సిరి, మరసం మంజీరా అనే యూట్యూబ్ ఛానల్స్ లలో అనేక సాహిత్య చర్చలు, సమావేశాలు నిర్వహిస్తున్నాడు.

## 1.11. సన్మానాలు సత్కారాలు:

2014లో జనార్ధన మహర్షిగారిచే ఉత్తమ పురస్కారం పొందారు. 2015లో నవతెలంగాణ పత్రిక తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కవితా పోటీలో ద్వితీయ బహుమతి పొందాడు. 2016లో నవతెలంగాణ పత్రిక ద్వితీయ వార్షికోత్సవ కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందాడు. 2017లో నమస్తే తెలంగాణ పత్రిక నిర్వహించిన కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందాడు. 2018లో వేముగంటి సాహిత్య పురస్కారం అందుకున్నాడు. ఇదే సంవత్సరం తొగుట మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందాడు, దీనితో పాటుగా ఉపాధ్యాయ వృత్తి ద్వారా విశిష్ట సేవలను అందిస్తున్నందుకుగాను 2019లో సిద్దిపేట జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కైవసం చేసుకున్నాడు. కథానిక ప్రక్రియాలో సిద్దెంకి  యాదగిరిగారికి తెలుగు విశ్వ విద్యాలయం వారు ప్రకటించిన తెలుగు సాహిత్య పురస్కారాలు 2019వ సంవత్సరంలో ఉత్తమ కథానిక సంపుటిగా బహుమతిని గెలిచింది.

## రెండవ అధ్యాయం.

# *"బతుకు పాఠం"* కవిత్వం – వస్తు వైవిధ్యం

ఈ అధ్యాయంలో వస్తువును నిర్వహించి దాని లక్షణాలను తెలిపి, "*బతుకు పాఠం*" కవితా సంపుటిలో ఉన్నటువంటి వివిధ కవితలలో కనిపించే వస్తు వైవిధ్యాన్ని వివరిస్తాను.

### 2. 0. వస్తువు(Content):

మొదటగా వస్తువుకి నిఘంటువులలో ఉన్న అర్థాలను తెలియజేస్తాను.

- శబ్దరత్నాకరంలో వస్తువు అంటే పదార్థం, బండము అనే అర్థాల్నిచ్చారు. (*శబ్దరత్నాకరం*: పుట: 827)
- జి.ఎన్. రెడ్డిగారు రాసిన పర్యాయపద నిఘంటువులో వస్తువు అనే పదానికి ఉరువు, క్రయ్యము, క్రేయము, దినుసు, పదము, పదార్థము, అనే అర్థాలున్నాయి. (తెలుగు పర్యాయ పద నిఘంటువు: పుట: 126)
- బూదరాజు రాధాకృష్ణ రాసిన "*ఆధునిక వ్యవహార కోశం*"లో వస్తువుకి భావం, విషయం అనే అర్థాలు చెప్పారు. (*ఆధునిక వ్యవహార కోశం*: పుట: 77)
- తెలుగు అకాడమీ వాళ్ళు ప్రచురించిన "*తెలుగు-తెలుగు నిఘంటువు*"లో వస్తువుని పదార్థం, ఇతివృత్తం,కథాంశం, విషయం అనే అర్థాలు చెప్పారు. ("*తెలుగు – తెలుగు నిఘంటువు*": పుట: 114)
- వస్తువుని ఇంగ్లీషులో content అంటారు. ఈ content అనే పదానికి బ్రౌణ్య ఇంగ్లీషు – తెలుగు నిఘంటువులో తృప్తి పొందిన, సంతుష్టి పొందిన, సమ్మతించిన, ఒప్పిన, అంగీకారము అనే అర్థాలున్నాయి. (*బ్రౌణ్య ఇంగ్లీషు-తెలుగు నిఘంటువు*: పుట: 219)

  వస్తువును గురించి మన తెలుగు నిఘంటు కర్తలు వారి వారి నిఘంటువుల్లో పైన పేర్కొన్న విధంగా అర్థాలు తెలిపారు.

సాహిత్య రచన గురించి చర్చించేటప్పుడు రెండు అంశాలు ప్రధానంగా ముందుకు వస్తాయి. రచన ఏం చెబుతుంది. దానిని వ్యక్తీకరించడానికి అనుసరించిన పద్ధతి ఏమిటి అనేవి, రచన ఏం చెబుతుంది అనేది ఆ రచన వస్తువు అవుతుంది.

## 2. 1. వస్తువు లక్షణాలు:

సాహిత్యంలో వస్తువే కవిత్వంలో వస్తువు అవుతుంది. కవిత్వంలో అభివ్యక్తమయ్యే వస్తు లక్షణాలను ఈ క్రింది విదంగా అంచనా వేయవచ్చు.

- *"ఒక భావనను తీసుకోవటం ప్రధానం. దీన్నే కొంత మంది 'ఇతివృత్తం' అంటారు.*
- *తీసుకున్న భావన లౌకిక, అలౌకికమైన దానిలో ఏదైనా కావచ్చు.*
- *వస్తువు కళాత్మకత పొందటానికి ఆధారమవటం.*
- *కవి చెప్పదలచుకున్న ఆశయం ఉండటం.*
- *కవి చెప్పదలచుకున్న ఆశయం అనేక భావనలతో చెప్పగలగటం.*
- *ఒకే భావన తీసుకున్న కవికి కవికి మధ్య భేదం*
- *చలన శీలమై కాలంతో పాటు కొత్త కొత్త వస్తువులు తయారవుతుండటం.*
- *వస్తువుని రూపం, రూపాన్ని వస్తువు అధిగమించే స్థితి కవి అభివ్యక్తిని బట్టి కలుగుతుంటుంది.*
- *వస్తువు రూపంతో కలిసి ఉంటుంది. వీటి మధ్య వైరుధ్యం లక్షణమై పరస్పర*
- *విరుద్ధమైన రెండు విడదీయరానివిగా ఉంటాయి.*
- *వస్తువు సరిగ్గా వ్యక్తం కావాలంటే సరైన రూపం ఉంటేనే సాధ్యమవుతుంది".* (*స్వాతంత్ర్య అనంతర తెలుగు కవితా వస్తువు రూపం–శిల్పం*: పుట: 25)

## 2. 2. వస్తువు నిర్వచనాలు:

*"కవి లేదా రచయిత తను చెప్పే ప్రధాన విషయాన్ని వస్తువు అనవచ్చు. Content అనే ఇంగ్లీషు పదాన్ని వస్తువు అని తెలుగులో వాడుతున్నాము. సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భాగాన్ని వస్తువు అనవచ్చు. రచయిత, సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు".* (మధుసూదన రావు త్రిపురనేని. సాహిత్యంలో వస్తు–శిల్పాలు. పుట;13)

*"కవి ఎంచుకున్న అంశమే వస్తువు. ఒకానొక దృగ్విషయంలో ప్రత్యేకంగా నియమ బద్ధంగా ఉన్న మూలకాల క్రమ విధానాలమొత్తమే వస్తువు. మనిషి మానవ సంబంధాలు సామాజిక జీవితం వస్తువు అవుతుంది. కవిత్వంలో వ్యక్తమయ్యే ప్రధానమైన contentను వస్తువుగా చెప్పుకోవచ్చును".* (లక్ష్మీకాంతం పింగళి సాహిత్య సాహిత్య శిల్ప సామీక్ష. పుట;39)

*"కవిత్వేతి వృత్తం కవిత్వం దేనిని గురించి రాస్తామో అది కవిత్వంలో వ్యక్తమయ్యే ప్రధాన భాగం వస్తువు".* (చెన్న కేశవ రెడ్డి జి.1999 పుట;06)

### 2. 3. *"బతుకు పాఠం"* కవిత్వం – తాత్వికత అంశాలు:

సిద్దెంకి యాదగిరిగారు రాసిన ఈ "*బతుకు పాఠం*" కవితా సంపుటిలో మొత్తం 55 కవితా ఖండికలు ఉన్నాయి. ఈ కవితా సంపుటానికి డా. నందిని సిధారెడ్డి, డా. దరువు ఎల్లన్న వంటి ప్రముఖులు ముందుమాట రాసారు.

"*బతుకు పాఠం*" కవితా సంపుటిలో విభిన్న కవితా వస్తు వైవిధ్యం ఉంది. ఈ అధ్యాయంలో ఈ సంపుటిలోని వస్తు విశేషాలను వివరిస్తాను.

నళినిగారు రాసిన సాహిత్య విమర్శ పదాల డిక్షనరీలో తాత్విక కవిత్వానికి 'ఫిలసాఫికల్ పోయమ్' అనే ఆంగ్ల పదం సమానార్థంగా ఉంది అని ప్రస్తావించారు. "*ప్రకృతి గురించీ, మానవుల ఉనికి గురించీ, జీవితం గురించీ, ఆధ్యాత్మిక సంబంధమైన అంశాల గురించీ రాసిన కవిత్వం*". (సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ: పుట: 80)

మానవుని అంతిమ స్థితి వైరాగ్యం. వైరాగ్యంలో స్థితప్రజ్ఞతో చెప్పే విషయాలే కాస్త తాత్వికత ధోరణి కలిగి ఉంటాయి. కవి కవిత రాసే క్రమంలో తను అనుభవించిన సంగతులను తాత్విక దృక్పథంతో కవిత్వంగా మార్చుతాడు. కవి ఎంచుకునే వస్తువు వెనుక ఎన్నో కారణాలు ఉంటాయి. అందులో తాత్వికత ఒక కారణం. తాత్వికతను ఒక వస్తువుగా గమనించినట్లైతే అందులో ప్రతిబింబించే అంశాలైన సందేశం, జీవితం, వైరాగ్యం మొదలైన వాటిని కవితా వస్తువులుగా చెప్పుకోవచ్చు.

#### 2. 3. 1. జీవితం:

మానవుడే ఈ సృష్టిలో కెల్లా తెలివైన జీవి. కానీ మానవుడు ఈ ఆధునిక కాలంలో పడే సంఘర్షణలను ఎదుర్కోలేక జీవితాన్ని నాశనం చేసుకుంటున్నాడు. సిద్దెంకి యాదగిరిగారు రాసిన 'ఆదర్శ జీవితం' అనే కవితా ఖండికలో మానవుని జీవితం పట్ల తన అభిప్రాయాన్ని ఈ క్రింది విధంగా చెప్పారు.

"యుద్ధ వీరుని పోరాట పటిమ
విజయమైతే గర్వం
చంపి చావటమే వీరమరణం
ఆత్మహత్య చేస్కోవటం
పిరికి తనం గాదా ?"

(ఆదర్శ జీవితం: పుట: 19)

సిద్దెంకి యాదగిరిగారు సమాజంలోని ప్రజల బతుకు పోరాటం ఏ విధంగా ఉంటుందోనని తన కవితల ద్వారా తెలియజేస్తున్నారు. జీవితం అంటేనే పోరాటం, అనేక సమస్యలతో నిండింది.

సమస్యలను చూసి పారిపోకూడదు పోరాడాలి. అంతేకానీ పిరికితనంతో వచ్చిన సమస్యలను చూసి ఆత్మహత్య చేసుకోకూడదని ఈయన చెబుతున్నారు.

నిరాశ జీవులుగా కొట్టుమిట్టాడుతున్న మానవులను మేల్కొలిపే రీతిలో సిద్దెంకి యాదగిరి గారు ఈ క్రింది వాక్యాలను రాశారు.

"రైతు శమట జాలుతో నాగటి చాల్లల్ల పడిన విత్తు
పురిటి నొప్పులు దీస్తు చచ్చిపోయి
అనేక మొలకలకు జన్మనివ్వకుంటే
చచ్చిన సంతృప్తి మిగులుతుందా?"

(ఆదర్శ జీవితం: పుట: 18)

అంటూ విత్తనంను కవితావస్తు కేంద్రంగా తీసుకుని కవితానిర్మాణం చేశారు. ఒక విత్తు భూమిలో చేరి వేల మొక్కలను ఉత్పత్తి చేస్తుంది. అనే ఈ సందేశాన్ని చూస్తే మనకు కాళోజీ గారు '*ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు పదునుపెడుతుందన్న'* వాక్యాలు గుర్తుకు వస్తాయి. ఈ కవితా పంక్తులలో చివరిగా ఒక విత్తనం ద్వారా సమాజానికి ఈయన సందేశం ఇస్తున్నారు.

"ఓటమితో గెలుపు జీవితం ప్రారంభించాలి
అందుకే గుణపాఠంతో గుండెరాయి జేసుకుని
ఒత్తిడిని తట్టుకుని
అవమానాన్ని గెలిచినపుడే గదా!
ఆదర్శ జీవితం
అందరికీ వెలుగు అయి
దిశా నిర్దేశం చేసేది"

(ఆదర్శ జీవితం. పుట;19)

మానవుడు ఆధునిక కాలంలో ఎదుర్కొనే సంఘర్షణ ఓటమి. ఓటమి ఎదురైన ప్రతిసారీ కొంత మంది చతికిలపడుతుంటారు. కానీ సిద్దెంకి యాదగిరిగారు ఓటమిని గెలుపుగా మలుచుకుని గెలుపుకు బాటలు వేయాలని ఈ కవితా ఖండిక ద్వారా అంటున్నారు. ఎవరో మనల్ని అవమానించినంత మాత్రాన పోయేదేమీలేదు. ఒత్తిడిని జయించి ముందుకు సాగితేనే ఉజ్వల భవిష్యత్తు ఉందంటూ

ఈయన ఈ 'ఆదర్శ జీవితం' అనే కవితా ఖండికలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జీవితాన్ని కవితా వస్తువుగా తీసుకున్న కవితా ఖండిక 'హెచ్చరిక'.

"జీవితమంటే కలగాదు బిడ్డలారా!
జీవన్మరణ జిడ్డు అపురూపం గాదు అలజడి
పద్మవ్యూహం ఛేధించాలంటే
ఇళ్లు దాటే ముందు ఇగురం ముఖ్యం"

(హెచ్చరిక: పుట: 25)

సిద్దెంకి యాదగిరిగారు జీవిత పోకడను ఈ కవితా ఖండిక ద్వారా తెలిపారు. కొంతమంది కలల ప్రపంచంలో జీవిస్తూ, ప్రస్తుత జీవితాన్ని మరచిపోతుంటారు. కానీ జీవితం చాలా పాఠాలు నేర్పుతాయంటూ శ్రీ శ్రీగారు రాసిన "*మహాప్రస్థానం*"*లోని* 'ఋక్కులు' అనే కవితా ఖండికలో ప్రపంచాన్ని పద్మవ్యూహంతో పోల్చారు. అదేవిధంగా సిద్దెంకిగారు జీవితాన్ని పద్మవ్యూహంతో పోల్చారు.

## 2. 3. 2. అమాయకత్వం:

సిద్దెంకి యాదగిరిగారు రాసిన ఈ *"బతుకు పాఠం"* అనే కవితా సంపుటిలో బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజల జీవన విధానాన్ని చిత్రించబడింది. అదేవిధంగా ఈ సంపుటి బహుజన వాదానికి చెందిన కవితాసంపుటి. ఈ సంపుటిలో 'బతుకు పాఠం' అనే కవితా ఖండిక సంభాషణ రీతిలో సాగుతుంది. ఇటువంటి సంభాషిత కవితలను గూర్చి జి. లక్ష్మీనరసయ్యగారు "*కవిత్వం చర్చనీయాంశాలు*" అనే తన విమర్శ గ్రంథంలో ఇలా వివరించారు. ఒక్కోసారి భావం కవిత్వంగా మారడానికి సంప్రదాయకంగా పేరుమోసిన కవిత్వ సామాగ్రి అవసరంలేదు. తనలో నలుగుతున్న భావాన్ని కవి ఒక సహజ సంభాషణగా ప్రవేశపెట్టి కూడా కవిత్వం సృష్టిస్తాడు. భావాన్ని సంభాషణగా ప్రవేశపెట్టే కవులు సాధారణంగా రోజువారి జీవితంలో దొర్లే నుడికారాల మీద, మాట్లాడే అలవాట్ల (Speaking manners) మీద, ఇంకా ప్రాంతీయ యాసమీద ఆధారపడతారు. అంటే జీవితంలో లభించే నుడికారాన్ని, మాట్లాడే అలవాట్లనీ, యాసనీ తగిన మార్పులు చేసి ఏర్చి కూర్చి ఒక సంభాషణను నిర్మించడం వల్ల కవిత్వం ఏర్పడుతుంది. (*కవిత్వం చర్చనీయాంశాలు*: పుట: 67)ఇందులో సంభాషించే వ్యక్తులు విద్యార్థి,ఉపాధ్యాయుడు. ఈ కవితా ఖండికలో వెనుకబడిన తరగతి వ్యక్తుల మనస్తత్వం, అమాయకత్వం ఎలా ఉంటుందో చక్కగా చిత్రించారు.

"హోంవర్కు ఎందుకు చెయ్యలేదు
కాపీ లేద్సార్
ఏం పేరు
పవీన్

తెచ్చుకోపోయినవ్
మా నాయిన తేడు
మీ నాయిన ఎంజేస్తడు
బుగ్గలు అమ్ముతడు
మీ అమ్మ ఏం చేస్తది
ఎంట్రుకల బ్యారం
మరెట్ల సదువుటవురా"

(బతుకు పాఠం: పుట: 31)

అంటూ ఈ కవితలో హోం వర్క్ చేయని ఒక విద్యార్థిని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తూ కవిత మొదలవుతుంది. విద్యార్థి యొక్క కుటుంబ పరిస్థితిని ఉపాధ్యాయుడు తెలుసుకునే క్రమంలో ఈ కవితా నిర్మాణం జరిగింది. ఎత్తుగడ ఒక ప్రశ్నతో మొదలైన ఈ కవిత క్రమేన ఆ విద్యార్థి యొక్క కుటుంబ పరిస్థితి తెలుసుకోవడం ధ్యేయంగా ఈ కవిత సాగుతు ఉంది. ఉపాధ్యాయుడు విద్యార్థిని ప్రశ్నించిన తీరు చక్కటి క్రమంలో ఉంటుంది. ఆ విద్యార్థి తన తల్లిదండ్రులు చేసే పని చెప్పే సందర్భంలో పాఠకునికి కాస్త బాధ కలిగించే విధంగా పదజాలాన్ని సిద్దెంకిగారు ఉపయోగించారు. సాధారణ బుడగలు, ఎంట్రుకలు అమ్ముకునే వారు ఇతని తల్లిదండ్రులు అని తెలుసుకున్న ఉపాధ్యాయుడు ఈ నేపథ్యంలో ఎలా చదువుతావురా? అని ప్రశ్న ఉపాధ్యాయుడు విద్యార్థిని ప్రశ్నించినట్టు ప్రతి పాఠకుని మదిలోను ఈ ప్రశ్న కలుగుతుంది. సిద్దెంకిగారు ఈ బతుకు పాఠం కవితా ఖండికలో ఆ విద్యార్థి కుటుంబ పరిస్థితిని ఈ క్రింది విధంగా చిత్రీకరించారు.

"ఎక్కడ మీ యిల్లు
చెట్టుకింద
ఆ...
కరంటి వున్నదా
గుడిసె మీదికేలి పోతది
బట్టలు
పాతయి అడుక్కుంటం
తిండెట్లా
మధ్యాహ్న భోజనం బడిల

దొరికితె తింటం లేకుంటే ఉపాసముంటం"

(బతుకు పాఠం: పుట: 32)

ఇందులో ఆ విద్యార్థి యొక్క కుటుంబ పరిస్థితిని ఈయన చిత్రించారు. విద్యార్థిని ఉపాధ్యాయుడు మీ ఇల్లు ఎక్కడ అన్న ప్రశ్నకు చెట్టు కిందని విద్యార్థి సమాధానం ఇచ్చిన సందర్భంలో పాఠకునికి కాస్త బాధ కలుగుతుంది. అదేవిధంగా కవితను ముందు సాగిస్తూ మీ ఇంట్లో కరెంటు ఉంటుందా అన్న ప్రశ్నకు మా ఇంటి మీద నుండి వెళుతుందని విద్యార్థి చెప్పిన సమాధానానికి ఆ విద్యార్థి యొక్క అమాయకత్వం అందులో ప్రతిబింబిస్తుంది. చివరగా భోజనం గురించి అడిగినప్పుడు మధ్యాహ్నం బడిలో తింటాను లేకుంటే ఉపవాసం ఉంటానని విద్యార్థి చెప్పినప్పుడు పాఠకుని మది కలచివేస్తుంది. ఇక్కడ ఆ విద్యార్థి అన్నం దొరకని సందర్భంలో పస్తులు ఉంటాం అనే వాక్యాన్ని ఉపయోగించకుండ ఉపవాసం ఉంటాం అని ఆ విద్యార్థిచేత కవి చెప్పించడంలో ఉపయోగించిన భాషా శైలి చాలా గొప్పది.

## 2. 4. సామాజిక దృక్పథం:

*"సమాజ ప్రభావానికి మనుషులందరూ ఒకేరకంగా గురికారు. సామాజిక వాస్తవికత పట్ల అందరూ ఒకేరకంగా స్పందించారు. ఆయా మనుషుల పాదార్థిక వాస్తవికతకి అనుగుణంగానే వారి స్పందనలు, ప్రవర్తనలూ ఉంటాయి. ఇది వేడి ప్రభావానికి అన్ని పదార్థాలు ఒకేరకంగా మారకపోవటం లాంటిది. ఒకే వేడికి వెన్నకరుగుతుంది. గుడ్డు గట్టిపడుతుంది. పాలు ఆవిరౌతాయి. వేడి వల్ల ఇవన్నీ తాకితే కాలడం సాధారణమైనప్పటికీ కరగటం, గట్టిపడడం, ఆవిర్వటం అనేది మాత్రం వాటి వాటి ధాతు ధర్మానికి అనుగుణంగానే జరుగుతుంది. కనుక వేడి వివిధ పదార్థాల ధాతు ధర్మాలకు లోబడి వాటిని ప్రభావితం చేసినట్లే సమాజం మనుషుల్ని వారి ప్రత్యేక మానసిక వాస్తవికతకి లోబడి ప్రభావితం చేస్తుంది. అంటే ఒక మనిషి లోపలి నిర్దిష్ట మానసికతతో నిమిత్తం లేకుండా ఆ మనిషిని సమాజం మార్చలేదు. సమాజానికి మనిషికి ఉన్న ఈ గతితార్మిక సంబంధం కవులకీ సమాజానికీ మధ్య ఉన్న సంబంధానికీ వర్తిస్తుంది"*. (*కవిత్వం చర్చనీయాంశాలు*: పుట: 176) అని జి. లక్ష్మీనరసయ్యగారు రాసిన "*కవిత్వం చర్చనీయాంశాలు*'లో సామాజిక స్పృహ గూర్చి ఈ విధంగా నిర్వచించారు.

### 2. 4. 1. సినిమా:

సినిమా సమాజంపై అధిక ప్రభావం చూపుతుంది. అదేవిధంగా సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు చేర్చే ఒక ప్రసారమాధ్యమం. కాని నిర్మాతలు, దర్శకులు ధనార్జన ధ్యేయంగా సినిమాలలో కొన్ని ప్రాంతాల సంస్కృతిని, భాషని హేళన చేసే విధంగా సన్నివేశ కల్పనలను సినిమాల్లో ఉంచుతున్నారు. దీని వలన ఆ ప్రాంతాల యొక్క ప్రజల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉంది. ఈ విధంగా తెలంగాణ యాసను కొంతమంది సినిమాలలో హాస్య, నీచ పాత్రలకు ఉపయోగిస్తూ

కించపరుస్తున్నారంటూ సిద్దెంకి యాదగిరిగారు 'దేవులాట' అనే కవితా ఖండికలో ఈ కింది విధంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

> "సింధు దాసరి దరువులు
> యక్షగానాలు వీధిభాగోతుల మద్దెల సపుడు
> జడకొప్పు కోలాటంలో గురితప్పని గిరిగీత
> కోయిల కూతలు ప్రజల గొంతులయ్యేవి
> రంజిల్లిన ప్రజా కళలు
> సీమాంధ్ర సినిమాల పెట్టుబడిల
> విలన్ల భాషకు విలవిలలాడుతుంది.
> పోయిన కాన్నె దేవులాట సురువుజెయ్యాలే
> యిత్తు వేసిన పొత్తును చిత్తు చిత్తు చేయ్యాలె
> మనకళలను మనం కాపాడు కోవాలె"

(దేవులాట: పుట: 38)

దాసరి దరువులు, యక్షగానం, వీధి భాగోతం, జడకోప్పు కోలాటం మొదలైనవి తెలంగాణ కళారూపాలు సంస్కృతిలో భాగంగా నిలిచాయి. ఇలాంటి ప్రాచీన కళారూపాలు ఉన్న తెలంగాణా సంస్కృతిని కొంత మంది సీమాంధ్ర సినీ నిర్మాతలు, దర్శకులు సినిమాలలో కాస్త కించపరిచే విధంగా చూపుతున్నారు. దీనికి తీవ్ర ఆవేదనకు గురైన సిద్దెంకి యాదగిరిగారు వారి ప్రవర్తనలను ఎండగట్టే విధంగా పై కవితా పంక్తులు రాశారు. ఈయన కొన్ని సందర్భాలలో తెలంగాణాకు సంబంధించిన మాండలిక భాషను కూడా హాస్య, నీచ పాత్రలకు ఉపయోగిస్తున్న తీరును విమర్శించారు.

### 2. 4. 2. చేనేత కళ:

చేనేత కార్మికుల జీవితాన్ని వస్తువుగా తీసుకుని సిద్దెంకి యాదగిరిగారు ఈ కవితా ఖండిక రాశారు. ప్రపంచీకరణలో భాగంగా వచ్చినటువంటి అనేక యంత్రాల వలన తమ జీవనోపాధిని కోల్పోయి దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్న చేనేత వృత్తి కార్మికుల కష్టాల కన్నీటి దృశ్యమే ఈ కవితా ఖండిక.

> "మగ్గమేసే నేత జీవితం దినదినము మగ్గిపోతూ
> అప్పుల్తో బుగ్గిపాలయితంది
> కడుపునింపని పనితనం మాదుపు మొకమేసి

వడికిన తక్లీదారం ఉరితాడై మెడచుట్టు బిగుసుకుంటుంది
విరామమెరుగని నేత ఒక్కతీరుగ ఎముకల్ని కొరుకుతది"

(చేనేత: పుట: 46)

మగ్గంనేసే యంత్రాలు రావడం వల్ల చేతి వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న అనేకమంది చేనేత కార్మికుల జీవితాలు అస్తవ్యస్తమయ్యాయి. ఉపాధి కరువవ్వడం వలన కుటుంబాన్ని పోషించలేక, ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకొని సతమతమవుతూ ఎంతో మంది చేనేత కార్మికులు ఉరికొయ్యకు వేలాడుతూ తనువు చాలిస్తున్న చేనేత జీవితాన్ని సిద్దెంకిగారు అక్షరీకరించారు.

2. 4. 3. కులం:

ఈ దేశంలో కొన్ని వర్గాల ప్రజలను వేల సంవత్సరాలుగా పట్టిపీడిస్తున్న మహమ్మారి కులం. నేటికీ కొన్ని జాతులను పశువులకన్నా హీనంగా చూస్తూ, వారిని అవహేళన చేస్తున్నారంటూ పీడితుల ఆవేదనను సిద్దెంకిగారు ఇలా వివరించారు.

"ఉమ్మి ముంత ముక్కు కొక్కెం
అడుగుల్ని మలిపే ఆకులు కట్టించి
పుట్టు వన్నెలు మాయం జేసినోళ్లు
అక్రమ పెట్టు వన్నెలు అద్దింద్రు
యిప్పటికీ కుల వివక్ష వెంటాడుతూంటే
తల కాటెక్కుతున్న బాధ కన్నీల్ల బాధ
కత్తులు అయి కోస్తుంది మనసును"

(చదువుతున్నాం: పుట: 51)

బ్రిటిష్ పాలన అంతరించి, భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 70 వసంతాలు దాటుతున్నా ఇప్పటికీ కొన్ని జాతులు అస్వతంత్రంగానే జీవిస్తున్నాయి. ప్రతిరోజు ఈ దేశంలో ఏదో ఒక మూలన బలహీన వర్గాల ప్రజల మీద దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఆధిపత్యం, అణిచివేత సజీవంగా కొనసాగుతూనే ఉందంటూ బడుగు జనుల బాధలను, వారు ఎదుర్కొంటున్న సాంఘిక పరమైనటువంటి అనేక సమస్యలను ఈయన ఈ కవితా ఖండిక ద్వారా తెలియజేశారు.

## 2. 5. తెలంగాణ సంస్కృతి – సంప్రదాయం:

తెలంగాణ చరిత్ర సంస్కృతులను గురించి సాధికారిక రీతిలో తెలిపే అనేక సాహిత్య ప్రక్రియలు గత కొంత కాలం నుండి విరివిగా వస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో నిరాకరణకులోనైన తెలంగాణ చరిత్ర సంస్కృతుల శోధన మరింగా కొనసాగవలసి ఉంది. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతానికి చెందిన కవులు సంస్కృతి, సంప్రదాయాలను కవితల, పాటల రూపాలలో చిత్రిస్తున్నారు. అదేవిధంగా సిద్దెంకి యాదగిరిగారు "*బతుకు పాఠం*" అనే కవితా సంపుటిలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకి చెందిన అంశాలను ప్రస్తావించారు.

మానవుడు ఉన్నత జీవితం గడపడానికి భౌతికంగా, మానసికంగా చేసే నిరంతర ప్రయత్నమే సంస్కృతి, వ్యవస్థ, రాజ్యం, మతం, కళలు, వస్తు పదజాలం, వేషభాషలు, ఆచార వ్యవహారాలు, అనుబంధాలు, పండగలు, జాతర్లు, కట్టుబాట్లు, కష్టసుఖాలు, పెనుగులాటలు, మొదలైనవన్నీ సంస్కృతి వ్యక్తీకరణలే.

ఆంధ్ర దేశంలో ఉన్న నాలుగు ప్రాంతాల్లోనూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు కాస్త భిన్నమైనవి. అందులోను ఈ ప్రాంతం ఆషాడ మాసంలో జరుపుకునే బోనాలు, ఆశ్వీజమాసంలో జరుపుకునే బతుకమ్మ పండగలకు మన దేశంలో చాలా విశిష్టత ఉంది.

### 2. 5. 1. తెలంగాణలో బతుకమ్మ పండగ విశేషాలు:

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం రాష్ట్ర పండుగగా బతుకమ్మను ప్రకటించి అధికారికంగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తుంది. ప్రతీ గల్లీలో, నగరంలో, పట్టణంలో, గ్రామంలో, పెద్ద పెద్ద నగరాల్లో ప్రధాన వీధుల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు నిర్వహిస్తుంది. ఇది తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన పండుగగా మనం జరుపుకుంటున్నాం.

*"తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంతో, ఆనందంగా సామూహికంగా జరుపుకునే అతి పెద్ద పండుగ బతుకమ్మ. పెండ్లి అయిన ఆడపిల్లలు, పెండ్లి కాని పిల్లలు, నడి వయసు వారు, ముసలివారు అందరూ వయసుతో నిమిత్తం లేకుండా చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ బతుకమ్మ పండుగను జరుపుకుంటారు. బతుకును ఇచ్చే తల్లి బతుకమ్మగా, ఊరిని రక్షించే దేవతగా జానపదుల పండుగగా ప్రసిద్ధి కెక్కిన బతుకమ్మ సంబరాలు ఆశ్వీజమాసంలో శరన్నవరాత్రులకు ముందు వచ్చే భాద్రపద బహుళ అమావాస్యనాడు జరుపుకునే 'ఎంగిలిపువ్వు బతుకమ్మ'తో మొదలయ్యి ఆశ్వీజ శుద్ధ అష్టమి(9వరోజు) నాడు చేసుకునే 'సద్దుల బతుకమ్మ'తో ముగుస్తాయి.*

తెలంగాణలో ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు ప్రతీకగా ప్రకృతితో మమేకమైన పండుగ బతుకమ్మ. బతుకమ్మ పండుగ వచ్చే కాలం వర్షాకాలం. ఈ కాలంలో ప్రకృతి అంతా పచ్చగా, అనేక జాతుల పూలతో వాతావరణమంతా చాలా రంగులమయంగా ఉంటుంది. ఇటువంటి సమయంలో శిష్టులు అమ్మవారి శరన్నవరాత్రులు చేస్తే, జానపదులు చేసే అమ్మవారి పూజ బతుకమ్మ. ఒకవిధంగా రెండూ శక్తి ఆరాధనే. ఆషాఢమాసం నుండి శక్తి ఆరాధన మొదలవుతుంది. శ్రావణం కూడ అమ్మవారికి ప్రీతికరమైన వ్రతాలు, నోములు చేసుకునే మాసం. అదేవిధంగా ఆశ్వీజ మాసంలో కూడా శక్తి ఆరాధన విశేషంగా చేస్తాం.

బతుకమ్మ పండుగకు ముందు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో బొడ్డెమ్మ పండుగను చేస్తారు. బొడ్డెమ్మ పండుగ భాద్రపద బహుళ పంచమి నుండి అమావాస్య వరకు అంటే ఎంగిలిపూవు బతుకమ్మ ప్రారంభమయ్యే వరకు చేస్తారు. ఇది ముఖ్యంగా కన్నెపిల్లలు చేసుకునే పండుగ. బొడ్డు, బొడ్డెమ్మ అంటే మధ్యలో ఉండేది. పూల మధ్యలో ఉంచే పసుపు గౌరమ్మ బొడ్డెమ్మ. మొదటిరోజు ఒక పీఠం మీద పుట్టమట్టితో చతురస్రాకారంలో గద్దెను ఏర్పాటు చేసి వెంపల్లె చెట్టును నిలిపి, పసుపు కుంకుమతో అలంకరించి పసుపు గౌరమ్మను నిలుపుతారు.

బొడ్డెమ్మ పండుగ పూర్తి అయ్యేనాటికి బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుంది. అది భాద్రపద బహుళ అమావాస్య దీన్నే పెత్రామాస (పితరుల అమావాస్య) అంటారు. ఇదే ఎంగిలిపువ్వు బతుకమ్మ అంటారు. బొడ్డెమ్మ పదిహేను రోజులు ఆడలేనివారు ఎంగిలిపువ్వు బతుకమ్మరోజు గౌరమ్మను నిలుపుకొని బతుకమ్మను పేర్చి ఆరోజు నుంచి 9 రోజులు బతుకమ్మను ఆడుతారు. ప్రతిరోజు ఒక నైవేద్యం అమ్మవారికి సమర్పిస్తారు. 9 రోజులు జరపుకునే బతుకమ్మకు ఆయా రోజుల్లో పెట్టే నైవేద్యాన్ని బట్టి బతుకమ్మకు ఆ పేరును పెట్టుకున్నారు.

1. మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ : ఈ రోజు బొడ్డెమ్మ పండుగ చివరి రోజు. పితృదేవతలకు తర్పణాలు, వారి పేరు మీద సాహిత్యం ఇవ్వడం, వారికి రకరకాల వంటకాలు చేసి నైవేద్యం సమర్పించడం చేస్తారు. నిజానికి భాద్రపద బహుళ పాడ్యమి నుండి పితృపక్షాలు ప్రారంభం ఆ 15 రోజుల్లో ఎటువంటి కార్యం చేయకపోయినా పెత్రామాసనాడు పితృదేవతలను తలచుకుని వారికి ప్రీతిగా సమర్పించడం ఆచారంగా ఉంది. ఎంగిలిపువ్వు బతుకమ్మ కూడా ఈరోజు రావడంతో వారికి సమర్పించిన నైవేద్యాలే గౌరమ్మకు కూడా సమర్పించడం జరుగుతుంది. ఇంకా నువ్వులు, బియ్యంనూక కలిపి నైవేద్యంగా సమర్పిస్తారు.

2. రెండవరోజు అటుకుల బతుకమ్మ : ఈరోజు అమ్మవారికి బెల్లం, అటుకులు, అటుకుల పాయసం నైవేద్యంగా సమర్పిస్తారు.

3. మూడవరోజు ముద్దపప్పు బతుకమ్మ: ముద్దపప్పు, పాలు, బెల్లంతో పదార్థం వండి నైవేద్యంగా సమర్పిస్తారు.

*4. నానేబియ్యం బతుకమ్మ: నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లంతో పాయసం చేసి నైవేద్యంగా గౌరమ్మకు నివేదిస్తారు.*

*5. అట్ల బతుకమ్మ: బతుకమ్మకు ఈరోజు అట్లు (దోశలు) నైవేద్యం పెడతారు.*

*6. అలిగిన బతుకమ్మ: ఆశ్వీజ శుద్ధ పంచమి బతుకమ్మ ఆరవరోజు. ఈరోజు బతుకమ్మకు నైవేద్యం ఏమీ సమర్పించరు.*

*7. వేపకాయల బతుకమ్మ: బియ్యంపిండిని దోరగా వేయించి నీళ్లు కలిపి వాటికి వేపకాయల ఆకారంలో చేసి వాటిని నైవేద్యంగా సమర్పిస్తారు.*

*8. వెన్నముద్దుల బతుకమ్మ: నువ్వులు, వెన్న, బెల్లంతో కలిపి ఉండలుగా చేసి బతుకమ్మకు నైవేద్యం పెడతారు.*

*9. సద్దుల బతుకమ్మ: ఇది బతుకమ్మ పండుగకు సంబంధించి చాలా విశేషమైన రోజు. తొమ్మిదిరోజులు చిన్నమొత్తంలో పేర్చిన బతుకమ్మను ఈరోజు చాలా పెద్దగా పేరుస్తారు. ఈరోజు గౌరమ్మను పెట్టుకొని పూజ చేసి బతుకమ్మను పేర్చిన తర్వాత అగ్రంలో గౌరమ్మను నిలిపి దీపంతో తీసుకువెళ్ళి ఆడతారు. ఈరోజు అమ్మవారికి 9 రకాల సద్దులు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. పెసర సద్ది, నువ్వు సద్ది, కొబ్బరి సద్ది, బెల్లం అన్నం, పెరుగు అన్నం (దద్ద్యోదనం), పులిహోర, చిత్రాన్నం, చక్కెర పొంగలి, కట్టెపొంగలి".* (మనోహరి. భిన్నూరి, తెలంగాణ మాస పత్రిక, ఇ మ్యాగజిన్) ఈ విధంగా బతుకమ్మ పండుగను జరుపుకుంటారు.

సిద్దెంకి యాదగిరిగారు ఈ బతుకమ్మ పండగను గురించి వర్ణించిన కవిత 'దేవులాట' అనే కవితా ఖండిక.

"చేమంతి బంతి గడ్డి గన్నేరు పూలు  
గర్క గున్న తంగేడు తీరొక్క పూలు  
రకరకాలు రంగరించిన అందంగా బతుకుమనే అమ్మా  
బతుకమ్మా!  
చప్పట్లలో గాజుల నాదమై గొంతెత్తిన రాగానికి  
కోకిలలు కోరస్ అవ్వాలని కోరుకుంటయి  
దప్పు సప్పుల్ల సాగుతున్న ర్యాలీని చూసే ప్రకృతి  
పరవశించి పోతది  
ప్రపంచంలో పూలను పూజించే పద్ధతి ఎక్కడా లేదనీ

జొన్న తలలొంచి దండం బెడ్తాంటే
పునాస పంట కొత్తతోరణాలతో ఆహ్వానిస్తాంటది"

(దేవులాట: పుట: 37)

ప్రపంచ దేశాలలో పూలను పూజించే సంస్కృతి ఎక్కడాలేదు. ఒక వేళ ఉన్నాగాని ఎక్కువ ప్రచారంలో లేదు. కానీ తెలంగాణా ప్రాంతంలో బతుకమ్మ పండుగరూపంలో పూలను పూజించే సంప్రదాయం ఉందని సిద్దెంకిగారు ఈ 'దేవులాట' అనే కవితా ఖండికలో ప్రస్తావించారు. ఈయన ఈ కవితా ఖండిక వస్తువుని నిర్మించే క్రమంలో పువ్వులు అమర్చే తాంబూలపు పళ్లెం నుండి బతుకమ్మను విధుల వెంట కన్నెపిల్లలు తీసుకుపోయే విధానాన్ని తనదైన భావశైలిలో చక్కటి పద్ధతిలో తెలంగాణ సంస్కృతికి చిహ్నమైన బతుకమ్మ పండగను గురించి రమణీయంగా వర్ణించారు.

బతుకమ్మ పూల గుభాళింపు వాడిపోకముందే, దసరా పండుగ వచ్చేస్తోంది. జమ్మి చెట్టుకు పూజలు చేస్తూ, జమ్మి ఆకులను బంగారంగా చేతుల్లో పెట్టి, పెద్దల దీవెనలు తీసుకోవడం స్నేహితుల అలాయి బలాయి, కొత్త బట్టలు వేసుకొని, పాలపిట్టను చూసి చప్పట్లు కొట్టడంలాంటి అంశాలన్నీ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే విషయాలను సిద్దెంకి యాదగిరిగారు తన కవిత్వంలో ఈ క్రింది విధంగా వ్యక్తీకరించారు.

"మలీద ముద్దలు మక్కఅట్కుల బంధాలు
హోసెన్న ఊ సేన్న లాల పాటల పూదోట
అసోయి దులా దరువుల ఆట
ఒక్క రోజు పక్కీరులైన ఊదు పొగ వేషాలు
తీరొక్క వేషంలో తీయని భక్తి పారవశ్యం"

(దేవులాట: పుట: 38)

అంటూ కుల, మత భేదాలు మరిచి జరుపుకునే పండుగ పీర్ల పండుగ. ఆడ, మగ వ్యత్యాసం లేకుండా పల్లె జనం అంతా కలిసి 'అలువా' చుట్టూ చేరి ఆడుతూ, పాటలు పాడుతూ ఉంటే పల్లె ఎంత ఆహ్లాదకరంగా కళకళలాడుతుందోనని ఈయన వివరిస్తూనే, పల్లె తనను తాను దేవులాడుకుంటున్న దృశ్యానంతా చిత్రించిన కవితా ఖండిక ఈ 'దేవులాట'.

## 2. 5. 2. హైదరాబాద్:

ఒక నిర్దిష్ట కాలానికి చెందిన ఒక కవి రాసిన రచనను పరిశోధించడం వలన ఆ కవి కాలానికి సంబంధించిన రాజకీయ ఆర్థిక సామాజిక భౌగోళిక భాష కుల మత వర్గ మొదలైన అంశాలను తెలుసుకోవచ్చని కొంతమంది చారిత్రక పరిశోధకుల అభిప్రాయం. ఉదాహరణకు క్రీ. శ. 15వ శతాబ్దం కు చెందిన శ్రీనాధుని జీవిత చరిత్ర తెలుసుకుంటే ఆనాటి ఆంధ్రదేశ చరిత్ర తెలుసుకున్నట్టు అని కొంతమంది సాహిత్య చారిత్రక పరిశోధకుల అభిప్రాయం. వీరి అభిప్రాయం ప్రకారం శ్రీనాధునికి రెడ్డి రాజ్యపాలకులతోను, విజయనగర రాజ్య పాలకులతోను సత్సంబంధాలు ఉండేవి అని వీరి రచనలు ఆధారంగా నిలుస్తాయి. ఈ విషయాన్ని గ్రహించిన పిమ్మట ఒక కవి రచించే రచన ఆ కవి కాల స్థితిని తెలుపుతుందని మనకు అర్థం అవుతుంది.

కావున ఒక కవి తన రచనలో తన ప్రాంతీయతకు సంబంధించిన అంశాలను క్రోడీకరించడం జరుగుతుంది. సిద్దెంకి యాదగిరిగారు తెలంగాణ ప్రాంతానికి చెందిన యువకవి. తెలంగాణ ప్రాంతం అనగానే మనకు ముందుగా గుర్తుకొచ్చే అంశాలు మహమ్మదీయుల పరిపాలన, గిరిజన తెగల సంస్కృతులు, ఉద్యమ పోరాటాలు, పటేల్, పట్వారిల పాలన వ్యవస్థ మొదలైన అంశాలు మన కళ్ళ ముందు మెదులుతాయి. మరొక ముఖ్యమైన అంశం మహమ్మదీయ రాజైన కులీ కుతుబ్షా హిందూ ప్రేయసి భాగ్యమతికి జ్ఞాపకార్థంగా నిర్మించిన పట్టణం భాగ్యనగరం. ఈ పట్టణం పేరు వినగానే అందరికీ హిందూ ముస్లింల యొక్క అన్యోన్యత గుర్తుకు వస్తుంది. ఈ నగరం క్రమేనా హైదరాబాద్ పేరుగా ఏ విదంగా నామాంతరం చెందిందో నేను ఈ క్రింది విధంగా ఆధారాలతో వివరిస్తాను.

*"మహమద్ కులీ కుతుబ్‌షా భాగమతి అనే బంజారా స్త్రీని ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడు. ఆ తరువాత ఆవిడ పేరు మీదనే భాగ్యనగర్ అని పేరు పెడతాడు. పెళ్ళయిన తరువాత భాగమతి ఇస్లాం మతం స్వీకరించి, హైదర్ మహల్ అని పేరు మార్చుకుంటుంది. దానిని అనుసరించి నగరం పేరు కూడా హైదరాబాదుగా (అనగా హైదర్ యొక్కనగరం) రూపాంతరం చెందింది. ఇండియా ట్రావెల్ టైంస్ సైటు నుండి మే 12, 2007న సేకరించబడినది. ఉర్దూ భాషాయుక్తంగా చూస్తే హైదరాబాదు పేరు వెనక మరొక అర్థం ఉంది. హైదర్ (రాజు పేరు) ఎక్కడయితే ఆబాదు (ప్రఖ్యాతి) అయ్యాడో ఆ నగరమే హైదరాబాదు అని ప్రతీతి.*

*భారత స్వాతంత్ర్యం అనంతరం 1947లో భారతదేశంలో ఆంగ్లేయుల పాలన అంతమయిన తరువాత అప్పటి నిజాము స్వతంత్రంగా పాలన సాగించాలని నిర్ణయించాడు. వ్యాపార, వాణిజ్యాలు స్థిరముగా ఉండేందుకు హైదరాబాదు రాజ్యానికి అన్ని వైపులా ఉన్న భారత దేశంతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అప్పటి తెలంగాణా కమ్యునిస్టులు హైదరాబాదును భారత దేశంలో కలుపుటకు, నిజాము సొంత సైన్యమయిన రజాకర్ల మీద చేసిన పోరాటం వలన శాంతి భద్రతలు క్షీణించాయి. పెరిగిన హింస కారణంగా అప్పటి మద్రాసు రాష్ట్రంలో ఉన్న కోస్తా ఆంధ్ర ప్రాంతానికి వలసలు బాగా*

*పెరిగినాయి. అటువంటి సమయంలోనే, అప్పటి గృహమంత్రి, సర్దార్ వల్లభాయి పటేల్ నేతృత్వంలో భారతదేశం ఆపరేషన్ పోలో పేరుతో పోలీసు చర్యకు ఉపక్రమించింది. సెప్టెంబరు 17, 1948న, అంటే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సంవత్సరం తరువాత, హైదరాబాదులో ఐదు రోజుల పోలీసు చర్య జరపడం వల్ల హైదరాబాదు భారతదేశంలో కలిసింది. భారతదేశంలో అంతర్భాగమయిన తరువాత ఎనిమిది సంవత్సరాలపాటు (సెప్టెంబరు 17, 1948 నుండి 1956 నవంబర్ 1వరకు) హైదరాబాదు ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఉంది. 1956 నవంబర్ 1న భారత దేశాన్ని భాషాప్రయుక్త రాష్ట్రాలుగా విభజించినపుడు హైదరాబాదు రాష్ట్రం మూడు భాగాలుగా విడి ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలలో కలిసిపోయింది. హైదరాబాదు నగరం , దాని చుట్టుపక్కల తెలుగు మాట్లాడే ప్రాంతాలు ఆంధ్రప్రదేశ్లో కలిసాయి, అంతేకాదు హైదరాబాదు ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని అయింది".*(వికీపీడియా)

*"గోల్కొండను రాజధానిగా చేసుకొని పరిపాలన చేసిన సుల్తానులలో మహమ్మద్ కులీ కుతుబ్ షా గొప్ప పరిపాలనాదక్షుడు, కళాభిమాని. క్రీ.శ.1590-1591 సంవత్సరంలో గోల్కొండ రాజధానిలో జనాభా విపరీతంగా పెరిగినందువల్ల సుల్తాన్ మూసీ నదికి దక్షిణ ప్రాంతాన్ని ఒక కొత్త నగర నిర్మాణానికి పునాది వేశాడు".* (*తెలంగాణ చరిత్ర – సంస్కృతి*: పుట: 661) ఈ నగరం మధ్యయుగ దక్కన్ చరిత్రలోనే కాకుండా, యావత్ ఆసియా ఖండంలోనే ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్నది హైదరాబాద్ మహానగరం.

"బతుకు దెరువు వెతుకు లాటలో
పరువు నిలిపే భరోస నగరం
నకనకలాడుతున్న ఆకలి అస్థిపంజరాలకు
చావనివ్వని చౌరస్తా సాయం
పుట్పాత్ల మీద ప్లాస్టిక్ కవర్ల గుడిసెలు
భరించరాని చలి పేదవాని రెండు పిడికిల్లంతా
హైమాస్క్ లైట్ల కింద రకరకాల ఆసనాలేయిస్తది
రంగు రంగుల ఇంట్ల కావల్సిన కాలాలు
పైసల ఖర్చుతో వశమవుతుంటాయి
ఉన్నోన్ని లేనోన్ని అందరినీ ఆదరించే
నిత్య ధరణి ముత్తైదువా మా హైద్రాబాద్"

(హైదరాబాద్ మాది: పుట: 115)

అంటూ సిద్దెంకి యాదగిరిగారు హైదరాబాద్ యొక్క ఔన్నత్యం తెలిపిన కవితా ఖండిక 'హైదరాబాద్ మాది'. సువిశాలమైన హైదరాబాద్ కు రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా, దేశంలో

అనేక ప్రాంతాల నుంచి వచ్చే కార్మికులకు, వలస కూలీలకు, ఇక్కడ ఉన్నటువంటి మౌలిక వసతులు, అనేక ప్యాక్టరీలు కొలువుదీరి ఉంటడం వలన ఏంతో మందికి ఉపాధి లభిస్తుంది. అదేవిధంగా భవన నిర్మాణ కార్మికులుగా కానీ, ఏదో ఒక రూపంలో ఖచ్చితంగా ఉపాధిని పొందుతూ, అనేక కుటుంబాలు సంసార జీవితాన్ని కొనసాగిస్తూ ఉన్నట్లుగా ఈయన కవిత్వీకరించారు.

"మా భాగ్యం భాగ్యనగరం
ఇరాని చాయి రుచిలో ఇంపైన దోస్తు వాసనలు
బిర్యాని గుబాళింపుల ఆరగింపు సంతృప్తి సంపద
పోతరాజు శివసత్తుల దరువులు
మహాంకాళి బోనాల మహిమల రంగం
త్యాగపు తలంపుల పీరీల పండుగ
ఖవ్వాలి గుంపు స్వరాల భక్తి కవాత్లు
దర్గా చద్దర్లు, నమాజు, రోజాలు
గణేశుల ఊరేగింపుల ఘనత
చర్చి గంటల కరుణామయుని అమృతధారలు
అనేక రకాల భక్తి మార్గం ఒకవైపు
నాస్తిక హేతువాదం మరోవైపు
జనసందడి వైరుధ్యంలో
అనుబంధాల అల్లిక నా హైద్రాబాద్"

(హైదరాబాద్ మాది: పుట: 116)

వివిధ మతాల భిన్న సంస్కృతుల మధ్య హైదరాబాద్ మహానగరం వెలుగొందుతుందని పాఠకునికి చెపుతూ కవి ఈ కవితా వస్తు నిర్మాణాన్ని ముందుకు తీసుకు వెళ్లారు. ఇదేవిధంగా ఇక్కడున్న నవాబ్ అయినా, గరీబ్ అయినా ఒక పూట అన్నం తినకుండా ఉంటారేమో కానీ ఇరాన్ చాయ్ తాగకుండా ఉండలేరు. ఇరాన్ చాయ్ దాని చుట్టూ, అల్లుకున్నటువంటి అనుబంధాలను గురించి, బిర్యానీ ఘుమఘుమలను, మనసుదోచే కవ్వాలీలను గురించి తెలుపుతూ, హైదరాబాద్ ఆహ్లాదకరమైన ప్రదేశమని, ఇక్కడ గాలి, నీరు, వాతావరణం, హృదయాన్ని పవిత్రం చేసి, పగలు, ద్వేషాలను దూరం చేసి, మనుషుల మధ్యన ప్రేమను, సోదరభావాన్ని, పెంచే భూతల స్వర్గంగా కవి హైదరాబాద్ ను భావిస్తున్నారు.

## 2. 6. మానవ సంబంధాలు:

*మానవతావాదం(హ్యూమనిజమ్) ప్రకృతిలో మానవ ప్రాధాన్యతని గుర్తించి, మానవుల క్షేమాన్ని ఆశిస్తూ, మానవ విలువలను గౌరవించే తాత్విక చింతన. మానవాతీతమైన దైవశక్తికి ప్రాధాన్యతనిచ్చి మానవులకు విలువనివ్వని మధ్య యుగాల ఆలోచనా ధోరణికి వ్యతిరేకంగా 14, 15 శతాబ్దాలలో ఐరోపాలో మానవతావాదం ప్రారంభమైంది. (సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ*: పుట: 141)

తెలుగు సాహిత్యంలో మానవతా ధోరణితో ఎంతోమంది కవులు వారి భావాన్ని కవిత్వీకరించారు. సమాజం మానవత్వంపై ఆధారపడి నడుస్తుంది. అందులో మానవసంబంధాలు ముఖ్యం. సిద్దెంకి యాదగిరిగారు తన కవితలలో అనేక భావాలను వ్యక్తీకరించారు. అందులో మానవ సంబంధాలు ఒకటి. వీరు కవిత్వంలో ఎంచుకునే కవితా వస్తువు ఎక్కువగా సామాజిక, మానవత్వ ధోరణిలో ఉండటం సహజంగా ఉంది.

### 2. 6. 1. మాతృత్వం:

అమ్మ కడుపున ఉమ్మనీటిలో నెత్తుటి ముద్దయి ఎదుగుతూ, కాళ్ళతో తన్నిన పులకించిపోతుంది. ఒళ్ళు నొప్పులు ఎన్ని ఉన్నా ఓర్చుకుంటూ, నవమాసాలు మోసి, పురిటినొప్పుల నరకయాతన అనుభవిస్తూ, బిడ్డకు జన్మనిస్తుంది. తన రక్తాన్ని పాలుగా మార్చి పసి బిడ్డ ఆకలి దప్పికలను తీరుస్తుంది. అమ్మ తన ఒడిని ఉయ్యాలగా చేసి ఆడిస్తూ, జోల పాడి పడుకోబెడుతూ, రామ బంటులా కాపలా ఉంటుంది. మలమూత్రాలను కడుగుతూ, కక్కిన పొత్తి గుడ్డల్ని ఉతుకుతు బండ చాకిరి చేసిన భారం అనుకోదు ఏనాడు. బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం పరితపించే విరామమెరుగని శ్రమ జీవి అమ్మ. అమ్మ గుణ గణాలను తెలిపే అంశం చీర. అలాంటి చీరను సిద్దెంకి యాదగిరిగారు వర్ణించిన విధానాన్ని పరిశీలిద్దాము.

సిద్దెంకి యాదగిరిగారు రాసిన "*బతుకు పాఠం*" కవితా సంపుటిలో అమ్మ కొంగు (చీర)కు సంబంధించిన కవితా ఖండిక 'మా అవ్వ కొంగు'. స్త్రీలు ధరించే వస్త్రాన్ని కోక, చీర మొదలైన పేర్లతో పిలుస్తారు. ఈ కోకను మన తెలుగు సాహిత్య కవులు వారి గ్రంథాల్లో కొన్ని చోట్ల ప్రస్తావించారు. మొదటగా నన్నయ "*ఆంధ్ర మహాభారతం*"లో ఈ క్రింది విధంగా ప్రస్తావించారు.

**దుశ్శాసనుండు ద్రౌపది కట్టిన పుట్టం బొలుచుట:**

సీ. ఇది సేయఁగా దాని మది విచారింపక, సద్గరితుండు దుశ్శాసనుండు
నెట్టన ద్రౌపది గట్టిన పుట్టంబు | సభలోన విడే నాశంక లేక
యుడుగక యొలువంగఁ బడియు ము న్నపనీత | మైన తద్వస్త్రంబు నట్టి వలువ

లలితాంగి జఘనమండలమునఁ బాయక |యొప్పుచు నున్న నయ్యువిదఁ జూచి
ఆ. సభ్యులెల్ల నుదితసమ్మదు లయిరి దు |శ్శాసనుండు వస్త్రచయము పర్వ
తోపమాన మయిన నొలువంగ నోపక |యుడిగె లజ్జఁ బొంది యుక్కు దక్కి.
(శ్రీ మదాంధ్ర మహా భారతము: పుట:242 )

*"ప్రతిపదార్థం: సత్+గర్హితుండు = సజ్జనులచేత నిందించబడినవాడు; దుశ్శాసనుండు; ఇది; చేయన్+కాదు+అని = చేయకూడని దని; మదిన్ = మనస్సులో; విచారింపక = ఆలోచించక; నెట్టన= అడ్డులేకుండా, ద్రౌపది; కట్టిన = కట్టుకొనిన; పుట్టంబు=వస్త్రం: ఆశంక, లేక= సంకోచం లేకుండ; సభలోనన్; విడ్చెన్=విప్పబడి; ఉడుగక=ఆపకుండ; ఒలువంగబడియున్ = విప్పబడి; మున్ను+అపనీతము+ఐన = ముందు తొలగింపబడిందైన; తత్వస్త్రంబు. అట్టి, వలువ = ఆ వస్త్రంవంటి వస్త్రమే; నిప్పాడు; లలిత+అంగి, జఘన, మండలమున్న = మనోహరాలైన అవయవాలు కల ద్రౌపది యొక్క మొలభాగాన; పాయక=ఎడతెగక; ఒప్పుచున్; ఉన్నన్; ఆ+ఉవిదన్ = ఆకాంతను; చూసి; సభ్యులు + ఎల్లన్ = సభలోని సభ్యులంతా: ఉదిత, సమ్మదులు+అయిరి = పుట్టిన సంతోషం కల వాళ్ళయ్యారు. అంటే సంతోషించారు; వస్త్రచయము = బట్టల సమూహం; పర్వత+ ఉపమానము = పర్వతంతో సమానం; అయినన్; దుశ్శాసనుండు; ఒలువంగన్+ఓపక = విప్పలేక; ఉక్క, తక్కి = పట్టువిడిచి; లజ్జన్+పొంది= సిగ్గుచెంది; ఉడిగెన్ = ఊరుకున్నాడు.*

***తాత్పర్యం:*** *సజ్జనులచేత నిందించబడిన దుశ్శాసనుడు, ఇది చేయకూడదని మనస్సులో విచారించక, అడ్డులేనివాడై,ఆ ద్రౌపది కట్టుకొన్న వస్త్రాన్ని నిస్సంకోచంగా నిండు సభలో విప్పాడు. ఆపకుండా అతడు విప్పుతున్నా ముందు తొలగించబడ్డ వస్త్రంవంటి వస్త్రమే– ఆ లలితాంగి మొలభాగం మీద ఎడతెగకుండా ఉండటం చూచి సభలోని సభ్యులంతా సంతోషించారు. విప్పిన వస్త్రసమూహం కొండలా గుట్టపడగా దుశ్శాసనుడు ఇక విప్పలేక, పట్టు విడిచి, సిగ్గుచెంది ఊరకుండిపోయాడు".*

నన్నయ రాసిన ఈ సీస పద్యం "*ఆంధ్ర మహా భారతం*"లో ద్రౌపది వస్త్రాన్ని దుశ్శాసనుడు అపహరించే సందర్భంలోనిది. ఈ సీస పద్యంలో నన్నయ 'పుట్టంబు' అనే పదాన్ని వస్త్రం అనే అర్థంలో ఉపయోగించారు. ఇక్కడ పుట్టంబు (వస్త్రం) అంటే కోక అని అర్థం.

తెలుగు సాహిత్యంలో రసజ్ఞులుగా పేరుపొందిన మహాకవి శ్రీనాథుడు. వీరు రసజ్ఞులే కాక అలంకార, భోజన ప్రియులని తెలిపే చాటువులు చాలా ఉన్నాయి. అందులో ఒక పద్యంలో కోక ప్రస్తావన వుంది.

శా. కొల్లా యుంచితి గోక సుట్టితి మహాకూర్పాసముందొడ్డితిన్
వెల్లుల్లిన్ దిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపగా

**జల్లాయంబలి ద్రావితిన్ రుచులు దోసంబంబు బోనాడితిన్**
**తల్లీ! కన్నడరాజ్యలక్ష్మి దయలేదా నేను శ్రీనాథుడన్.**

(సమగ్రాంధ్ర సాహిత్యం: పుట: 719)

ఈ పద్యంలో శ్రీనాథుడు కోక సుట్టితి అని చెప్పుకున్నాడు. అంటే పూర్వం పురుషులు ధరించే వస్త్రాలనూ కోక అంటారని ఈ పై పద్యం ద్వారా అర్థమవుతుంది. ఇదే విధంగా కొంతమంది రామాయణ రచనా కవులు శ్రీ రాముడు నారచిరాలు కట్టి అడవులకు వెళ్ళినట్లు రచించారు.

"*ఆంధ్ర మహా భాగవత*" గ్రంథం ద్వారా తెలుగు సాహిత్యంలో భక్తి రసాన్ని ప్రవహింప చేసిన కవి పోతన. వీరు శ్రీనాథుని కాలమైన 15వ శతాబ్దానికి చెందిన కవి. వీరు కూడా "*ఆంధ్ర మహా భాగవతం*"లో చీర ప్రస్తావన చేశారు.

**మ. సిరికిం జెప్పఁడు శంఖ చక్రయుగముం జేదోయి సంధింపఁడే**
**పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం**
**తరధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు వివాద ప్రార్థిత శ్రీ కుచో**
**పరిచేలాంచలమైన వీడఁడు గజ ప్రాణావనోత్సాహియై**

(తెలుగు సాహిత్య సమీక్ష: పుట: 522)

పై పద్యం పోతన ప్రణీతమైన "*ఆంధ్ర మహా భాగవతం*"లోని గజేంద్రమోక్షం ఘట్టంలోనిది. శ్రీ హరి గజేంద్రున్ని రక్షించడం కోసం వెళ్ళే సందర్భంలో "*శ్రీ కుచో పరిచేలాంచలమైన వీడఁడు*" (తెలుగు సాహిత్య సమీక్ష: పుట: 522) అని లక్ష్మీదేవి పైట కొంగును పోతన వర్ణించాడు.

శ్రీ కృష్ణ దేవరాయల ఆస్థానంలో అరనపు కవిగా పేరు పొందిన పింగళి సూరన కళాపూర్ణోదయం ప్రబంధంలో చీర ప్రస్తావనను చేశారు.

**కం. చని యాతండు దాం జలి పెడు**
**పనులకు నీయకొన కున్న బలిమిగడంగె**
**దనసొమ్ము లెల్ల నొకమారుం,**
**గున నిడి విరిసుట్టు సుట్టుకొనినవలువ తోన్,**

(కళాపూర్ణోదయం: పుట: 93)

ఈ పై పద్యం కళాపూర్ణోదయంలోని నాల్గవ ఆశ్వాసంలోనిది. సుగాత్రి, శాలినుల సంగమానికి ముందు జరిగిన సన్నివేశాన్ని వర్ణిస్తున్న సందర్భంలో చీరను 'వలువలు' అనే అర్థంతో ప్రస్తావించారు.

ఈ విధంగా మన ప్రాచీన కవులు చీరను వారి వారి రచనలలో ప్రస్తావించుకున్నారు. వీరితో పాటు ఆధునిక కవులు, సిని గేయ రచయతలు మొదలైన వారు చీర గొప్పతనాన్ని గురించి చెప్పారు.

జీవం పోసుకున్న ప్రతీ జీవి పుట్టుకలో సంపాదించుకునే ఆస్తి తల్లి ప్రేమ. తల్లి తను తిన్న తినకున్న తన బిడ్డల కడుపు నింపడం కోసం తను పడే తపనను గురించి వర్ణించిన కవితా ఖండిక 'మా అవ్వ కొంగు'.

**"బిడ్డలు తింటరని**
**ఆమె తినకుండా**
**కోరి కోరి తెచ్చిన**
**తినుబండారాల చిరుభాండాగారం**
**మా అవ్వ కొంగుముడి"**

(మా అవ్వ కొంగు: పుట:15)

పూర్వం పల్లెల్లో పేరంటాళ్లుకు, పెళ్ళిళ్ళకు, ఇతర పండగలకు అమ్మ వెళ్లిందంటే ఇంటిలోని పిల్లలు అమ్మ మనకు ఏమైనా తినుబండారాలు తెస్తుందని ఆశగా ఎదిరిచూస్తుంటారు. ఆ సన్నివేశాన్ని సిద్దెంకిగారు చక్కగా వర్ణించారు. అదేవిధంగా *'పొర్లుతున్న దుఃఖానికి అడ్డుకట్ట వేసి ఓదార్చుతూ వుంటది!'* (మా అవ్వ కొంగు: పుట: 15) అంటూ అనడంలో కుటుంబంలోని వారికి ధైర్యం చెప్పేది అమ్మ అని ఈయన అభిప్రాయం.

**"కట్టెల మోపు పిడికెల తట్ట**
**అయ్యకు సద్దులగంప**
**ఆర్నెళ్ళ పంట వరికట్టలు**
**పాలిచ్చే ఆవు పచ్చిగడ్డి మోపుకు**
**బిందె మీది బిందెడు నీళ్ళు**
**ఎన్నో మోస్తున్న అవ్వ బాధ భరించక**
**మెత్తటి సుట్టబట్టైన కొంగు**
**అవ్వ తలమీద కురంబగద్దెతది"**

(మా అవ్వ కొంగు: పుట: 15)

గ్రామీణ ప్రాంతం అంటేనే శ్రమ యొక్క జీవన సౌందర్యానికి ఆనవాలుగా కనిపిస్తుంది. గ్రామాల్లో ఆడ, మగ తేడాలు మరిచి కలిసికట్టుగా వ్యవసాయ పనులు చేసినప్పటికీ, ఇంటి పనుల్లోనూ వ్యవసాయ పనుల్లోనూ స్త్రీల శ్రమ అనిర్వచనీయమైంది. స్త్రీలు పల్లెటూర్లలో చేసే పనులను క్రమంగా

వర్ణిస్తూనే, అమ్మకు కొంగు ఎన్ని విధాలుగా ఉపయోగపడుతుందో వివరిస్తూ సిద్దెంకి యాదగిరిగారు పల్లెటూరి వాతావరణాన్ని చిత్రించారు.

"నా పిల్లలను
అత్తుకొని ఎత్తుకొన్నప్పుడు
ల్యాగదూడను నాకుతున్న ఆవులాగ
దుమ్ము దూళి దులిపేసి
ముక్కు సీముడు తీసి అక్కున చేర్చుకొని
ఉబ్బరపోస్తదని ఊపై విసనకర్రలా
మత్తునిద్రకు మెత్తగా మారిపోయే
పుండు మానడం కోసం
చెట్ల వైదుగం కట్లకు
అనుకోనని గాయమై మూలుగుతుంటే
నెత్తురు జల యిస్తున్నపుడు
చింపి చుట్టిన బట్ట పేగుకట్టు
ఓ తల్లి పేగు బంధమై
అడవిల బాధలు తీరుస్తుంది"

(మా అవ్వ కొంగు: పుట: 17)

పిల్లలపై దుమ్ము, ధూళి పడినప్పుడు, ముక్కు చీమిడి తుడిచేటప్పుడు, గాలి రాక ఉక్కపోసినప్పుడు అవ్వ కొంగు విసనకర్ర అయిన విధం, నిద్రలోకి జారుకున్నప్పుడు సుతిమెత్తని తలదిండుగా మారుతుందని చెప్తూ, అవ్వ కొంగును దర్శించిన తీరు హృద్యంగా ఉంటుంది. ఏదైనా దెబ్బ తగిలినప్పుడు కారే రక్తాన్ని ఆపడానికి తల్లి తన కొంగును చింపి కాయానికి తాకిన గాయానికి చుడుతుందంటూ, ఈ కవిత ముగుస్తున్న కొద్దీ అమ్మ కొంగుకు, పేగుకు బంధాన్ని జోడిస్తూ, కవి తల్లి ప్రేమను పరాకాష్టకు తీసుకెళ్లారు.

ఈ మా 'అవ్వ కొంగు' అనే కవితా ఖండికలో కొంగును స్త్రీ ఔన్నత్యాన్ని, కౌశలాన్ని తెలిపే ప్రతీకగా సిద్దెంకి యాదగిరిగారు వర్ణించారు. ఈ కవితా ఖండికను చదువుతుంటే కవి ఒక స్త్రీ వాదిగా కనిపిస్తారు.

### 2. 6. 2. నాన్న ప్రేమ:

కడుపున నిన్ను మోయలేక పోవచ్చు కానీ కుటుంబ భారాన్ని అంతా మోస్తూ, అలసటన్నది ఎరుగని త్యాగానికి ప్రతిరూపం నాన్న. ఎద మీద ఎత్తుకొని ఆడిస్తాడు, వేలు పట్టుకుని నడక నేర్పుతూ, తన భుజాల మీద ఎత్తుకుని తను చూడని లోకాన్ని మనకు చూపిస్తాడు. కన్నబిడ్డలకు ఏదైనా దెబ్బ తగిలి గాయమైతే తన హృదయం విలవిలలాడుతుంది. తన పిల్లలు నవ్వి, ఆడినప్పుడే తన కడుపు నిండినంత

సంబరపడుతాడు. పిల్లలు అడిగింది ఇవ్వడమే తప్ప తిరిగి మళ్ళీ ఏది ఆశించని నిస్వార్థపరుడు నాన్న. తన పిల్లల ఎదుగుదల కోసం అహర్నిశలు శ్రమిస్తూ, వారు చల్లగుంటేచాలని ఎల్లప్పుడూ కోరుకునే ఏ కోవెల లేని దైవం నాన్న.

తల్లి గర్భం నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి పిల్లల బాధ్యత మొత్తం తండ్రిపై ఆధారపడుతుంది. కుటుంబ పరిస్థితులకు అనుగుణంగానే పిల్లలు సమాజంలోను మసలుకుంటారు. కుటుంబ నేపథ్యాన్ని క్రమబద్ధంగా నడపడం తండ్రిపైనే ఆధారపడి ఉంటుంది. చాలామంది కవులు తండ్రి తమపై చూపిన ప్రేమను, సమాజంలో ఎలా మసులుకోవాలని చెప్పిన సూక్తులను తమ రచనలలో వివరిస్తూ ఉంటారు. అదేవిధంగా సిద్దెంకి యాదగిరిగారు కూడా 'గురు మయం' అనే కవితా ఖండికలో తండ్రి తనపై చూపిన ప్రేమను, నేర్పిన నీతులను ఈ క్రింది విధంగా వర్ణించారు.

"ఎదపైకి ఎక్కించుకొని
చూపుడువేలు సృష్టిని పరిచయం చేస్తునపుడు
పులకరించిన నా భవిష్యత్ కోసం
దినమంతా తౌలకరి అయి తడుస్తూ
నా మనసులో శమట జల్లుల విత్తనాలు నాటిన
నా తండ్రి నాకు రెండో గురువు"

(గురుమయం: పుట: 29)

అంటూ తండ్రి రోజు పిల్లలను పెంచేందుకు ఎన్నో కష్టాలు పడుతుంటాడని ఈయన వర్ణించారు. ఈ కవితా ఖండిక శీర్షిక 'గురుమయం'. ఈ శీర్షికకు తగ్గట్టే కవి తనకు గురువుగా వ్యవహరించిన వారందరినీ ఈ కవితా ఖండికలో వర్ణించారు. ప్రసవించి తన ఒడిలో లాలించిన తల్లిని మొదటి గురువుగాను, తండ్రిని రెండో గురువుగా కవి భావించారు.

### 2. 6. 3. దాంపత్యం:

దాంపత్యం భార్యాభర్తల అనురాగం. జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా గానీ కలిసికట్టుగా ఉండి, సమాజంలో జీవిస్తూ అందరికీ ఆదర్శంగా ఉండటం దాంపత్యానికి వన్నె తెస్తుంది. అలాంటి దాంపత్యం గురించి సిద్దెంకి యాదగిరిగారు 'ఇంకా అనాదలమే' అనే కవితా ఖండికలో చక్కగా వివరించారు.

"కష్టమో సుఖమో కలిసి బ్రతికినం
కలిగినంతల తృప్తి పడుతూనే ఉన్నం
దగ్గరైనా దూరమైనా ఆప్యాయతల్ని పంచుకున్నది

ఆత్మీయతలని పెంచుకున్నది మేమే
కష్ట సుఖాల్లో ఇద్దరం చెరి సగమై"

(ఇంకా అనాదలమే: పుట: 120)

సిద్దెంకి యాదగిరిగారు ఈ కవితా ఖండికలోని ఈ పంక్తుల ద్వారా భార్య భర్తలు కష్ట, సుఖాల్లో కలిసికట్టుగా ఉంటే దూరంగా ఉన్నా దగ్గరగా ఉన్నా ప్రేమ, ఆప్యాయతలు, ఆత్మీయతలో కలిగి ఉంటారని దాంపత్యం పట్ల తనకున్న భావాన్ని వ్యక్తికరించారు. అదేవిధంగా భర్త శరీరంలో భార్య సగం అనే సిద్ధాంతం ప్రకారం భర్త కష్టాలలో, సుఖాలలో భార్య సగపాలు ఉంటుందని వివరించారు.

## 2. 6. 4. గురు శిష్యుల బంధం:

తల్లిదండ్రులు పిల్లలకు మొదటి గురువులు. వీరు బంధుమిత్రులతో ఎలా ఉండాలో నేర్పితే, గురువులు సమాజంలో ఎలా బతకాలి, ఎలా మెలగాలని నేర్పుతారు. అలాగే సిద్దెంకి యాదగిరిగారు ఉపాధ్యాయ వృత్తిలో సేవలందిస్తున్నారు. ఈ అనుభవంతో ఈయన పిల్లల స్వభావాన్ని, ఉపాధ్యాయుల బాధ్యతలను తెలిపే విధంగా 'కాంతి మొలక' అనే కవితా ఖండికలో ఇలా రాశారు.

"పాఠశాల పూలవనంలో నేను ఒక వనమాలినై
బాల్య మొక్కల పెంపకానికై
జ్ఞానసెలయేరునై ప్రవహిస్తుటాను
మొరటు గంజాయి మొక్క అల్లరి విద్యార్థి
నేను చిరునవ్వు ప్రేమ చూపుల్ని విసిరితే
వాడు తలదించినట్లే దించి అలజడి చూపుల్ని
నాపై ఎక్కుపెడుతాడు"

(కాంతి మొలక: పుట: 126)

ఈ కవితా ఖండికలో అనేక సామాజిక ప్రతీకలను సిద్దెంకి యాదగిరిగారు ఉపయోగించారు. ఉపాధ్యాయులను పాఠశాలలోని వనమాలిగా, పిల్లలు ఆ వనంలోని మొక్కలుగా పేర్కొన్నారు. అదేవిధంగా అల్లరి చేసే పిల్లలు వనంలోని గంజాయి మొక్కలుగా పేర్కొన్నారు. ఈ విధంగా యాదగిరిగారు పాఠశాలలో ఉపాధ్యాయుల, పిల్లల పాత్రను గురించి తెలుపుతూనే ఉపాధ్యాయుని బాధ్యతను ఈ క్రింది విధంగా తెలిపారు.

"ఏమి రాయని నల్లబల్ల కదా
సుద్దముక్కతో మెదడు బల్లపై రాసి

బుద్ధికి తేవాలనుకుంటాను
ఆప్యాయతల్ని ఎగజల్లి
ఆత్మీయతను ఏరుకోవటానికి
నను నేను మరచిపోయి వాడిలోకి మారిపోతాను
వింతగా అరవటం, సోమరితనం మరువాలనీ
అహం కంటే ఆలోచన
పాఠం బ్రతుకు పాఠం ముఖ్యమనీ
విద్యా వినయం వివేచన గొప్పవనీ వివరింపాను
ఆరాధనగా కవ్వించాలను
ఓరి చిన్నారి నవభవిత నీదేనని చెప్తూ నమ్మించాను"

(కాంతి మొలక: పుట: 126)

సిద్దెంకి యాదగిరిగారు పిల్లలను ఏమీ రాయని నల్లబల్లకు ప్రతీకగా చెప్పారు. అంటే ఈయన అభిప్రాయం ప్రకారం పిల్లలు ఏమీ తెలియని వారు. మనం ఎలా వాళ్ళను పెంచితే అలానే పెరుగుతారని ఈ కవితా ఖండిక ద్వారా ఈయన తెలియచేస్తున్నారు. అదే విధంగా ఉపాధ్యాయులు పిల్లలకు వారి బాధ్యతను తెలుపుతూ, పిల్లలు చేసే చిన్న చిన్న పొరపాట్లను సరిచేస్తూ, వారికి క్రమశిక్షణ అలవాటు చేయాలి. పిల్లల అల్లరి, సోమరితనం నుంచి దూరంచేస్తూ ఉండాలని ఈయన భావాన్ని వ్యక్తీకరించారు.

"నీడలా వెంటాడే నిరాశల్ని
గమ్యం గిరిగీసుకొని గురిచూసినపుడే
లక్ష్యం సఫలమైతది
సడలని సంకల్పం గెలిచేసాక్ష్యమైతది
వాడు శిధిల సందిగ్ధత నుంచి శిరసెత్తి
కర్తవ్యాన్ని కౌగిలించుకున్నట్లు
ముసి ముసిగా నవ్వాడు
వాడి మొఖంలో
ఏదో సాధించిన కాంతి మొలిచింది
నాలో శాంతి నిలిచింది"

(కాంతి మొలక: పుట: 127)

ఎన్నో నిరాశలను జయించి తన గమ్యాన్ని చేరుకున్న విద్యార్థులను చూస్తే, ప్రతి గురువు సంతోషిస్తాడు. అలాగే తను బోధించిన విద్య వృధా కాలేదని ఆనందపడుతాడు. అంటూ గురు శిష్యుల బంధాన్ని గురించి ఈయన భావాన్ని అభివ్యక్తీకరించారు.

## 2. 7. స్మృతి కవిత్వం:

ఆప్తుల మరణం, ప్రముఖ వ్యక్తుల మరణంపట్ల కలిగిన బాధనూ, శోకాన్ని వ్యక్తపరుస్తూ ఆత్మాశ్రయ ధోరణిలో రాసిన కవిత్వం. లేదా ఆప్తుల మరణంతో బాధపడుతున్న కథానాయకుడి పరిస్థితి వివరిస్తూసాగే కవిత్వం. లేదా చాలా విషాదకరమైన సంఘటనను అంతే సీరియస్గా వ్యక్తపరుస్తూ రాసే రచనలను కూడా స్మృతి కావ్యాలు (ఎలిజీలు)గానే భావిస్తున్నారు.(*సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ*: పుట: 194) ఈ విధంగా నళిని గారు తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

మరణమే కాకుండా చాలా కదిలించి, బాధకుగురిచేసే ఏ సంఘటన అయినా కావచ్చు, అయితేసాధారణంగా ఎక్కువగా స్మృతికావ్యం ఒక ప్రత్యేక వ్యక్తి మరణంపట్ల రచయిత స్పందనే అయి ఉంటుంది. స్మృతి కావ్యాలు చాలా గంభీరమైన మనోస్థితితో (సీరియస్ మూడ్ తో) సాగుతాయి. నిరాశా, నిస్పృహలతో ప్రారంభమయినప్పటికీ చివరికి ఒక రకమైన ఆశతోటి ధైర్యంతోటీ ముగుస్తుంది. ప్రధానంగా మరణమూ, దాని ప్రభావమూ గురించి స్మృతి కావ్యాలు ఉన్నా, మరణించిన వ్యక్తిఔన్నత్యాన్ని గురించీ, ఆ వ్యక్తి నుంచి సమాజంగానీ నేర్చుకోదగ్గతానుగానీ, విషయాలను గురించీ ఎక్కువ ప్రస్తావనలు కనిపిస్తాయి.

సిద్దెంకి యాదగిరిగారు సమాజానికి ఎంతో సేవలను అందించి కాలం చేసిన సంఘసేవకుల్ని, నాయకుల్ని, మననం చేసుకుంటూ, కొన్ని కవితా ఖండికలను రాశారు.

### 2. 7. 1. బాలగోపాల్:

పౌర హక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన బాలగోపాల్ గారు తను జీవితాంతం ఉద్యమంలో కొనసాగారు. గణిత శాస్త్రవేత్తగా ఎదిగిన ఆయన, మానవతా విలువల కోసం పోరాడారు. ఆదివాసీ ఉద్యమం నుండి విప్లవోద్యమం వరకు. పౌర హక్కుల ఉద్యమం నుండి మానవ హక్కుల ఉద్యమం వరకు. కూలి పోరాటం నుండి భూపోరాటం వరకు అనేక రకాల ఉద్యమాలతో పెనవేసుకపోయిన నాయకుడు బాలగోపాల్. ఇతను చేసిన పోరాటాలను, త్యాగాలను స్మరిస్తూ సిద్దెంకిగారు ఇలా వ్యక్తీకరించారు.

"హక్కుల్ని తొక్కిపెడ్తున్న నియంతృత్వంలో
బ్రతుకు బలహీన మవుతున్నపుడు
హక్కుల రక్షణకోసం మొలకెత్తే ఉక్కు కవచం
బూటకపు ఎన్ కౌంటర్ ల రహస్యాన్ని
పెన్ స్టెత్ స్కోప్తో విని అక్షరాల్తో పేర్చి
అణచివేతల్ని నివేదించే నిత్య రణసైనికుడు"

(హక్కుల కవచం: పుట: 27)

అంటూ మానవ హక్కుల కోసం మొలకెత్తే ఉక్కు కవచంగా బాలగోపాల్గారిని పోల్చుతూ, బూటకపు ఎన్కౌంటర్ల యొక్క రహస్యాలను పెన్ స్టెతస్ స్కోప్తో విని అక్షరాలతో పేర్చి, ఎక్కడ అన్యాయం, వివక్ష కనిపించినా, నిష్కర్షగా, నిక్కచ్చిగా, నిర్భయంగా ఎదిరించే నిత్య రణ సైనికుడిగా బాలగోపాల్ గారిని అభివ్యక్తీకరించారు.

గిట్టుబాటు ధర కోసం రైతులతో కలిసి ఉద్యమించి, కాశ్మీర్ సమస్య నుండి చత్తీస్గఢ్ ఆదివాసీల సమస్యలు, గుజరాత్ లో జరిగిన ముస్లింల హత్యాకాండ, కందమాలోని క్రైస్తవ, కారంచెడు, ఖైర్లాంజి లాంటి అనేక సంఘటనలపై గొంతెత్తి నినదించిన తీరును, పౌర హక్కుల, మానవ హక్కుల నేతగా, సాహితీ విమర్శకుడిగా, న్యాయవాదిగా బహుముఖ పాత్రలను పోషించిన బాలగోపాల్ గారి అమరత్వాన్ని, తను చేసిన పోరాటాలను స్మరించుకుంటూ రాసిన కవితా ఖండిక 'హక్కుల కవచం'.

### 2. 7. 2. మైకేల్ జాక్సన్:

మైకల్ జోసెఫ్ జాక్సన్ (ఆగష్టు 29, 1958 – జూన్ 25, 2009) అమెరికాకు చెందిన ఒక ప్రముఖ సంగీత కళాకారుడు. ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడుపోయిన మ్యూజిక్ ఆల్బమ్ "థ్రిల్లర్" (Thriller) జాక్సన్ పాడినది. పది సంవత్సరాల వయసులో తన అన్నతమ్ముళ్ళతో కలిసి పాడటం ఆరంభించిన జాక్సన్, నలభై ఏళ్ళకు పైగా సంగీత ప్రపంచంలో ఒక భాగంగా ఉన్నాడు. 1970 ప్రాంతంలో జాక్సన్ పాప్ సంగీతాన్ని స్వాధీనం చేసుకున్నాడు. అమెరికాలోని శ్వేతజాతీయుల మద్దతు పొందిన మొదటి నల్ల జాతి సంగీత కళాకారుడు జాక్సన్.

"ఇసుక వెదజల్లినా
నేల రాలనివ్వని నీ రాజ నం
జన ప్రభంజనమై

జోహార్లు అర్పిస్తూ వీక్షించిన కళ్లు
టీవి స్క్రీన్ల విశ్వవ్యాపితం
ఆటపాటలతో
ప్రపంచానికి నువ్వెపుడూ గైడ్వై
దిశానిర్దేశకుడవే"

(మైక్ సితార: పుట: 35)

అంటూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సంగీత, నృత్య కళాకారుడు అయిన మైకేల్ జాక్సన్ మీద తనకు ఉన్న అభిమానం వ్యక్తపరుస్తూ, అమెరికాలో ఉన్నటువంటి తెల్ల జాతి వారి అణచివేతను ఎదుర్కొని ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకున్న వ్యక్తి మైకేల్ జాక్సన్. తను ఎన్నో ఆటుపోట్లను అధిగమించి, ఉన్నత శిఖరాలను అధిరోహించి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన మైకేల్ జాక్సన్ గారి కళా నైపుణ్యంను చిత్రించిన కవితా ఖండిక 'మైక్ సితారా'.

### 2. 7. 3. గుఱ్ఱం జాషువా:

గుఱ్ఱం వీరయ్య, గుఱ్ఱం లింగమాంబ దంపతులకు 1895 సెప్టెంబర్ 28 వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్టం, గుంటూరు జిల్లా, వినుగొండ ప్రాంతంలో గుఱ్ఱం జాషువా జన్మించారు. ఈయన ప్రముఖ దళిత కవి. వీరు అనేక కవితా ప్రక్రియలు రాసినప్పటికీ వీరి ఖండకావ్యాలకు ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. వివర్శకుడిగా, కథారచయితగా, ఖండకావ్యరచయితగా మొదలైన ఎన్నో ప్రక్రియలలో రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సునంపన్నం చేసారు. వీరు 24 జులై 1971న కన్నుముశారు. వీరి గురించి సిద్దెంకి యాదగిరిగారు 'విశ్వమానవ విపంచి' అనే కవితా ఖండికలో ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు.

"మనువాద రొంపిలో జాతి మునిగి వున్నపుడు జన్మించినవు
అంటరాని అలికిడి విని కళ్లు దెరిచినవు
ఊయల్లోనే శిశువువై సమానతల కోసం ఆలోచిస్తూ
అక్షరాల వెలుగుల్ని పేర్చి నవయుగానికి నడుంకట్టిన చక్రవర్తి
కన్నీటి సిరాచుక్కల కవికోకిలవై నిత్య వసంతం కోసం
బిగిసిన పిడికిట్లో బీజాక్షరాల విత్తనాల్ని ఎగజల్లుతూనే
కలం గళానివై సాహితి తారగా గగనమెక్కావు"

(విశ్వమానవ విపంచి: పుట: 55)

అంటూ సిద్దెంకి యాదగిరిగారు కుల రక్కసి బుసలు కొడుతున్న అసమాన చీకటి కాలంలో జన్మించి, అనేక అవమానాలను అనుభవించి, అక్షరానికి అనర్హులను చేసిన సమాజ దుర్నీతిని ఎదిరిస్తూ, అక్షరాలే తన ఆయుధంగా భావించి, తెలుగు సాహితీ జగత్తులో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని విశ్వనరునిగా కీర్తిగడించిన సాహితీ తారగా జాషువాను మననం చేస్తూ, ఆయన చేసిన సాహిత్య సేవను 'విశ్వమానవ విపంచి' అనే కవితా ఖండికలో వివరించారు.

### 2. 7. 4. ఆచార్య కొత్తపల్లి జయశంఖర్:

తెలంగాణ సిద్ధాంత కర్తగా పేరుపొందిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 1934 ఆగస్టు 6న వరంగల్ జిల్లా హన్మకొండలో జన్మించారు. తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త. 1952లో ప్రారంభమైన ముల్కీ ఉద్యమం నుంచి మొదలుకుని నేటివరకు జరుగుతున్న ప్రత్యేక తెలంగాణ అస్తిత్వ పోరాటానికి ప్రేరణ. ప్రత్యక్ష సాక్షి. విద్యార్థి దశ నుంచి ప్రత్యేక పోరాటంలో క్రియాశీల పాత్ర పోషిస్తూనే విద్యాభ్యాసం కొనసాగించి ఉన్నత శిఖరాలనధిరోహించిన విద్యావేత్త. బెనారస్, అలీఘడ్ విశ్వవిద్యాలయాల నుంచి ఎంఏ ఎకనామిక్స్ చేశారు. ఉస్మానియా యూనివర్శిటీ నుంచి పి. హెచ్ డి పొందారు. వరంగల్లోని సికెఎం కళాశాల ప్రిన్సిపల్గా, సీఫెల్ రిజిస్ట్రార్గా వ్యవహరించారు. కాకతీయ యూనివర్శిటీ ఉపకులపతిగా బాధ్యతలు నిర్వర్తించారు.తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలరు. 1952లో ఇంటర్మీడియట్ విద్యార్థిగా ముల్కీ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ 1954లో ఫజల్అలీ కమిషన్ ను కలిసిన విద్యార్థి బృందంలో సభ్యుడిగా ఉన్నారు. 1968 నుంచి 1971 వరకు అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు. ఆనాటి నుంచి నేటి వరకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అవశ్యకతపై లోతైన విశ్లేషణ చేస్తున్నారు. ఉద్యమ తీరుతెన్నులు, సీమాంధ్ర పాలకుల మోసాలపై విశ్లేషణలతో కూడిన వ్యాసాలు, రచనలు చేశారు. చేస్తున్నారు. తెలంగాణవాదాన్ని సజీవంగా నిలబెట్టడానికి యాభైయేళ్లుగా నిరంతరం తపనపడుతున్న వ్యక్తి కొత్తపల్లి జయశంకర్.జాతీయ,అంతర్జాతీయ వేదికల పై, వివిధ యూనివర్శిటీలు, పరిశోధనా సంస్థల సభల్లో, సమావేశాల్లో తెలంగాణవాదాన్ని వినిపించాడు. 1969 తరువాతికాలంలో స్తబ్ధుగా ఉన్న తెలంగాణ ఉద్యమానికి 1994లో పునాదులు వేశారు. 1999లో అమెరికాలో తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం స్థాపించేందుకు విశేషకృషి చేశారు. అమెరికాలోని ముఖ్యనగరాలన్నింటిలో పర్యటించి తెలంగాణ ఏర్పాటుకు అంతర్జాతీయ మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నించారు. 2001లో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి సిద్ధాంతకర్తగా నిలిచారు. ఆ పార్టీ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారు. కేన్సర్ వ్యాధితో 2011 జూన్ 21న మృతి చెందారు. వీరి గురించి సిద్దెంకి యాదగిరిగారు 'ఉద్యమ సూరీడు మరోలా ఉదయిస్తాడు' అనే కవితా ఖండికలో ఈ క్రింది విధంగా పేర్కొన్నారు.

"సమైక్య ప్రభుత్వాల దొంగాట నాటకం
అన్ని పార్టీలు ఒక బూటకం
నిధులు వాళ్లకు కన్నీళ్లు మనకి అని
ప్రశ్నలకు పురుడు పోసిందు
మన ఓట్లు మనకు వన కూడాలే
మన నీళ్లు మనకు పారుతయ్
మన కొలువులు మనం జేస్తం
మనల్ని మనం ఏలుకోవాలి అని బోధించే జయ శంఖం
ఉద్యమ రవి జయశంకర్ సార్ గారు"

(ఉద్యమ సూర్యుడు మరోలా ఉదయిస్తడు: పుట: 72)

ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ అంటూ తెలంగాణలో ఆంధ్ర రాష్ట్రాన్ని విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ సీమాంధ్ర అధికార దాహాన్ని, దోపిడీ వ్యూహాల్ని గురించి ప్రజలకు తెలియజేస్తూ, మన ఓట్లు మనకు ఉండాలి మన సీట్లు మనకే కావాలంటూ, మన బతుకు మారాలన్న, పేద ప్రజల ఆకలి చావుల బాధలు పోవాలన్నా, మన రాష్ట్రం మనకు కావాలంటూ తెలంగాణ రాష్ట్ర వేర్పాటు ఆవశ్యకతను గురించి అనేక ప్రసంగాల ద్వారా, అనేక రచనల ద్వారా, తెలియజేసిన తీరును అదేవిధంగా తెలంగాణ వేర్పాటును కాంక్షిస్తూ కీ. శే. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ గారు చేసిన నిర్విరామ కృషిని స్మరిస్తూ రాసిన కవితా ఖండిక 'ఉద్యమ సూర్యుడు మరోలా ఉదయిస్తడు'.

## మూడవ అధ్యాయం

# "*బతుకు పాఠం*" కవిత్వం – సామాజిక అంశాలు

సామాజిక స్పృహ గల ఏ కవి అయినా తనకు తెలిసో, తెలియకో తన చుట్టూ ఉన్న సమాజం యొక్క ఆర్థిక, రాజకీయ, సామాజిక,సాంస్కృతిక జీవిత వాస్తవ లక్షణాలను ప్రతిబింబిస్తూ వాటి మీద తిరుగుబాటు చేసి తను ఎలాంటి సమాజంలో అయితే కోరుకుంటున్నాడో ఆ సమాజం యొక్క ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక జీవిత లక్షణాలను ప్రతిపాదిస్తూ ఉంటాడు.

## 3. 0. సామాజిక స్పృహ పదానికి అర్థాలు:

*"సమాజంలో ఉన్న వివిధ వ్యవస్థల ఉనికి గురించి, వివిధ సమస్యల గురించి వాస్తవ దృష్టి ఆధారంగా ఉన్న అవగాహనా, ఆలోచనా"* అంటూ నళిని గారు సామాజిక స్పృహ గురించి తన అభిప్రాయంను ఇలా తెలియజేశారు. (సాహిత్యంలో విమర్శ పదాల డిక్షనరీ: పుట: 184)

సిద్దెంకి యాదగిరి కవిత్వంలో సామాజిక వాస్తవికతను ప్రతిబింబించే కవితల్లో 'గురుమయం', వానమ్మకు దండం, ఓ యుద్ధం, రైతు ఎత, శరీరాస్త్రం, కులగర్వం, చదువుతున్నాం, విశ్వమానవ విపంచి, తెగారం మొదలైనవి ముఖ్యమైనవి. ఈ కవితల ఆధారంగా సిద్దెంకి యాదగిరిగారు సామాజిక దృక్పథాన్ని ఈ అధ్యాయంలో పరిశీలిద్దాం.

## 3. 1. సమాజంలో సాహిత్యం పాత్ర:

*అక్షరాలు జీవిత సాక్షాత్కారాలు భవిత నిర్మాణ నిపుణత్వం అక్షరాల్లో నిక్షిప్తమైంది. అక్షరాలకు అక్షరాలు అని ఎవరు పేరుపెట్టారో కానీ నన్ను అంటిపెట్టుకొని నిత్యం నా వెంటవుండే మిత్రుత్వం, అక్షరాల పొందిక ఒక ఆటలాగ ఉంటుందనీ, మంచి పొందికను చదివిన అక్షరాల అల్లికను రాసిన కలిగే ఆనందం అంతాయింతా కాదు. అక్షరాలను కొందరు పొందిక కోసం రాస్తే, కొందరు జీవితాల్ని ఒలకబోసేందుకు రాస్తరు. రెండోరకం నాకు చాలాయిష్టం. ఏది రాసినా నా చుట్టూ ఉండే జీవితాలను ప్రతిబింబించడమే పనిగా పెట్టుకున్నాను.* (బతుక పాఠం: పుట: xi) అంటూ సిద్దెంకి యాదగిరిగారు తనకు అక్షరాలపై ఉన్న మమకారాన్ని పై విధంగా తను వ్రాసిన "*బతుక పాఠం*" కవితా సంపుటిలోని ముందుమాటలో వివరించారు.

*ఊహాశక్తి, సృజనాత్మకత, కళాత్మక విలువలూ ఉన్న రచనలు. కథ, కావ్యం, నవల, నాటకం మొరూపంలో వచ్చే వివిధ రచనలు.రచనలు మౌఖికమైనవి కావచ్చు; లిఖితరూపంలో వున్నవీ కావొచ్చు;నాటకరూపంలోఉండవచ్చు; రేడియో టీవీ వంటి ప్రసారసాధనాల ద్వారా ప్రసారం అయ్యేవి కావొచ్చు. 'సాహిత్యం' అనే మాటని వేరే అర్థాల్లో కూడాఒక్కోసారి ఉపయోగించడం వచ్చును.*

*మానవీయ శాస్త్రాల సాహిత్యం,సామాజిక శాస్త్రాల సాహిత్యం మొదలయినవి. ఇవన్నీ కాల్పనికేతర సాహిత్యం కిందికి వస్తాయి.* (సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ: పుట: 185)

*"హితేన సహితం సాహిత్యమ్" అనుటచే సాహిత్యము మేలు కూర్చునట్టిది. ప్రీతిదాయకమైనది. నీతిని బోధించునది. ధర్మ ప్రతిపాదనము చేయునది. సాహిత్యము ఉపదేశ ప్రధానము కాకున్నను దురుపదేశము మాత్రము కారాదు.* (*తెలుగు సాహిత్య సమీక్ష* ప్రథమ సంపుటి: పుట: 3)

పై సాహిత్య నిర్వచనాల పరిశీలన బట్టి సాహిత్యం మానవుని జీవితంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని మనకు తెలుస్తుంది. అదేవిధంగా సమాజ స్థితిగతులను కవులు రచనల ద్వారా ప్రజలకు తెలియడంలో సాహిత్యం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఆదికవి నన్నయ తన కవితా రీతులను మహాభారత అవతారికలో ఉత్పలమాల ఛందస్సులో ఇలా చెపుతూ "*మహాభారత సంహితా రచన బంధురయ్యో జగద్ధితంబుగన్*" అని సాహిత్యం సమాజ శ్రేయస్సును కోరుతుందనే అర్థంలో చెప్పారు. అంటే ఇక్కడ నన్నయ్య దృష్టి ప్రకారం ఒక కావ్యం ప్రపంచ హితాన్ని కోరుతుంది. నన్నయ రాసిన *"ఆంధ్ర శబ్ద చింతామణి"*లో "విశ్వశ్రేయః కావ్యమ్" *(ఆంధ్ర శబ్ద చింతామణి: పుట: ౪)* అనే సూక్తి తోనే ఈ వ్యాకరణ గ్రంథం మొదలవుతుంది. ఇక్కడ కూడా నన్నయ్య కావ్యాన్ని ప్రపంచ హితంకోరే అంశంగానే వర్ణించారు.

ఆర్యులు చెప్పిన నిర్వచనాల ప్రకారం సమాజంలో జరుగుతున్న విషయాలన్నీ సాహిత్యం ద్వారా కవులు ప్రజలకు చేరవేస్తున్నారు. మన ప్రస్తుత పరిశోధక కవి సిద్దెంకి యాదగిరిగారు కూడా సామాజిక అంశాలను తను రాసిన "*బతుకు పాఠం*" అనే కవితా సంపుటి ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నారు. అందులో 'అక్షరాల జీవితం' అనే కవితా ఖండికలో సమాజంలో అక్షరం పాత్ర ఏ విధంగా ప్రభావితం చేస్తుందో వర్ణించారు.

"ఈ అక్షరాలు
అభాగ్యుల వద్ద కాసిన్ని కన్నీళ్లనీ
కొందరిపట్ల జాలిని రాలుస్తూ
ఇంకొందరి పట్ల జ్వాలల్ని రగిలిస్తూ.
దేశభక్తిని నూరి వీరున్ని ప్రసవిస్తయి
అక్షరశక్తి నేతల్ని ఆవహించినందున
చరిత్ర ఘనత అక్షరమయమైంది"

(అక్షరాల జీవితం: పుట: 23, 24)

ఒక సాహిత్య అక్షరం అభాగ్య జీవుల పట్ల బాధని, జాలిని చూపిస్తూనే మరోపక్క విప్లవాన్ని రగిలిస్తూ దేశం కోసం పోరాడే వీరులను తయారుచేస్తుంది. అదే గొప్ప చరిత్రకు దారితీస్తుందంటూ అక్షరాన్ని అనేక రకాలుగా వర్ణించడంలో సిద్దెంకి యాదగిరిగారు ఉపయోగించిన శిల్ప, శైలీ రమ్యత చక్కనైనది. సాహిత్యం ద్వారా సమాజ పరిస్థితిని పాఠకునికి చూపిన మరో కవితా ఖండిక 'గురుమయం'.

"నా ఆలోచనల కర్మాగారంలో
అక్షరాల్ని ఆయుధాలుగా జేస్తున్న
ప్రజా సమస్యల పాఠశాలలో
సమస్యలే గురుబోధలు అవుతూ
బాధ్యతలు గుర్తుచేస్తు కొత్తదనం నేర్పుతున్నయ్
ప్రజల్ని మింగే కుట్రలు ప్రబలుతున్నపుడు
ప్రజాస్వామ్యం హత్య చేయబడుతూ
కనపడని సామ్రాజ్య విస్తరణ విషం చిమ్ముతుంటే
నా మనసు కవిత్వ నిప్పుకణికలై రగులుకుంటది.
ఉద్యమ మంట అంటుకుంటది
ఎందుకంటే అంతటా అన్నీ గురుమయమే కాబట్టి"

(గురుమయం: పుట: 29, 30)

ప్రజాస్వామ్యం అంతరిస్తున్నప్పుడు సాహిత్యం ఉద్యమ రూపంలో పుట్టుకొచ్చేది కవిత్వమంటూ ఈ కవితా ఖండికలో సిద్దెంకిగారు నినాద ప్రాయంగా కవితా నిర్మాణం చేశారు. అలా పుట్టుకొచ్చిన ఉద్యమాల ద్వారా ఎదురయ్యే సమస్యలను పాఠాలుగా స్వీకరించి, సమస్యలను గురువుగా భావించి రాసిన ఈ కవిత 'గురుమయం' అనే కవితా ఖండిక. ఈ కవితలో మనకు ఎటు చూసినా కనబడే సామాజిక అంశం ప్రజాస్వామ్య విధ్వంసం. ప్రజాస్వామ్యంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను ఎదిరించేటందుకు కవికి ఉన్న ఆయుధం కవిత్వం. అది ఎలా ఉండాలంటే ప్రజలపై అధికారం చెలాయిస్తున్న నాయకులను ఎండగట్టే విధంగా ఉండాలని ఆయన భావిస్తున్నారు. చివరగా ఉద్యమాలు ప్రజల మీద జరుగుతున్న కుట్రలను సహించలేక పుట్టుకొచ్చేదని తెలియజేస్తున్నారు.

అక్షరం మానవత్వాన్ని కోరుతుందని చెప్పిన సిద్దెంకిగారి కవితా ఖండిక 'జీవాక్షర వలలు'.

"మానవత్వం విరాజిల్లాలనీ
సమానతలు నిలువాలనీ
ప్రేమ సోదర భావం పెరుగాలనీ
తగిలిన గాయాల్లోంచి తవ్వితీస్తున్న సాహిత్యం
విశ్వ మానవ పతాకం పైన
నా అక్షరాల లక్ష్యం
వివక్ష రహిత ప్రజపక్షం
నా అక్షరాలు గురి అపరిమిత పరిధి
నా అక్షరాలు జీవాక్షర చైతన్య వలలు"

(జీవాక్షర వలలు: పుట: 129)

సిద్దెంకి యాదగిరిగారు కవిత్వం ప్రజల చైతన్యం కొరకు ఉపయోగపడాలి అంటూ రాసిన కవిత ఈ 'జీవాక్షర వలలు' అనే కవితా ఖండిక. ఇందులో మానవత్వం పరిమళించే విధంగా ఈ కవితా నిర్మాణం ఉంది. విశ్వ మానవతావాదాన్ని ప్రతిపాదించే దిశగా ఈయన ఈ కవితను తీసుకువెళ్లారు. తన సాహిత్యం కేవలం ఒక వర్గానికే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకూ తన కవిత్వం చెందుతుందని ఈ కవితలో చెప్పారు. ఈయన ఉపయోగించే శైలి రమ్యత కవితా నిర్మాణానికి చక్కగా సరిపోతున్నాయి. పదజాలం, పలుకు బళ్ళు ప్రజల వ్యవహారిక భాషకు చెందినదిగా ఉండటం వీరి కవిత్వంలో ప్రత్యేకత. ఎంచుకున్న వస్తువును సూటిగా పాఠకునికి చెంతకు చేర్చడం వీరి కవితలలోని మరొక ప్రత్యేకత.

### 3. 2. రైతు వ్యధలు:

దేశం అనే దేహానికి రెండు కళ్ళలాంటి వారు సైనికుడు, రైతు. ఒకరు విదేశీ శత్రువులనుండి దాడులను చేదిస్తూ, దేశం సరిహద్దుల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ ప్రజల ప్రాణాల రక్షణే తమ ధ్యేయంగా భావిస్తూ, పరాయి దేశ దుర్మార్గపు, దురాక్రమాల నుండి కాపాడుతుంటే కరువొచ్చి అలమటించే ప్రజలకు అన్నంపెట్టే వాడు రైతు. కరువుకాటకాల గండాలను ఈదుతూ దేశం ఆకలిని తీర్చే అన్నదాత రైతు. ఇలా అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్న రైతు గురించి తెలిపే కవితా ఖండిక 'రైతు ఎత'.

"ఉడుకు దుక్కిల ఉడికిన విత్తనాలకు
దారెత్తి జీవిగంజి తన శమట జాలుతో కలిపి
బతికించటం కోసం బహు కష్టాలు దీసిండు
ఫలితం లేక పరేషాన్ల పడ్డడు
మట్టి పొత్తిళ్లను నిమురుతూ
బాలింత నొప్పులు తీసుకుంటూ
మనసు కలికలి అయి వొల పోత్తండు"

(రైతు ఎత: పుట: 75)

అంటూ సిద్దెంకి యాదగిరిగారు రైతులు విత్తనాలు నాటింది మొదలుకొని, పంట చేను ఎదగడానికి సరైన సమయంలో వర్షాలు పడక పోయినప్పుడు, రైతులు పంటను రక్షించడం కోసం వారు పడే శ్రమను గురించి, చేతికొచ్చిన పంట నీరు లేక ఎండి పోతుంటే, రైతుల బాధ వేదనాభరితమై ఎలా ఆవేదనకు గురవుతారో ఈ కవితా పంక్తుల ద్వారా తెలియజేశారు.

సకాలంలో వర్షాలు పడకపోగా, మరొకవైపు బావుల మోటార్లకు కరెంటు చాలక, పండించిన పంటలకు మార్కెట్లో సరైన ధరలు పలకక, అప్పులపాలైన రైతులు చేసేదేమిలేక వ్యవసాయాన్ని వదిలి పట్టణాలకు వలసలువెళ్ళి వలపోస్తున్నారు. అన్నదాతల ఆకలికేకల బాధలను విని కనీసం స్పందించకపోగా, వారిని ఆదుకునే దిక్కులేక నిరాశాలతో ఆత్మహత్యలకుపాల్పడుతూ తనువుచాలిస్తున్న రైతుల గోసను కవి అక్షరీకరించాడు.

"ఎదిగీ ఎదగని పంటకోసం
పొద్దంత ఎరువు కోసం తవుసుదీస్తడు
పరువున్నోందే రాజ్యము అయి
అధికారమున్నోందే భోజ్యము అయి
కొరత పేరుచెప్పి తలా రెండు కొలతలతోయిస్తది
దొడ్డిదారిన పోయే సరుకును అధికారం సాగదోలుతది
యిత్తునాల గోదాం
యిగురంతో ఉత్తచేతుల గాకుంట పంపుతది
కుతి ఆర కోరె రైతుల మీదికి మితి మీరుతది
తుత్తునీయులు చేయుటకు ఎత్తులు ఏసి

అయినోని పంచన జేరినపుడు
టోపీల గుంపు లాఠీలతో వాతల్ పెడ్తాయ్''

(రైతు ఎత: పుట: 76)

అంటూ సిద్దెంకి యాదగిరిగారు రైతులు పంట చేను ఏపుగా ఎదగడానికి, పంట చేనుకు పట్టిన చీడపురుగుల రోగం నుండి కాపాడడానికి కావలసిన ఎరువులు సరైన సమయంలో సరిపడా, అందుబాటులో ఎరువులు లేక గంటల తరబడి ఫర్టిలైజర్ దుకాణాల ముందు బారులు తీరా నిలబడితే దళారులు వచ్చి ఉన్న మొత్తాన్ని తీసుకెళ్ళి, రైతులను నిరాశపర్చడమే కాకుండా, అక్కడ జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించే రైతుల మీద జరిగేటటువంటి దాడి,దుశ్చర్యకు దర్పణం ఈ కవితా పంక్తులు.

ఎంతో వ్యయప్రయాసలకోర్చి తీసుకొచ్చిన మందులకు పురుగులు చావక, పంట దిగుబడి రాక నకిలీ, కల్తీ మందుల మాయలాడి మార్కెట్ వ్యవస్థ చేతిలో మోసపోయిన రైతులను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటున్నా దుస్థితిని చూసి కవి ఎంతో చెలించిపోయి బాధితుల పక్షాన నిలబడి రైతుల సంక్షేమాన్ని విస్మరించిన రాజ్యం మీద తన కవిత ఖడ్గాన్ని ప్రసాదించాడు.

"ఉన్నోని ఊడేగం జేసే బ్యాంక్లు
వసూళ్ళ కోసం బక్క రైతుల్ని చూసే వరకు
యెర్రిలేసి యెంటవడయ్
ఎముకల పూలుగునైన జుర్రుకోవాలని
పాణం దీసుకునే ఎల్యం రాళ్లు విసురుతయ''

(రైతు ఎత: పుట: 76)

అంటూ పంట పెట్టుబడి కోసమని, బ్యాంకుల్లో అప్పు కోసం రైతు పడేటువంటి అనేక ఇబ్బందులను ఈయన కవిత్వీకరించారు. రైతులకు బ్యాంకు అనేక షరతులతో కూడిన ఋణాలు ఇచ్చినప్పటికీ, వాటి మీద అధిక వడ్డీని వసూలు చేస్తూ, పంట నష్టం వచ్చి అప్పు సకాలంలో చెల్లించని ఎడల రైతులను నానా ఇబ్బందులకు గురిచేస్తుందే తప్పా, దళారీలకు వేల కోట్ల రూపాయలను రుణాలు ఇస్తూ, వారు రుణ బాకీలు చెల్లించకుంటే వారి రుణాలను మాఫీ చేస్తాయంటూ, రైతుల పక్షాన తన నిరసన గళం వినిపించారు 'రైతు ఎత' అనే కవితా ఖండికలో.

దేశంలోని అన్ని ప్రాంతాల రైతులు అసహనంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మానసికంగా దాదాపు శవాలైపోయి, ఇన్నాళ్లుగా ముద్దపెట్టి ఆదరించిన వ్యవస్థ చేతనే, దిక్కుమాలిన వాళ్ళుగా చూడబడుతూ, వ్యవసాయం అంటే పనికి మాలిన పనిగా చూస్తున్న ప్రస్తుత పరిస్థితులను రైతు

చెమటని రక్తాన్ని జుర్రుకుంటూ, వికటాట్టహాసం చేస్తున్న, దళారీ వ్యవస్థలో రైతు దైన్య స్థితిని కవి కళ్ళకు కట్టినట్టుగా వివరించారు.

రైతును వెంటాడి వేధిస్తున్న సమస్యలలో మరీ ముఖ్యమైనది వర్షం. ఈ వర్షం సరైన సమయంలో కురవక పోయినా రైతుకు కష్టమే, అదేవిధంగా అతిగా కురిసిన ఎంతో నష్టాన్ని చేకూర్చుతుంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతుల జీవితాలు ఏ విధంగా సతమతం అవుతాయో వివరించిన కవితా ఖండిక 'వానమ్మకు దండం'.

"నింగినేల ఏకధారగా కురిసింది
తెంపులేని వాన చెరువు కట్టల్నితెంపి
ఊళ్లను ముంచింది
కరువు దూసిన కత్తులు వర్షాల వంతైంది
కూలినాలి బతుకుల గూడు కూల్చిపోయింది"

(వానమ్మకు దండం: పుట: 42)

అంటూ సిద్దెంకి యాదగిరిగారు ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం కురవడం వల్ల చెరువుకట్ట తెగిపోయి దాని సమీపాన ఉన్నటువంటి రైతు, కూలీల ఇళ్ళలోకి వరద నీళ్ళు రావడంతో ఎన్నో ఆశలతో కట్టుకున్న ఇల్లు కూలిపోగా, అందులో ఉన్నవారు చనిపోయి, అలా వరదలు రావడం వల్ల కొందరి శవాల ఆచూకీ దొరక్కుండా పోయిందంటూ, కవి తన ఆవేదనను ఈ కవితా పంక్తుల ద్వారా తెలియజేశారు.

"పొద్దుమాపు పంటను
కంటికి రెప్పలై కాసిన రైతుగుండెను
జడివాన దాడి చేసింది"

(వానమ్మకు దండం: పుట: 43)

అంటూ సిద్దెంకి యాదగిరిగారు రైతు తన కండలను కరిగిస్తూ, చెట్టు పుట్టను చదునుచేసి, విత్తడానికి గింజలు లేకపోతే, షావుకారు దగ్గర వడ్డీకి డబ్బులు తీసుకువచ్చి, ఎంతో ఆశతో కొత్త విత్తనం నాటిన రైతు పంటకు చీడ పురుగుల రోగం వచ్చినప్పుదు ఎంతో ఆవేదనకు గురవుతూ, తన ఇంట్లో పెండ్లిడుకు వచ్చిన పిల్లలు పెరిగి కుంపటైపోతున్నా కానీ, తను అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, రోజూ సచ్చి పుడుతున్నప్పటికీ, పంట చేను కాపాడడానికి ఎరువులకు డబ్బులు లేకపోతే తన భార్య మెడలోని పుస్తెలు అమ్మి క్రిమిసంహారక మందులు తెచ్చి, ఆరుకాలం శ్రామిస్తూ, పంట చేనును కంటికి

రెప్పలా కాపాడుతున్న సమయంలో అకాల వర్షం కురిసి పంట చేను మునిగిపోయి రైతు బ్రతుకు అగాధపాలై చింతలతో చితికిపోయిన రైతు జీవితాన్ని కండ్ల ముందు కదలాడేలా అభివ్యక్తీకరించారు.

3. 3. ప్రాంతీయ వాదం:

సిద్దెంకి యాదగిరిగారు రాసిన *"బతుకు పాఠం"* అనే కవితా సంపుటిలో తెలంగాణ సంబంధిత రుగ్మతులను, అదేవిధంగా తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాలను, తెలంగాణ ప్రాంతం మీద మోపబడుతున్న ఇతర సంస్కృతులను గురించి తెలంగాణ ప్రజలను సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, భాషా రంగాలలో అనేక రకాలుగా సీమాంధ్ర పాలకులు తెలంగాణను అవమానపరచి కట్టు, బొట్టు, పండుగలు, ఆచారాలు, ఆహార పద్ధతులు, వ్యవహారాలు అనాగరికమైనవని అవహేళన చేయడాన్ని నిరసిస్తూ ఈ కవితా సంపుటిలో కొన్ని కవితా ఖండికలు రాయడం జరిగింది.

సిద్దెంకి యాదగిరిగారు *"బతుకు పాఠం"* కవితా సంపుటిలో ఉద్యమ ప్రస్తావనను కొన్ని చోట్ల చేసారు. కావున నేను మొదటగా ఉద్యమానికి నిఘంటువులలోని అర్థాలను తెలుపుతాను. *ఉద్యమం (Movement) కళాసాహిత్యరంగాల్లో ప్రక్రియల్లోగానీ, ఇతివృత్తాల్లో గానీ, శైలిలో గానీ విస్తృతస్థాయిలో మార్పు వస్తే, దాన్ని సూచించడానికి వాడే మాట. ప్రారంభమైన మార్పుకి అనుకూలంగా విస్తృతస్థాయిలో రచయితలు స్వయంగా కదలడంగానీ, కొందరు క్రియాశీలక రచయితలు కదిలించడంగానీ, మేనిఫెస్టోల వంటి అవగాహనాపత్రాల్ని వెలువరించడం గానీ; భావసామ్యమూ, రచనాసామ్యమూ ఒక వేదికలో ఉన్న రచయితలందరూ సంఘటితం కావడంగానీ జరిగినప్పుడు దాన్ని ఉద్యమంగా ప్రస్తావిస్తూ ఉంటారు. పాఠకులనించీ క్రియాశీలకమైన మద్దతు (విరాళాలివ్వడం, రచనలు చదవడం, చర్చాగోష్ఠుల్లో పాల్గొనడం, ఇతరులచేత చదివించడం మొ.) ఉన్నప్పుడు కూడా ఉద్యమ వాతావరణం ఉన్నట్టే భావిస్తారు.*(సాహిత్య విమర్శ పదాల డిక్షనరి: పుట: 47)

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో గల ప్రధాన విశ్వవిద్యాలయం ఉస్మానియా. దీనిని హైదరాబాద్ ఏడవ నిజాం ఫత్ జంగ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 1917వ సంవత్సరంలో స్థాపించారు. ఎందరో విద్యావేత్తలను, శాస్త్రవేత్తలను, మేధావులను, కవులను, కళాకారులను, నాయకులను దేశానికి అందించిన చదువుల నీలయం ఉస్మానియా విశ్వవిద్యాలయం.

ఏ ఉద్యమానికైనా ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాణవాయువు లాంటిది. తెలంగాణ తొలిదశ పోరులో అయినా, మలిదశ ఉద్యమంలో అయినా, ఉస్మానియా విద్యార్థుల పాత్ర చిరస్మరణీయమైనది. ఉస్మానియా విద్యార్థుల పోరాటపటిమను వారి త్యాగాన్ని గురించి 'ఓ యుద్ధం' అనే కవితా ఖండిక ద్వారా ఈ విధంగా తెలియజేశారు.

"ఉస్మానియా విద్యార్థుల చైతన్యం
దోసిలితో ఉద్యమాన్ని ఎగజల్లుతూ
ఉద్యమ ఉగ్గుబువ్వ మొలక అలుకుతరు
అన్యాయం పై తిరుగుబాటుతో
అగ్గిపిడుగై భగ్గుమంటది
ఆశయాల నిప్పురవ్వల్ని రగిలించి
తెలంగాణ తెగువకు ఉదాహరణవుతది"

(ఓ యుద్ధం: పుట: 69)

అంటూ సిద్దెంకి యాదగిరిగారు ఉస్మానియా విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర కాంక్షను, తెలంగాణకు జరుగుతున్న అన్యాయంను గురించి ప్రజలకు చేరవేయడంలో ముఖ్య భూమిక పోషించారనే విషయం ఈ పంక్తుల ద్వారా పాఠకుడికి స్పష్టమవుతుంది.

"బులెట్ల వానకు లాఠీ దెబ్బలకు
నీళ్ళ బాష్ప వాయువుకు
ఎదురు ఈదుతూనే శక్తి మథనంతో
రాళ్ళ వానయి కురుస్తరు
పరాయిపాలన ఆజ్ఞల పాపానికి
చిప్పటోపీల పగకూ, లాఠీల ప్రతాపానికి
ఇనుపబూట్ల కింద నలిగిపోతున్న
ఆఖరు గడియలైనా లెక్కచేయరు"

(ఓ యుద్ధం: పుట: 69)

అంటూ రాష్ట్ర సాధన ఉద్యమం ఉధృతంగా సాగుతున్న తెలంగాణ విద్యార్థి ఉద్యమాన్ని అణచివేయడానికి పోలీసులు లాఠీలతో కొడుతూ, రబ్బర్ బుల్లెట్లతో కాల్చినా, టియర్ గ్యాస్తో దాడి చేస్తూ, ఇనుప బూట్ల కాళ్ళతో తొక్కుతూ, విద్యార్థులను నానా చిత్రహింసలకు గురిచేసినా, చివరికి వారి ప్రాణాలను కూడా లెక్కచేయకుండా, పోరాడుతున్న విద్యార్థుల తెగువను గురించి ఈ పంక్తుల ద్వారా అవగతం చేసుకోవచ్చు.

"369మంది విద్యార్థి అమరవీరుల రక్తం
సునామి కెరటాలై రాష్ట్రంకోసం దేహంలో ప్రవహిస్తూ
ఉసిగొలుపుతూ ఉద్యమ వారసత్వాన్ని నిలుపుతుంది
కుంజీయిస్తే ఎగిరి దుంకె ఆటబొమ్మలుకారు
ఆడిస్తే ఆడే తోలు బొమ్మలు అంతకన్నాకాదు
ఉస్మానియా విద్యార్థులు ఉద్యమ పాఠాలు నేర్చుకోరు
ఉద్యమ పాఠాలు నేర్పుతరు
ఇపుడు ఓ.యు హైద్రాబాద్ లో లేదు
ఊరూరుకు విస్తరించిన శాఖ"

(ఓ యుద్ధం: పుట: 70)

అంటూ తెలంగాణ ఉద్యమ చైతన్యాన్ని గ్రామ గ్రామానికి అందించిన స్ఫూర్తిప్రదాతలు ఉస్మానియా విద్యార్థులు. కొందరు స్వార్థరాజకీయ నాయకులు వారి వారి స్వలాభం కొరకు ఉద్యమానికి వెన్నుచూపితే ఆ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచి ఉద్యమాన్ని ఉధృతం చేసిన ఘనత ఉస్మానియా విద్యార్థులదిగా చిత్రిస్తూ, తెలంగాణరాష్ట్ర సాధనలో ప్రాణాలు కోల్పో న విద్యార్థుల అమరత్వాన్ని, తెలంగాణ ఉద్యమానికి తలమానికంగా నిలిచిన ఉస్మానియా విద్యార్థుల పోరాట పంథాన్ని గురించి ఈయన 'ఓ యుద్ధం' అనే కవితా ఖండికలో వివరించారు.

"రాజీనామాకు భయపడే రోతనేతలారా
సకల జనుల సమ్మె మోగుతంది
ఊరూర ఏరు అయి పొంగితే
ఒక్కొక్కలు ఓట్ల కెరటాలై మునిగిపోతరు
తెలంగాణ ఉద్యమ లావాలు రాలిపోతున్నరు
వాళ్ళే పగబడితే మీ ఒగల రాజకీయం ఒడిసి పోతది"

(ప్రజలే ఉరితాళ్ళు: పుట: 85)

అంటూ తెలంగాణ ఉద్యమంలో రాజకీయ నాయకులు తెలంగాణ తమ ధ్యేయంగా చెబుతూ, పదవులు అనేవి గడ్డిపోచతో సమానం అంటూ, తెలంగాణ కోసం మా పదవులకు రాజీనామా చేస్తామంటూ ప్రజలకు వాగ్దానాలు చేస్తూ, తీరా పార్టీ అధిష్టానం ముందు నోరు మెదపకుండా ఉంటూ, ప్రజా ఆకాంక్షను విస్మరించిన నేతల వైఖరిని నిరసిస్తూ, సకల జనుల సమ్మె ప్రాముఖ్యతను చెపుతూ,

రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తున్న నాయకులకు ఎన్నికల్లో ప్రజలు ఖచ్చితంగా గుణపాఠం చెబుతారని హెచ్చరించిన కవితా ఖండిక 'ప్రజలే ఉరితాళ్ళు'.

ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తెలంగాణ రాజకీయ ఐ.కా.స. సెప్టెంబర్ 30, 2012 నాడు హైదరాబాద్లో తెలంగాణ మార్చ్ పిలుపునిచ్చింది. రాజ్యాంగం సూచించిన ప్రకారం కేంద్రం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లును పార్లమెంటులో పెట్టాలనే ఒకే ఒక్క డిమాండ్లో తెలంగాణ మార్చ్ కు పిలుపునిచ్చింది. ఈ తెలంగాణ మార్చ్ ను 'సాగరహారం'గా పేరు మార్చడమైంది. ఈ తెలంగాణ మార్చ్ ప్రకటనను 7 జూలై, 2012 నాడు తెలంగాణ రాజకీయ ఐ.కా.స. ఛైర్మన్ కోదండరామ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించడానికి తెలంగాణ మార్చ్ పేరుతో సెప్టెంబర్ 30, 2012న ఛలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నాడు. ఈ సందర్భంలోనే 'ఇంటికో మనిషి, చేతిలో జెండా – ఛలో హైదరాబాద్' అనే నినాదంతో తెలంగాణ వ్యాప్తంగా మార్చ్ కు గ్రామ గ్రామాన చైతన్యపరుస్తామని జేఏసి ప్రకటించింది. 24 సెప్టెంబర్ 2012 నాడు తెలంగాణ రాజకీయ జెఏసి తెలంగాణ మార్చ్ కు 'సాగరహారం' అనే పేరును ఖరారు చేయగా(*తెలంగాణ చరిత్ర–సంస్కృతి*: పుట: 756) ఈ తెలంగాణ మార్చ్ కు సంగీభావంగా రాసిన కవితా ఖండిక 'తెలంగాణ మార్చ్'.

"నల్లటి తారు రోడ్లలను యుద్ధ భూములు చేసి
ఆశయం ఎర్రలుకు రక్తమై త్యాగ తివాచీ పరిచారు
దూసుకొస్తున్న టియర్ గ్యాస్ గోళాల్ని
క్యాచీలు పట్టి తిప్పికొట్టారు
ఎముకల్ని లాటీలు చేసి రాజ్యంతో కోలాటమాడుతూ
నెత్తురు నీళ్ల సాకతో జడకొప్పులేసి
తలపెట్టిన కార్యం కోసం
కార్జాలు, దొబ్బలు పీక్కొని దోరణం కట్టారు
తలల్ని తాకట్టు పెట్టి ఉద్యమ శిఖర తల్వార్లు చేసింద్రు
నిరాయుధ పోరు కవాత్ చేస్తూ
దూసుకొస్తున్న తూటాల్ని దోసిట్లో బంధించి
గోలిమారు ఆడుతూ చౌరస్తాలో నిరసనలైతిరి
రాజ్యంపై రంకెలేస్తూ వడిసెల రువ్వడితో
నిజమైన యుద్ధమయ్యారు" (తెలంగాణ మార్చ్: పుట: 88)

అంటూ సిద్దెంకి యాదగిరిగారు వివిధ ప్రజా సంఘాలు, విద్యార్థులు, న్యాయవాదులు, జర్నలిస్టులు మొదలైనవారు శాంతియుత ర్యాలీగా రాజకీయాలకు అతీతంగా వస్తున్న వారి మీద వలసాంధ్ర పాలకవర్గం ఉద్యమాన్ని అణిచి వేయాలనే దురుద్దేశ్యంతో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారి మీద టియర్ గ్యాస్ ప్రయోగిస్తూ, విరిసిన విరగని లాఠీలతో కొడుతూ, రబ్బరు బుల్లెట్లతో కాల్చుతూ, గాయాలు చేసిన వెనుదిరుగని ఉద్యమకారుల సాహస గాధను కవి 'తెలంగాణ మార్చ్' అనే కవితా ఖండికలో చిత్రించారు.

"వెయిస్తంబాల గుడి కళా వెలుగులు
ఉస్మాన్ కట్టడాల చిత్రాలు
అసెంబ్లీ నిర్మాణ చాతుర్యమంతా
పనికిరానిదై పాడువడ గొట్టి
తెలంగాణ తిండి తినుకుంటా
ఆంధ్రా పాట పాడుతరు
అమరావతీ నగర శిల్పాలే అపురూపమనీ
సంకలు గుద్దుకొని వొంకలొంకలు దిరుగుతున్నోల్ల జూసి
తృప్తి పడుతున్నావా తల్లీ"

(మరుమన్న తల్లి: పుట: 101)

అంటూ సిద్దెంకి యాదగిరిగారు ఆంధ్ర పాలకులు తెలంగాణకు చేస్తున్నటువంటి ఆర్థిక, రాజకీయ, సామాజిక దోపిడిని గురించి వివరిస్తూ, తెలంగాణ కవులను పాఠ్యపుస్తకాలో ప్రస్తావించకుండా విస్మరించిన తీరును ఎదిరిస్తూ, ఇక్కడ ఉన్నటువంటి వెయ్యి స్తంభాల గుడి, ఓరుగల్లు తోరణ ద్వారం, అలనాటి శిల్పకళా రీతులకు నిలయమైన తెలంగాణ కళా స్వరూపాలను చరిత్రలో లిఖించకుండా కేవలం అమరావతి నగర శిల్పాలే అపురూపమని చెప్తుతూ, తెలంగాణ కళలను హేళన చేయడాన్ని నిరసిస్తూ రాసిన కవితా ఖండిక 'మరుమన్న తల్లి'గా పాఠకులు అర్థం చేసుకోవచ్చు.

"తిందామంటే తిండికి
కడుదామంటే బట్టకు
పొలం పారిద్దామనుకుంటే నీళ్ళకు
బాయికాడి సద్ది కుక్క తిన్నట్టు

ఖుద్దు తెలంగాణ బతుకు
కూడులేకుంటైంది
కరంటి యెలుగుల కయిత్కాలల్ల
బొగ్గుతవ్వి కరెంటు తయారు చేయవట్టిరి
తయారైన కరంటిని తలుగు తప్పదీసి తీసుకపోవట్టిరి"

(తెగించిన తెలంగాణ: పుట: 106)

అంటూ ఆర్థికపరంగా తెలంగాణకు సహజ వనరుల సంపద పుష్కలంగా ఉన్నాయి, ఖనిజ సంపదకు డోకాలేదు. తాండూరు, అదిలాబాద్, సింగరేణి, కొత్తగూడెం, ఖమ్మం ప్రాంతాలలో బొగ్గు గనులు విస్తారంగా ఉన్నప్పటికీ, ఇక్కడ తయారయ్యే విద్యుచ్ఛక్తిని ఇక్కడి ప్రజలకు అందించకుండా ఆంధ్ర ప్రాంతానికి తరలించుక్కపోతుంటే ఇక్కడ బావి మోటార్తోటి నీళ్లు పారిస్తూ వ్యవసాయం చేసే రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని సిద్దెంకి యాదగిరిగారు ఈ కవితా పంక్తుల ద్వారా అభివ్యక్తం చేశారు.

"ఆనకట్టలు కట్టి, ప్రాజెక్టు నిర్మించి
చెరిసగం నీళ్లు పారిచ్చుకుందామని
మసిపూసి మారెడు కాయజేసి
వొందురు ఒట్టిమాటనా ....? అని
తలాపున పారుతున్న గంగనీళ్లను తరలిస్తుంటే
తలుచుకుందామా... గెలుచుకోవద్దా"

(తెగించిన తెలంగాణ: పుట: 106)

అంటూ తెలంగాణ అనేక నదులకు ఆలవాలం. ఉత్తరాన గోదావరి, ప్రాణహిత నదులు పారుతుండగా దక్షిణాన కృష్ణా, తుంగభద్ర నదులుండగా ఆనకట్టలు కట్టి, ప్రాజెక్టులు నిర్మించి, నీళ్లను తెలంగాణ ఆంధ్రప్రాంతాలకు చెరిసగం పంచుకుందమంటూ మాయమాటలు చెప్పి, తెలంగాణ ప్రాంతానికి నదుల నీళ్ళలో వాటా ఇవ్వకుండా, నదుల నీళ్ళను మొత్తం ఆంధ్రప్రాంతానికి తరలించుకపోతుంటే చూస్తూ, ఊరుకుందామా? అంటూ ప్రశ్నిస్తూ తెలంగాణ ప్రజానికాన్ని మేల్కొలుపుతూ, వలసాంధ్ర పాలక వర్గం చేస్తున్న మోసాలను కవితలుగా మలిచారు.

"రాలిన వేల పానాల పానాదుల సాక్షిగా
అమరులు అల్లిన సర్వుగంప
పరువుతో నెత్తికెత్తుకొంది ప్రజాస్వామ్యం

ప్రజాకంటకం
దుర్మార్గపు ఏలుబడి దురంతం
దురాలోచన పేక మేడల్ని
కన్న తల్లుల కడుపుకోత శోక ప్రవాహం
పోరాట సునామి కెరటాలై
సమైక్యత ఇనుప సింహాసనాన్ని కూలదోసింది"

(గెలిచిన కల: పుట: 134)

60 ఏళ్ల సుదీర్ఘ పోరాట ప్రస్థానంలో తెలంగాణ ఉద్యమం ప్రత్యేక రాజకీయ ఉద్యమంగా అభివృద్ధి చెందింది. ఆర్థిక దోపిడీ, రాజకీయ పెత్తనానికి వ్యతిరేకంగా అనేక మంది మేధావులు పాల్గొన్న ప్రజాస్వామ్య ఉద్యమమే, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం. ఎందరో అమరవీరుల త్యాగ ఫలితంగా, సకల జనుల ఉమ్మడి పోరాటానికి దక్కిన బహుమానంగా 2 జూన్ 2014న భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది. అమరవీరుల ఆశయ సాధనలో అవినీతి రహిత భవిష్యత్తు, అసమానతలు లేని బహుజన ప్రజాస్వామ్య తెలంగాణను బహు చక్కగా నిర్మించుకోవాలని, కవి తన ఆశాభావాన్ని వ్యక్తం చేసిన కవితా ఖండిక 'గెలిచిన కల'గా భావించవచ్చు.

### 3. 4. ధ్వంసం అవుతున్న వృత్తి కళలు:

ప్రస్తుత ఆధునిక సమాజంలో ప్రపంచీకరణ అంశాలను చర్చించడం అనివార్యం. ఎందుకంటే ప్రపంచీకరణ ప్రభావం వల్ల మానవ మస్తిష్కంలోని ఆలోచనలు కూడా మార్పుకులోనై పోయినవంటే ఇంతకంటే ప్రమాదస్థితి ఏముంటుంది? సహజంగానే వర్ణం, వర్గం, కులం, ఉపకులం ఇలా ఎన్ని వ్యత్యాసాలు ఒక సమాజపు సాంస్కృతిక విలువలు ఆయా వృత్తి సాంప్రదాయం పైన, వృత్తుల జీవనశైలిపై ఆధారపడి కొనసాగుతాయి. ముఖ్యంగా మాదిగ ఆశ్రిత కులాలు వాటి ఉనికిని, అస్తిత్వాన్ని పూర్తిగా కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. వాళ్ళ జీవన స్థితిగతులు రోజురోజుకు దిగజారుతూ ఎంతో దుర్భరమైన స్థితికి చేరుకుంటున్నాయి. ఈ పరిస్థితిని కొంతమంది అభివృద్ధిలో భాగమని తీసేసినా అనేక విలువలకు, నైపుణ్యతకు మానవీయతకు ప్రతిరూపాలైన ఆశ్రిత కులాల సాహిత్య, సాంస్కృతిక జీవనస్థితి ఈ ప్రపంచీకరణ ప్రభావాల వల్ల ప్రమాద ఘంటికల్ని వినిపిస్తున్నాయి. (*తెలంగాణ సాహిత్యం – సమాలోచన*: పుట: 231)

ఏ విషయమైనా ప్రపంచవ్యాప్తంగావిస్తరించి తన ప్రభావం చూపితే దాన్ని ప్రపంచీకరణ అనడం ఒక వాడుక. ఆర్థిక రాజకీయ రంగాలలో ప్రపంచీకరణ అంటే అనేక అర్థాలు: ప్రపంచంలో ఒక మూల నించీ ఇంకోమూలకి సరుకులూ, వనరులూఎటువంటి ఆంక్షలూ లేకుండా తరలించడం. ఈ తరలింపు అంతర్జాతీయ వర్తకం రూపంలో, పెట్టుబడులఎగుమతుల రూపంలో, అనేక దేశాల్లో విస్తరించి ఉండే 'బహుళజాతి' సంస్థల రూపంలో జరుగుతుంది. (*రాజకీయ పదాల డిక్షనరీ*: పుట: 78)

సువిశాల భారతావనిలో పట్టణాలకు పట్టుకొమ్మలు పల్లెటూర్లు. ఆ పల్లెటూర్లో జీవనాధారం వ్యవసాయం. అదేవిధంగా గ్రామీణ జీవన వ్యవస్థలో ముఖ్యాతి ముఖ్యమైనవి కులవృత్తులు. మన దేశంలో వేల సంవత్సరాల నుండి కుల వృత్తులతోనే ప్రతి గ్రామం స్వావలంబనతో కొనసాగింది. భూమి ఉన్న వారు వ్యవసాయం చేస్తూ జీవించగా భూమి లేని వారు కుల వృత్తులపై ఆధారపడి ఎంతో మంది జీవనం కొనసాగిస్తున్న తరుణంలో ఆర్థిక సంస్కరణల పేరా ప్రభుత్వం చేపట్టిన 'ప్రపంచీకరణ' చట్టాల ఫలితంగా నేడు కుల వృత్తులనన్ని ధ్వంసమౌతున్నాయి.

ప్రస్తుతం గ్రామాలలోని కుల వృత్తులన్నీ మూలన పడటమే కాక, కొన్ని అంతరించిపోతున్నాయి. కనుమరుగవుతున్న వృత్తికళల గురించి ఈయన ఎంతలా కలత చెందుతున్నాడో ఈ క్రింది కవిత ద్వారా తెలుసుకోవచ్చు.

"కులాలకు మతాలకు లేని మనిషికుతి
పొగాకు సుట్టకు పంచుకుంటూ
ఆత్మగల్ల మాటల్తో
ఆకుతీగ పందిరోలె కల్సిపోదురు
కదిలే బొమ్మల పెట్టే
ఎప్పుడైతే ఇంట్లకొచ్చి కదలకుంట కూసుందో
గప్పట్నుంచే ఆట పాటల మీద
రంగురంగుల్తో దాడిజేస్తూ
మనసు పొరలను మాయం జేస్తుంది"

(జెండాకాడికి రాండ్రి: పుట: 41)

సకల కళల నిలయం, సబ్బండ జాతుల సమ్మేళనం పల్లెటూరు. సాధన సూరుల గారడి మాయల మరాటి విద్యలు, పల్లెలను జనులను అబ్బురపరుస్తు ఎంతో వినోదాన్ని పంచేవారు. అలాగే రాత్రి అయితే చాలు సింధు బాగోతం ఆటలు, పాటలు చూడడానికి, ప్రజలు ఎంతో ఉత్సాహంతో ఎదురు చూసేవారు. తీరొక్క దరువులో తీగరాగందీస్తూ, సుందరంగా నాట్యమాడుతూ ఉంటే చూడటానికి రెండు కళ్ళు సరిపోయేవి కాదంటారు ఈయన. కుల, మత భేదాలు మరచి పల్లె జనులంతా ఒకరి బాగోగులు మరొకరు అడిగిమరీ తెలుసుకుంటూ, ప్రేమగా పలకరించుకుంటూ జీవితాన్ని

గడిపేవారు. ఎప్పుడైతే గ్రామాలలోకి టీవీలు ప్రవేశించాయో, అప్పటినుండి జానపద ఆటలు, పాటలు కనుమరుగయ్యాయి. వీటితో పాటు క్రమంగా మనుషుల మధ్య బంధాలు, ఆత్మీయలు, అనుబంధాలు మాయమైపోతున్నాయని ఈయన ఆవేదనను వ్యక్తపరిచారు.

"మా పనితట్టకు కాట్లు వెట్టి
కూట్లె మన్నువోసి నోట్ల బుక్క ఎత్తగొట్టింది
కడల్గ నడిచే టీవికి
కిర్రు చెప్పుల కాందానా చప్పుడు
తెచ్చిన గొప్పదనమే గోతులు తవ్వింది
చీకటి పొగసూరి
పెట్టుబడి వరదను తట్టుకోలేక
పనితట్ట పత్తాలేకుంటయింది"

(చెంగోబిల్లా: పుట: 44)

అంటూ పూర్వకాలంలో బావులు తవ్వడానికి, మట్టిని మోయడానికి 'ఈత బరిగలతో' అల్లిన తట్టలను ఉపయోగించే వారు. ప్రస్తుతం ఫ్యాక్టరీలలో తయారైన ప్లాస్టిక్ తట్టలు రావడం వల్ల మేదరి వారు అల్లిన బుట్టలను ఎవరు కొనడం లేదు. దీని వల్ల తట్టలు, బుట్టలు మొదలైనవి వాటిని అల్లి వాటిని అమ్ముకుని జీవించే అనేకమంది ఉపాధిని కోల్పోయి, కనీసం వారు తినడానికి తిండి దొరకని స్థితిలో బ్రతుకుతున్న జీవనాన్ని ఈయన వర్ణించారు.

ఎన్నో గంటలు శ్రమపడి మగ్గాల ద్వారా పలురకాల అందమైన బట్టలను నేసినప్పటికీ, చేనేత యంత్రాల ద్వారా ఉత్పత్తిలో పోటీ ఉండడంతో కొనుగోలు జరగడం లేదు. దీనివల్ల ఆర్థిక ఇబ్బందుల్లో నలిగిపోతూ, అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్న చేనేత కార్మికుల ఆకలి బాధలను, అప్పులోళ్లు పెట్టే మానసిక వేదనను, వారు ఎదుర్కొంటున్న జీవన పోరాటాన్ని అద్దం పట్టే విధంగా కవి సుస్పష్టం చేస్తున్నారు. సుంచె కదలనిదే కంచం నిండని బతుకు, డోలునే దోస్తుగా భావిస్తూ, సట్టరే తన సుట్టంగా నరాలు ధారలుగా, చెమట నెత్తురును రంగులుగా అద్ది, జబ్బ బొక్కలు అరుగుతున్నా తన కండలను కరిగించి, అగ్గిపెట్టెలో ఇమిడే చీరనేసిన ఘనత చేనేతన్నది. నేతన్నల బతుకు తాలూకు బాధలను కవి ఇలా వివరించారు.

"ఒక్కొక్క దారం ఆధారమయి
యిజ్జత్ కాపాడే నేతకళ

పాలకులకు పట్టని వ్యవహారమై
పాడే మీద ఊరేగుతుంది
మగ్గమేసే నేత జీవితం దినదినము మగ్గిపోతూ
అప్పుల్తో బుగ్గిపాలయితంది
కడుపునింపని పనితనం మాడుపు మొకమేసి
వడికిన తక్లీదారం ఉరితాడై మెడచుట్టు బిగుసుకుంటుంది"

(నేత: పుట: 46)

గ్రామీణ కుటీర పరిశ్రమగా స్వయం సాధికారతను కలిగినటువంటిది చేనేత పరిశ్రమ. చేతి మగ్గాల స్థానంలో మరమగ్గాలు రావటంతో చేనేత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న చేనేత కార్మికుల బ్రతుకులు అతలాకుతలం అయ్యాయి. నేటికి ప్రపంచీకరణ నేపథ్యంలో  పెట్టుబడి అనేది చేనేత కార్మికులను వెంటాడుతూనే ఉంది. అప్పులు చేసి నూలుకొని వస్త్రాలు నేసినప్పటికీ మరమగ్గాల వల్ల రేడిమేడ్ ఫ్యాన్సీ దుస్తులు తయారవ్వగా నేసిన వస్త్రాలను మార్కెట్లో కొనుగోలు చేసే వారు లేక చేనేత కార్మికులకు కనీసం పెట్టుబడి డబ్బులు కూడా రాకపోవడంతో అప్పుల్లో కూరుకపోయి అలమటించడమే కాకుండా, దీనికి తోడు అనారోగ్యబారినపడి సతమతమవుతూ, కనీసం చికిత్స చేయించుకునే స్తోమతలేక మానసిక, శారీరక వేదనను అనుభవిస్తూ, అనేకమంది నేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న తీరును, వారు ఎదుర్కొంటున్న అనేక జీవన సమస్యలను, వారి జీవితాల సామాజిక వాస్తవికతను ఈ కవితా ఖండిక అద్దం పడుతుంది.

సచ్చిన పశువుల చర్మాన్ని ఎంతో ఓర్పుతో, నేర్పుతో ఒలిచి దాన్ని 'లందగోళం' నీళ్లలో నానబెట్టిన తర్వాత ఆ చర్మాన్ని మెత్తని పాదాలకు ఏ ముండ్లు, రాళ్ళుగుచ్చనీయకుండా, వివిధ ఆకారాల్లో అందమైన ఆకృతుల్లో కిర్రు జోళ్ళ చెప్పులను తయారు చేసే కళ నైపుణ్యం కలవారు చర్మకారులు. ప్రస్తుతం వీరు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గురించి సిద్దెంకి యాదగిరిగారు ఇలా తెలియజేశారు.

"మిగ్గుపెట్టి ముడిసే అతారెలు
సాంచెల శానితనమ్ముందట
సిగ్గు ఒదిలి తలదించుకుంటున్నై
బువ్వ పెట్టాలని అతారెలు
అడ్డామీది మోరిపక్కకు
ఉంగుటం ముక్వారు మొలలతో
పాలిష్ వేయాలని ఆరాటపడుతూ
చెత్తిరి కింద మునిలా తపస్సు చేస్తున్నై"            (జెల్లికం జెం: పుట: 59)

అంటూ చర్మకార వృత్తిని నమ్ముకొని బతుకుతున్న వారి జీవితాలను అతలాకుతలం చేసింది 'ప్రపంచీకరణ'. దీని ప్రభావంతో బాటా, పూమా మొదలైనటువంటి పెద్దపెద్ద కంపెనీలు పుట్టుకొచ్చి చర్మకార వృత్తిని కనుమరుగు అయ్యేలా చేశాయి. చర్మకార వృత్తినే జీవనోపాధిగా చేసుకుని బ్రతుకెళ్లదీస్తున్న అనేక కుటుంబాలను రోడ్డు పాలు చేసింది. వారి శ్రమకు సరైన విలువ లేక పట్టణాలలో ఎక్కడో ఒక మూలన చెట్టు కిందో, మురికి కాలువ పక్కన పాలిష్ చేస్తూ, పూటగడుపుకోవాల్సిన దీనస్థితికి దిగజార్చిన పరిస్థితులను సిద్దెంకి యాదగిరిగారు పాఠకుల హృదయం ద్రవించేలా కవిత్వీకరించారు.

పూర్వం రోజుల్లో ప్రతి గ్రామంలో ఒక కార్యక్రమాన్ని కావచ్చు, లేదా ఏదైనా విషయాన్ని జనులందరికీ చేరవేయడంలో డప్పు చాటింపు కీలక పాత్రను పోషించేది. డప్పు వాయిద్యాన్ని ఎక్కువగా జాతర్ల, ఉత్సవాల సందర్భాలలోనూ, ఊరేగింపులు మొదలైన అనేక కార్యక్రమాలకు ఉపయోగిస్తారు. తీరొక్క దరువుల తీరు తీరు ధ్వనులతో ప్రేక్షకుల హృదయాల్ని ఉత్తేజపరిచే స్వభావం కలది డప్పువాద్యం. నేడు ధ్వంసమవుతున్న డప్పు కళను గురించి సిద్దెంకిగారు ఇలా వివరించారు.

"మంచికి చెడుకి
నిలువెల్ల లొల్లిపెడుతూ లడాయిజేసే దప్పు
ఊటబాయి పెయి శమటజల్లులు
దెబ్బ దెబ్బకు తీరొక్క తరీక కురిసేది
కంటిరెప్పలతో తిప్పలపడితీసినపుడు
సూదిలా గుచ్చుకునే రూపాయిలోటు
చింతలేదని అంతా మంచిదే అనుకుంటుంటే
మా పని తనానికి కాని ముల్లు యిరిగి కతమైంది.
మర్నాగి గ్లోబలైజేషన్ నీడ
కాషియో బ్యాండ్ మేల తాళాలతోటి
ఏగే దప్పు జీవునమ్మీద ఎనగర్రకూలినట్లై"

(జెల్లికం జెం: పుట: 59)

గ్రామాలలో పెండ్లిలు, పండగలు, ఏ శుభకార్యాలు జరిగినా, అశుభకార్యం అయినా డప్పు దరువు లేనిదే ఏ పని చేసేవారు కాదు. జాతరలు, ఉత్సవాలు, ఊరేగింపులల్లో డప్పు చప్పుళ్ళు లేకుంటే

ముందుకు నడిచే వారు కాదు. నేల మీద ఒక డప్పును బోర్లించి దానిపైన చిల్లర డబ్బులను ఉంచుతారు. వాయిద్య కారుడు మరొక డబ్బుతో వాయిస్తే ఆ డప్పు శబ్దంచేసే ప్రతిధ్వనికి డప్పు మీద ఉన్న డబ్బులన్నీ

నేల మీద పడిపోతాయి. అదేవిధంగా నేలపై కరెన్సీ నోట్లను వేసి లయ తప్పకుండా డప్పును వాయిస్తూ నేలపై ఉంచిన కరెన్సీ నోట్లను చేతితో తాకకుండా కంటి రెప్పలతో అందుకుంటూ ప్రజలకు ఎంతో వినోదాన్ని పంచుతూ, వారి కళను ప్రాణంగా నమ్ముకుని జీవిస్తున్న తరుణంలో ప్రపంచీకరణలో భాగంగా వచ్చిన ఆధునిక కాషియో, బ్యాండ్ మేళాలు, DJ మేళాల వలన డప్పు వాయించే వృత్తి కళాకారులు తమ జీవనోపాధిని కోల్పోయి, అనేక కుటుంబాలు రోడ్డునపడ్డాయి. కుటుంబ పోషణలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు, కొందరు  దినసరి కూలీలుగాను, ఇంకొందరు ధనవంతుల ఇళ్ళ ముందు, ప్రవేటూ పరిశ్రమల దగ్గర సెక్యూరిటిగార్డుగా చాలి చాలని వేతనాలకు పనిచేస్తూ, అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. నాడు అందరినీ అబ్బురపరిచిన డప్పు వాయిద్యకారులు బిక్కుబిక్కుమంటూ జీవనం గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. దయనీయంగా బ్రతుకు వెళ్లదీస్తున్న వాయిద్య వృత్తికళాకారుల జీవన దృశ్యాన్ని కవి పాఠకుల మనస్సును కదిలించేలా కవిత్వీకరించారు.

### 3. 5. దళిత జీవన సమస్యలు:

వేల సంవత్సరాల చరిత్రలో భారతదేశంలో అక్కడక్కడ వ్యాపించిన దురాచారాలు తెలంగాణలోనూ కనిపించాయి. వాటిలో అస్పృశ్యత దురాచారం ఒకటి. కొందరు మేమే గొప్ప అనుకుని మరికొందరిని తక్కువ చూడటం వల్ల ఈ దురాచారం వ్యాపించింది. సంస్కర్తలూ, దార్శనికులూ అయిన ఆదిశంకరులు, రామానుజులు, బ్రహ్మనాయుడు, సంత్ జ్ఞానేవ్, శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద తదితరులెందరో అందరినీ సమానంగా చూడాలని ప్రబోధించారు.(*తెలంగాణ సాహిత్యం – సమాలోచనం*: పుట: 13)

### 3. 5 .1. కులం పుట్టుక:

ప్రపంచ దేశాలలో వర్గం మాత్రమే ఉంది. భారత దేశంలో మాత్రం వర్గంతో పాటు వర్ణం కూడా అదనంగా ఉంది. అక్కడ పేద – ధనిక, నలుపు –తెలుపు, యజమాని – బానిస ఇలా విభజింపబడి ఉంటే భారత దేశంలో కూడా ఉన్నవాడు – లేనివాడు, పెట్టి–భూస్వామినల్లగా ఉండటం – ఎర్రగా ఉండటం ఉంటూనే వీటన్నింటితో పాటు కులంఅనేది కూడా భారత ప్రజలను వేధిస్తుంది. ఈ కులం ఎలా ఏర్పడింది అనిప్రశ్నించుకుంటే ఆర్యులు మనదేశానికి రాకముందు వరకు ఈ వర్గాలు, కులాలు లేవు. వేదాలను ప్రామాణిక గ్రంథాలుగా భావిస్తూ సంస్కృత భాషలో మాట్లాడుతూ ఇంద్రుని వంటి దేవతలను పూజిస్తూ జీవించిన ఒక సంపుప్రజలు తాము ఆర్యులమని చెప్పుకున్నారు. సంస్కృత సాహిత్యంలో దాన్నించిపుట్టిన ఇతర భాషల సాహిత్యాల్లో ఈ పదం పదే పదే దర్శనమిస్తుంది.కొంతకాలానికి ఈ పదానికి పెద్దమనిషి, ఉన్నత వంశసంజాతుడు, బానిస కాని స్వేచ్ఛజీవి అనే అర్థాలు ఏర్పడ్డాయి.

భారతదేశంలో సింధులోయ నగరాలను నాశనం చేసిన ఆర్యులు క్రీస్తుపూర్వం రెండో సహస్రాబ్దం చివర్లో ఇక్కడకు వచ్చారు. వీరికి పశుపాలకులు అనే పేరు ఉంది. (*భారత దేశ చరిత్ర–పరిచయ వ్యాసాలు*: పుట: 30)

### 3. 5. 1. 1. దళిత పదానికి నిఘంటువులలో ఉన్న అర్థాలు;

1) *"శబ్దరత్నాకరం"లో దళిత అంటే ఖండింపబడినది, భేదింపబడినది, వికసించినది అనే అర్థాలను ఇచ్చారు.*(*శబ్దరత్నాకరం*: పుట: 458)

2) *జి.ఎన్. రెడ్డి గారు రాసిన పర్యాయపద నిఘంటువులో దళిత అనే పదానికి అంటరానివాడు, అనంతవాసి, అంత్యజాతివాడు, అంత్యయోని, అవాచ్యుడు, అస్పృశ్యుడు, కడవాడు అనే అర్థాలు ఉన్నాయి* (*తెలుగు పర్యాయపద నిఘంటువు*: పుట: 112)

3*) పి. వి. కె ప్రసాదరావు రాసిన తెలుగు నిఘంటువులో దళిత అనే పదానికి వికసించినది, ఖండించబడినది, చేదించబడినది అనే అర్థాలు ఉన్నాయి.* (*తెలుగు–తెలుగు నిఘంటువు*: పుట: 335)

4) *కేతు విశ్వనాథ రెడ్డి గారు రాసిన వాడుకభాష పదకోశంలో దళిత అనే పదానికి అణిచివేతకుగురైన, పీడనకు గురైన అనే అర్థాలను ఇచ్చారు.* (*వాడుక భాష పదకోశం*: పుట: 156)

దళిత పదంను గురించి మన తెలుగు నిఘంటువు కర్తలు వారి వారి నిఘంటువులలో పైన పేర్కొన్న విదంగా అర్దాలు తెలిపారు.

### 3. 5. 1. 2. దళిత నిర్వచనాలు:

దళితులంటే ఆర్థికంగా,రాజకీయంగా,సామాజికంగా, మానసికంగా వెనుకబడినవారు అనేది ఒక వాదన. *"తరతరాలుగా అస్పృశ్యతకు లోనయి మతం పేరిట సాంస్కృతికంగా హీనంగా చూడబడి విద్యా సౌకర్యాలు కరువై సమాజంలో కూడా ప్రధాన జీవన స్రవంతికి దూరమై ఆర్థికమైన అంచివేతకు శ్రమ దోపిడికి గురి అయిన వాళ్ళు దళితులు"* (*ఆధునిక సాహిత్యం–దళిత స్పృహ*: పుట: 12)

*"సాంఘికదోపిడికిగురవుతున్నవారు అస్పృశ్యులుగా పరిగణింపబడుతున్నవారు, నీచవృత్తులుగా భావింపబడుతున్న వృత్తులు చేస్తున్నవారు, శారీరక శ్రమపై మాత్రమే ఆధారపడి బతుకు గడుపుతున్నవారు దళితులు అంటారు మస్నీ సత్యనారాయణ. లక్ష్మీ నరసయ్య గారువిస్పృతార్థంలో SC, ST, BC మైనారిటీలు అందరూ దంతులే అంటారు. భారతావనిలో సాంఘికంగా ఆర్థికంగా అణగద్రొక్కబడిన వారంత దళితులే. ప్రధానంగా మస్సీలు యస్.టిలు, బి.సిలు ఈ కోవలోకి వస్తారు. మైనారిటీలు హిందుయేతర మతాల్లో ఉన్నారు కనుక మైనారిటీలు ఈ కోవలోకి*

*వస్తారు. స్త్రీలు ఏ వర్ణంలో ఉన్న ఏకులంలో ఉన్న అణగద్రొక్కబడుతున్నారు. కనుక వీరు కూడా ఈ కోవలోకి వస్తారు. దీనిని బట్టి దళితులంటే SC, ST, BC, మైనార్టీ స్త్రీలు అనే స్పష్టమౌతుంది".* (దళిత వాదం–జాషువా: పుట: 12)

పై నిర్వచనాలను నిశితంగా గమనించినట్లయితే భారతదేశంలో వివిధ మతాలతో పాటు, విభిన్న కులాల వారు ఉన్నారు. దేశ జనాభాలో ఉన్న వివిధ కులాల వారిలో కొన్ని ఉన్నత కులాలనీ మరికొన్ని అంటరాని కులాలనీ సంకుచితదృష్టితో కులాల ఏర్పాటు జరిగింది. రాజకీయ, సామాజిక, హైందవ వర్ణవ్యవస్థ, నియంతృత్వంఫలితంగా కింది కులాలవారు కొందరు సంఘంలో అస్పృశ్యులుగానూ, కడ జాతివారిగానూ పిలువబడ్డారు. వీరికి సమాజంలో సముచిత గౌరవ స్థానాలు గానీ, సంఘంలో అభివృద్ధిచెందే అవకాశాలు కానీ లేవు. ఆర్థికంగా నిలదొక్కుకునే వనరులు, వసతులు వీళ్ళకు లేవు. అదేవిధంగా తాత ముత్తాతలు సంపాదించిన స్థిర, చర ఆస్తులంటూ ఏమీ లేకపోవడం వలన శరీర కష్టాన్ని నమ్ముకొని, కులవృత్తులు చేసుకుంటూ, విద్యకూ, నాగరిక జీవనానికి దూరంగా ఊరి వెలుపలకు నెట్టివేయబడి, దుర్మార్గపు కులం కట్టుబాట్లలో నలిగిపోతూ ఉంటారు. వీరిపై అంటరానివారనే ముద్రవేసి, నానారకాల నీచమైన ఆంక్షలు విధించి వీరిని తరతరాలుగా సంఘం నుండి బహిష్కరించారు అనే విషయం స్పష్టమవుతుంది.

"మా బతుకుల చీకటి నింపిన
కర్మ మొలదారం తెగ
లేనిది పుట్టించినోడు లేకుంటపోను
నిందెలు మోపినోడు బొంద మొయ్య
అంటరానితనం అంటగట్టినోని తీగె
గుంటుకు లేకుంట గాను
వల వల నవిసిన పశువులను
నెత్తురు సీముతో సచ్చిన గోదలమోత
తాళ్లుపేనిన చెప్పులు ముడ్చినా
యాతం బోసి మోట గొట్టిన చేతులు
ధూడ్తుమని దూరముంచితే
బతుకే దుమాల్లం అనుకున్నంగని దుమ్మెత్తిపొయ్యలే"

(కుల గర్వం: పుట: 49)

అంటూ నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో దళితులను అంటరానివారుగా చూస్తూ, అవహేళన చేస్తూ, యుగయుగాలుగా వారి శ్రమను దోచుకుంటూ, వారిని బానిసలుగా మార్చిన సందర్భాన్ని తెలుపుతున్న దృశ్యాన్ని ఈ కవితా పంక్తుల ద్వారా తెలుసుకోవచ్చు.

"పునాదులు – గోపురాలు కట్టినం
పూజలు చేయనివ్వని పంచాంగం పగ
తంతెల నాటి నుంచి గుడితంతెలు ఎక్కలే
గుండంల మునుగనియ్యని గండం
గురుతుపెట్టుకొని గురుతు పెట్టాలే"

(కుల గర్వం: పుట: 50)

పునాదులు తవ్వేటప్పుడు కానీ, ఎంతో శ్రమకోర్చి గుడి, గోపురాలను నిర్మించేటప్పుడు లేని అంటూ, ముట్టు, దేవుని పూజ దగ్గరకు వచ్చేసరికి మనుషుల మధ్య తేడాలు చూపుతూ, ఎన్నో ఆంక్షలు విధిస్తూ, దళితుల శ్రమను ఆధిపత్య కులాల వారు దోపిడి చేయడాన్ని, తరతరాలుగా అణచివేతకు గురిచేయడాన్ని మానని బాధల గాయంగా సిద్దెంకి యాదగిరిగారు పేర్కొన్నారు.

"ధర్మం ముసుగుల అధర్మం
కర్మపేరుతో నియంత్రణ కట్టడి
తరతరాల జాతి ప్రగతి క్రూరంగా అణిచిన
పద్ధతులతో హద్దులు గీసిన మనువు
వాని చాంధస వాదం
మమ్ముల మా జాతిని వొంగదోలింది
ఉమ్మి ముంత ముక్కు కొక్కెం
అడుగుల్ని మలిపే ఆకులు కట్టించి
పుట్టు వన్నెలు మాయం జేసినోళ్లు
అక్రమ పెట్టు వన్నెలు అద్దింద్రు
యిప్పటికీ కుల వివక్ష వెంటాడుతూంటే
తల కాటెక్కుతూన్న బాధ కన్నీల్ల బాధ
కత్తులు అయి కోస్తుంది మనసును"

(చదువుతున్నం: పుట: 51)

అని సిద్దెంకి యాదగిరిగారు ఆధిపత్య కులం వారు ధర్మం పేరు చెబుతూ, కొన్ని జాతులను వేల సంవత్సరాలుగా అణచివేతకు గురిచేస్తూ, అధర్మానికి పాల్పడటమే కాకుండా, పీడిత వర్గాల ప్రజలను అంటరాని వారిగా పుట్టడానికి గల కారణం వారు పూర్వ జన్మలో చేసిన పాప ఫలితమేనని నమ్మపలికిస్తూ, మూతికి ముంతను,నడుముకు తాటాకు కట్టి అవహేళన చేస్తూ, అస్పృశ్యులుగా ముద్రవేసిన ఈ సంఘంలో ఇప్పటికీ, కొన్ని జాతులు తీవ్రమైన వివక్షకు గురవుతూ, మానసికంగా నలిగిపోతూ, కుమిలిపోతున్నారు అంటూ ఈయన బడుగు జనుల బాధలను కవిత్వీకరించారు.

"అక్షరాలు దిద్దితే కోయబడ్డ వేళ్ళు
ఉచ్చరించినందుకు చీల్చిన నాలుక
వింటున్న చెవుల్లో సలసల కాగుతున్న సీసం
అందుకే మా కలాలెపుడు అస్థిత్వాల అస్థిరతవైపు
నుంచి నిలదీస్తయి"

(చదువుతున్నం: పుట: 51)

పూర్వం అక్షరాలు దిద్దితే చేతులను నరికి, శాస్త్రాలను చదివితే నాలుక తెగ్గోసి, వేదాలు వింటే సలసల మరిగే సీసాన్ని కరిగించి చెవుల్లో పోసిన చరిత్ర దుర్మార్గాన్ని ఎదిరిస్తూ, సాంఘిక కుల కట్టుబాట్లను తెంచుకుని ఆచార సాంప్రదాయ ముసుగులో జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించడానికి తమ ఉనికిని, అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి, గౌతమ బుద్ధుడు చూపిన దారిలో నడుస్తూ మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన సంఘ సంస్కరణ ఉద్యమాలను ఆసరాగా తీసుకుని, అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఉద్యమిస్తూ, వక్రీకరించిన చరిత్రను తిరగరాయడానికి, బహుజనులు రాజ్యాధికార దిశగా ప్రతీ ఒక్కరు అడుగులు వేయాలంటూ, సందేశమిచ్చిన కవితా ఖండిక 'చదువుతున్నం'.

"ఉద్యోగాలు చేస్తూ అద్దె గదులకై ఆరాతీస్తుంటే
నాల్గుతలల నాగరాజు ఇంకా బుసకొడుతున్నడు
కుల వివక్ష విస్తరిస్తూనే వుంది తండ్రీ
ఆవేశం ఆగ్రహం రెండంచుల తల్వారై
కసితీర ప్రతీకారం తీర్చుకుంటుంటే
రాత్రికి రాత్రే బతుకులు చితికిపోతున్నాయి
కారంచేడు, చుండూరు, పదిరికుప్పం, వేంపేట, లక్ష్మింపేటలు
చారిత్రక నెత్తుటి ప్రవాహాలై
కుతికెల్ని హలాల్ జేస్తూనే వున్నాయి"

(విశ్వమానవ విపంచి: పుట: 55)

అంటూ సిద్దెంకి యాదగిరిగారు భారత దేశానికి స్వతంత్రం వచ్చి ఏడు పదులు దాటుతున్నాపటికీ దేశంలో ఏదో ఒక మూలన దళితుల మీద దాడులు జరుగుతూనే ఉన్నాయి. యుగ యుగాల నుండి నేటి వరకు నీడలా వెంటాడుతూనే ఉంది. అణిచివేత వివక్షత రూపాలు మారినప్పటికీ, దాని స్వభావం మాత్రం తీవ్ర మనోవేదనకు గురి చేస్తూనే ఉంది. అవమానవీయమైన ఈ వివక్షతను ప్రశ్నించినందుకు కారంచేడు, చుండూరు, పదిరికుప్పం, వేంపెట, లక్ష్మింపేట పేద ప్రజల ప్రాణాలను పొట్టనబెట్టుకున్న ఆధిపత్య అహంకార ధోరణిని నిరసిస్తూ, ఈయన బడుగు బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయాలను, వారి మీద జరుగుతున్న దాడులను గురించి అత్యంత కరుణ రసాత్మకంగా చిత్రించారు.

## 3. 6. రాజకీయ అంశాలు:

నేటి సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తున్న అంశాలలో రాజకీయాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. అది పురోగతిలోనైనా, తారోగతిలోనైనా. ఒక దేశం పురోభివృద్ధిలో ఉండడానికి, అదే దేశం సంక్షేమంలో ఉండడానికి ప్రధాన కారణం రాజకీయాలు, రాజకీయ నాయకులు.

ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకులు కొంతమంది, తాము శాసన కర్తలం కాబట్టి ఏం చేసినా చెల్లుబాటు అవుతుందని భావించి, ప్రభుత్వ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న కార్యనిర్వాహక శాఖ విస్మరించడమే కాకుండా, వారు పొందాల్సిన హక్కులను కూడా వారి నుండి దూరం చేస్తున్నారు.

అంతేకాకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసమే పోరాడుతున్నామని చెప్పి ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఆ మాటనే మరిచారు మన ప్రజా నాయకులు, వీటితో పాటు తెలంగాణ కోసం పోరాడుతున్న వారిపై తుపాకీ గుళ్ళ వర్షం కురిపించారు. ఇలాంటి ఎన్నో అవమానాలను, మోసాలను తన కళ్ళరా చూసి వాటిని ఎదిరించాలంటే వాటిని కళ్ళకు కట్టినట్టుగా చూపించాలంటే, ప్రజల్లో చైతన్యం తీసుకురావాలంటే, మనకు ఉన్న ఒకే ఒక ఆయుధం కలం, గళం అని నమ్మిన సిద్దెంకి యాదగిరిగారు వీరు తన "*బతుకు పాఠం*" అనే కవితా సంపుటిలో తెలంగాణ ప్రజలు పడిన అవమానాలను, బాధలను, ఆవేశాన్ని, వారు ఏవిధంగా మోసపోతున్నారనే విషయాన్ని 'బాడుగ అక్షరాలు', 'సమ్మెపోటు', 'ఇంటి దొంగలు', 'తెగారం', 'అవినీతి రహిత ఉషోదయానికి', 'మా కోసం వస్తున్నావా' వంటి కవితా ఖండికల ద్వారా తెలిపి తెలంగాణ ప్రజల హృదయాన్ని ఆవిష్కరించడమే కాకుండా, వారిలో ఉద్యమ చైత్యనాన్ని రగిలించారు.

ఉద్యమాలకు ప్రాణం పోసిన అక్షరాలను నాయకుల మెప్పు కోసం అంగట్లో బొమ్మలను అమ్ముకున్నట్లుగా అక్షరాలను అమ్ముకుంటున్నారని సిద్దెంకి యాదగిరిగారు రాసిన కవితా ఖండికే 'బాడుగ అక్షరాలు' ఈ కవితా ఖండికలో ప్రజా ఉద్యమాన్ని నాయకులని 'బాడుగ' నేతలంటూ వక్రీకరించి రాసిన పత్రికలు, ఒక పార్టీ నుండి మరొక పార్టీ మారిన నాయకులను బాడుగ నేతలని, ప్రజా ద్రోహులని రాయడానికి అక్షరాలకు బలముందా? అంటూ నిలదీశాడు.

"ఉద్యమాకు ఉప్పందించే
గొంతుకలు మూగవోయినపుడు
నినాదపు నిప్పు రాజేసే అచ్చరాలు
ఇయ్యాల్ల ఆగమైతన్నయ్
మూఢ నమ్మకాల ముసుగులోపుల్కాషితనం మునిగిపోతున్నపుడు
తల్కాయెల్ని మేలుకొలిపే
కోడికూత అచ్చరాలు
వాడిపోతన్నయ్
ఓట్ల ముందు సెప్పిన మాటలతో
గద్దెనెక్కి తూట్లు పొడిచే నాయకులు
యెన్నుపోటు పొడిసిన రాజకీయ రాగంతో
బోగమైనోల్ల మూతులు నాకుతున్న అచ్చరాలు
నియ్యతిని పాతరపెట్టి బేనియ్యతిని ఊదరగొడ్తయ్"

(బాడుగ అచ్చరాలు: పుట: 63)

అంటూ స్వార్థ పూరిత రాజకీయ నాయకులను, ప్రజా ఉద్యమ నాయకులను బాడుగ నేతలు అంటూ రాసిన వారిని తీవ్ర స్వరంతో బదులిచ్చిన కవితా ఖండిక 'బాడుగ అచ్చరాలు'.

ఎన్నికల ముందు రాజకీయ నాయకులు తాము అధికారంలోకి రావడానికి ఎన్నో వాగ్దానాలు చేస్తారు. వారు విశ్వసనీయత ఉన్న నాయకులని విశ్వసించి అధికారం అప్పచెప్పితే అధికారంలోకి వచ్చిన తర్వాత వారి వాగ్దానాలను వాగులోనో, వంకలోనో కలిపేస్తారు. ఇటువంటి సమస్యనే ప్రధాన కవితా శీర్షికగా 'సమ్మెపోటు' అనే కవితా ఖండికను రాశారు.

ఈ కవితా ఖండికలో సిద్దెంకి యాదగిరిగారు అప్పటి ముఖ్యమంత్రి తన రాజకీయ లబ్దికోసం ఉపాధ్యాయులకు చాలా హామిలిచ్చి నెరవేర్చకపోవడంతో ఉపాధ్యాయుల ఆవేదనను, వారి ఆక్రోశంతో పాటు వారి సమాధానాన్ని కూడా తన సిరా చుక్కతో అక్షరీకరించారు.

"ఒకటా... రేండా... నాలుగున్నర ఏండ్లల్ల
సమ్మెబాట పట్టినా సమాధానం లేకపాయే
మెత్తమనసు గురువులు
ఉత్తవాల్లని అంచనా వేయకు

చిత్తుకాయితాలుగ మలసి చెత్తబుట్టలోయేసి
పత్తాలేకుంట జేస్తే సత్తా మాకుంది
ఎఱ్రగీత పెట్టి అడ్మీషన్ రిజిష్టర్ల పేరుతీసినట్లు
ఓట్లతో కొత్త సర్కార్ షేరీక్ చేసకుంటం
ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే
బుద్ధితో దేశాధినేతవైనా,ముఖ్యమంత్రివైనా
నీ గురువుకు నీవు శిష్యుడివే"

(సమ్మెపోటు: పుట: 66)

అంటూ అప్పటి ముఖ్యమంత్రికి తాను ఆ పదవిని ఎలా పొందాడో? తెలుపుతూనే విద్యా బుద్ధులు నేర్పిన గురువులను మర్చిపోకు, అంతేకాకుండా మేము తలుచుకుంటే ప్రభుత్వాలనే మార్చగలమని కాబట్టి మరోసారి పునఃసమీక్షించుకోవలంటూ సిద్దెంకి యాదగిరిగారు ఉపాధ్యాయుల ఆవేదనను, తెలుపుతూనే హెచ్చరిస్తున్నారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ధ్యేయంగా ప్రజలందరూ ఉద్యమబాటపట్టి ప్రభుత్వాన్ని ధిక్కరిస్తుంటే, ప్రజల చేత ఎన్నుకోబడిన నేతలు ప్రజల ముందు ఉద్యమానికి 'జై' కొడుతూ అధిష్టానం ఇచ్చే పదవులకు, అధికారులకు, ధనానికి అమ్ముడుపోయి వారి ముందు ప్రత్యేక రాష్ట్ర ప్రస్తావన చేయడం లేదు. మన ఇంటి వారే మనకు ద్రోహం చేస్తున్నారని చెప్తూ, 'ఇంటి దొంగలను ఈశ్వరుడైనా పట్టుకోలేడనే' సామెత గుర్తుకొచ్చేలా 'ఇంటి దొంగలు' అనే శీర్షికతో ఈ కవితా ఖండికను రాశారు.

"అనుమానం కలిగితే తకాయించి అడగవచ్చు
అబద్దమాడితే గుద్ది బుద్ధి చెప్పొచ్చు
అవుతలి దొంగయితే అరికెలు పట్టొచ్చు
యింట్లోల్లు వొాయి దొంగల్ల గల్సిరి"

(ఇంటి దొంగలు: పుట: 67)

అనే ఈ కవితా పంక్తులలో నిజాయితీని ముసుగులుగా కప్పుకున్న రాజకీయ నాయకులను వారిపై అనుమానం కలిగితే అడగవచ్చు, వారు చెబుతున్నది అబద్ధం అని తెలిస్తే వారికి బుద్ధి చెప్పొచ్చు, దొంగలు అయితే పట్టుకోవచ్చు కానీ, వారు నమ్మించి మోసం చేస్తున్న మన ఇంటి దొంగలు వాళ్ళను ఎలా పట్టుకోవడమంటూ సిద్దెంకి యాదగిరిగారు తన ఆవేదనను వ్యక్తం చేశారు.

"ప్రజలు ముందు "జై"
పార్టీల ముందు "నై" అంటూ

కందికట్టెకు కనరుండది
పందికొక్కులోలె బల్సిన నాయకులకు
ప్రజలు తిరుగుబాటు ఝుండాలైనపుడు
ఓట్లకు నెనరూ ఉండది
రాజకీయానికి ఆ కనరూ ఉండది"

(ఇంటి దొంగలు: పుట: 68)

అనే పంక్తులలో రాజకీయ నాయకులు ప్రజల ముందు తెలంగాణ ఉద్యమానికి 'జై' అని పలికి అధిష్టానం ముందు 'నై' అంటున్నారని పందికొక్కులా బల్సిన నాయకులకు ప్రజల ఉద్యమఝూడాలే, వారి ఓట్లే కనరును దించి నెనరును తెప్పిస్తుందని పరుష పదజాలంతో రాజకీయ నాయకులకు బుద్ధి వచ్చేలా కవితలను రాశారు.

భారత రాజకీయ వ్యవస్థలో ప్రధాన అంగం న్యాయ వ్యవస్థ. ఆ వ్యవస్థలో భాగమైన న్యాయవాదులకు రక్షణ లేదంటూ, తెలంగాణ వేర్పాటును ఇష్టపడక ఉద్యమకారులను తుపాకీ గుండ్లకు బలి చేస్తున్నారంటూ కవి తన తెగింపును తన కవిత్వంతో చూపిన కవితా ఖండిక 'తెగారం'.

"నినదిస్తున్న నల్లకోటు న్యాయాన్ని
గల్లపట్టి కొడుతుంటే
నడిరోడ్డు తెల్లబోయింది
నెత్తురు అలుకు పూత చల్లినా
ఉసిగొలిపినోడు ఉట్టిదంటడు"

(తెగారం: పుట: 80)

అనే పంక్తులలో ఉద్యమాన్ని నిందిస్తున్న న్యాయవాదులను నడిరోడ్డు మీద గల్లపట్టి కొడుతుంటే రోడ్డంతా రక్తపు పూత పులుముకున్నా అది ఉట్టిదంటున్నారని.

"తెలంగాణ పరిశ్రమల బొందల తోసి
ఆంధ్రా పరిశ్రమల బాగు కోసం
పరిపాలన బండకు "నార" చీరిన బాపతిగాడు
తల్కాయెల్ని ఆలోచించకుంట
ఆలోచించే తల్కాయెల్ని
ఎన్ కౌంటర్ల పేరుతో సంపినోడాయే
నిజాలను నిలపెట్టి కాల్చినోడాయే
వకీల్ల నినాదాలు విని వొట్టి గెట్లూకుంటడు
రెండు ప్రాంతాలు రెండు కండ్లని
ప్రకటించే మిడిగుడ్లకు
మింగుడు పడందే తెలంగాణ" (తెగారం: పుట: 81)

అనే పంక్తులలో తెలంగాణ ప్రాంతాన్ని నాటి పాలకులు ఏ విధంగా విస్మరించారో తెలుపుతూనే, అభివృద్ధి కోరితే ఎలాంటి సమాధానమిస్తున్నారనే విషయాన్ని ఈ పంక్తులలో చెప్పారు.

తెలంగాణ ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టకుండా, ఆంధ్ర ప్రాంత అభివృద్ధి కోసం పరిశ్రమలు అక్కడ పెట్టి, ఎదిరించిన వారిని ఎన్కౌంటర్ల పేరుతో చంపుతున్నారనీ, ఈ రెండు ప్రాంతాలు రెండు కళ్ళని పలుకుతూ ప్రత్యేక తెలంగాణ వేర్పాటును ఒప్పుకోవడం లేదని తన ఉద్యమాదిలను కవిత్వరూపంలో వ్యక్తీకరించారు సిద్దెంకి యాదగిరిగారు.

సిద్దెంకి యాదగిరిగారు ప్రస్తుత రాజకీయ నాయకుల గురించి, అలాగే ప్రభుత్వ అధికారుల గురించి, సవివరంగా చెప్తూనే అటువంటి వారు అధికారంలో ఉండడానికి ఏ మాత్రం ఉపేక్షించకుండా ప్రజలందరు ఏకమై అవినీతి రహిత సమాజాన్ని ఏర్పాటు చేసుకుందాం రండి అంటూ ప్రజల్లో చైతన్యాన్ని నింపిన కవితా ఖండిక 'అవినీతి రహిత ఉషోదయానికి'.

**"అధికారంల అసీనమైనంత**
**అందిన కాడ్కి ఆరగించుడే దంద**
**పదవికాలమంత పంతరాగలు**
**పక్షపాత తత్వమే పారదర్శకత"**

(అవినీతి రహిత ఉషోదయానికి: పుట: 86)

అనే పంక్తులలో రాజకీయ నాయకులు పదవిలో ఉన్నంత కాలం వారికి దొరికినంత దోచుకుంటారు. తన వారికే ఉన్నత పదవులు ఇస్తూ పారదర్శకత అంటూ సమర్దించుకుంటారు. మాఫియా మార్గదర్శకత్వంలో సామధాన భేద దండోపాయాలు ఉపయోగించి ప్రజలను భయపెట్టి, మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి అనేక 'స్కాం'లు చేస్తూ అవినీతిమయం చేస్తున్నారని సిద్దెంకి యాదగిరిగారు తన ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

**"ప్రజకంటకులైన అవినీతి నేతలపై**
**సంఘటితమై తలపడాలి**
**అవినీతి రహిత ఉషోదయానికి**
**అందరూ నేను సైతం అనాలి"**

(అవినీతి రహిత ఉషోదయానికి: పుట: 87)

అనే పంక్తులలో సిద్దెంకి యాదగిరిగారు అడుగడుగునా అవినీతితో నిండిపోయిన ప్రభుత్వాధికారులను, ప్రభుత్వ శాఖలను గురించి చెప్తూనే, ఆ అధికారులు, నాయకులు మనకు కంటకాలవుతున్నారని వారిని ఎదుర్కోవాలంటే మనమంతా ఒక్కటి కావాలి. ఒక్కటైన మనం 'నేను సైతం' అంటూ ముందుకొచ్చి అవినీతి నిశిని తొలగించి, అవినీతి రహిత ఉషోదయానికి తెర తీయాలని పేర్కొన్నారు.

ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజానాయకుడు తాను అధికారంలో ఉండగా తెలంగాణ ప్రజల కోసం, తెలంగాణ అభివృద్ధి కొరకై ఎటువంటి పనులు చేయకుండా పదవీకాలం ముగిసిన తరువాత అధికారం కోసం పాకులాడుతూ, మీ కోసం వస్తున్నానంటూ పాదయాత్ర మొదలు పెట్టిన రాజకీయ నాయకుడిపై సిద్దెంకి యాదగిరిగారు రాసిన కవితా ఖండిక 'మా కోసం వస్తున్నావా?'.

**"మా కోసం వస్తున్నవా ...?**
**అయితే రా...**
**స్వాగతం**
**జై ఆంధ్ర పుత్రా .**
**మీ తొమ్మిదేండ్ల పాలనలో**
**మేం తరించి తన్మయం చెందలేదా ఏం ?"**

(మా కోసం వస్తున్నావా?: పుట: 96)

అనే పంక్తులలో సిద్దెంకి యాదగిరిగారు రాజకీయ నాయకుడిని గురించి ప్రస్తావిస్తూ మా కోసం వస్తున్నావా? అయితే రా...ఆంధ్రాపుత్రుడా నీకు స్వాగతం పలుకుతున్నాము, మీ తొమ్మిదేండ్ల పాలనలో మేము తన్మయం చెందలేదని భావిస్తున్నవా? ఆల్విన్, నిజాం షుగర్ ఫ్యాక్టరీలను పావుశేరుకు అమ్మావు, తిరుగుబాటు చేస్తే తుపాకీ గుండ్లతో నెత్తురు చిమ్మించావు. ఇలాంటివి చేసిన నీవు తృప్తి చెందలేదని మా కోసం వస్తున్నావా అంటూ వ్యంగంగా కవిత్వాన్ని రాశారు.

**నీరు మీరు ప్రోగ్రాం మీది**
**నీరు మీరే మలుపుకుంటిరి**
**అధికారంల మీరే ఉద్యోగంల మీరే**
**కాంట్రాక్టర్లు మీరే**
**నీరులేని నారు మల్లలో**
**పునాస పంట పురుగు మందు హత్యల్తో**
**బతుకు కన్నీళ్ల బాధలు మాయి"**

(మా కోసం వస్తున్నావా?: పుట: 97)

అనే పంక్తులలో 'నీరు – మీరు' అనే ప్రోగ్రాం పెట్టి నీళ్ళను మీరే (ఆంధ్ర) తీసుకున్నారు. అధికారం మీదే, ఉద్యోగాలు మీదే, కాంట్రాక్టు మీదే కానీ తెలంగాణ ప్రాంతంలోని ప్రజలకు మాత్రం తినడానికి తిండిలేక, ఉద్యోగాలు లేక పంటలు పండక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని, తన బతుకును కన్నీళ్ళపాలు చేసుకున్నారని, మేము ఇలాంటి బాధలు పడుతుంటే మీ కోసం వస్తున్నాననే ముసుగులో మమ్మల్ని కప్పేస్తున్నావు.

నువ్వు వస్తున్నావు అయితే అది మా కోసం కాదు. మా కష్టాలను తీర్చడం కోసం కాదు, నువ్వు వస్తున్నది నీ కోసం, మీ పార్టీ కోసం, మీ అధికారం కోసం వస్తావు అంతేకానీ, మా కోసం

ఎందుకొస్తావని వ్యంగంగా చెప్పినప్పటికీ, ఈ కవితలో తెలంగాణ ప్రాంత ప్రజల ఆవేదన, వారు పడుతున్న కష్టాలను, బాధలను హృదయవిదారకంగా కవిత్వీకరించారు కవి సిద్దెంకి యాదగిరిగారు.

### 3. 7. సామాజిక దురాక్రమాలు:

ఆధునిక ప్రపంచాన యువతీ, యువకులు సామాజిక మాధ్యమాలకు బానిసలవుతున్నారు. ఈ సామాజిక మాధ్యమాలలో ప్రసారమవుతున్న ప్రతీదానికి సమాజం ఎంతగానో ప్రభావితమవుతున్నది. మంచి కంటే చెడుకే ఎక్కువగా ప్రభావితమవుతుందీ ఈ సమాజం. సమాజమంటే మంచిని పెంచే విధంగా ఉంటే సమసమాజ స్థాపన జరుగుతుంది. అయితే నేటి ఆధునిక సమాజంలో అమాయకపు ఆడపిల్లలపై అఘాయిత్యాలు రోజు రోజుకు పెరిగి పోతున్నాయి.

ఈ అఘాయిత్యాలను చూసి తట్టుకోలేక ఆవేదనతో ఈ సమాజంలో జరుగుతున్న దూరాక్రమాలను ఎండగడుతూ, తనదైన శైలిలో 'శరీరాస్త్రం', 'ఒక నిమిషం ఆగు' అనే కవితా ఖండికల ద్వారా సిద్దెంకి యాదగిరిగారు తనవంతు సామాజిక బాధ్యతను నిర్వర్తించారు.

ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట ఏదో ఒక మూల స్త్రీల పై అత్యాచారాలు, హత్యలు, అఘాత్యులు జరుగుతూనే ఉన్నాయి. ఆ దురాక్రమణలో అశువులు బాసిన ఆడ కూతురుకు నివాళులు అర్పిస్తూ సిద్దెంకి యాదగిరిగారు 'శరీరాస్త్రం' అనే కవితా ఖండిక రాశారు.

> "నివాళ్ళు ఆర్పిస్తున్న చెమ్మగిల్లిన కళ్లు
> నిలువెల్ల కొవ్వొత్తులై కరిగిపోవద్దు.
> నిరసన ర్యాలీలు ప్రతిగుండెలో లావా ఎగజిమ్మి
> మొద్దు నిద్ర మొకం పై ముద్దెర్లు గుద్దాలి
> ధర్నాలు ధైర్యాల ఔషనమై
> సురక్షిత చుట్ట కంచె ఆభయం కావాలి"
>
> (శరీరాస్త్రం: పుట: 114)

అనే పంక్తులలో నివాళులు ఆర్పిస్తున్న కళ్ళు కన్నీళ్ళతో తడిసిపోవద్దు, కొవ్వొత్తిలా కరిగిపోవద్దు, నిరసన ర్యాలీలతో ప్రభుత్వాన్ని నిద్రలేపాలి ధర్నాలతో స్త్రీలకు ధైర్యాన్ని అందించాలి.

అంతేకాకుండా స్త్రీలు వస్త్రాలు ధరించినట్లే అస్త్రాలను ధరించి ప్రమాదం వచ్చినపుడు మీరు సివంగిలా విరుచుకుపడాలి. విషాద వీచకపై విలువలు పెంచి, విపంచి పలికించేందుకు ప్రతీ ఒక్కరూ ఏకం కావాలి. ఈ దురాక్రమణలకు వ్యతిరేకంగా పోరాడాలని మానవత్వాన్ని చూపుతూనే సమాజంపై తనకు గల బాధ్యతను విస్మరించని మంచి పౌరుడిగా సిద్దెంకి యాదగిరిగారు ఆలోచన దాయకంగా ఈ కవితా ఖండికలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

నేటి యువతీ, యువకులు ప్రేమ పేరుతో ఒకరికొకరు ఆకర్షణకులోనై ప్రేమ వలలో చిక్కుకొని, ప్రేమ విఫలముమైతే తమ తనువులను త్యజిస్తున్నారు. అలాంటి అఘాత్యాలకు పాల్పడే ముందు ఒక నిమిషం ఆగి ఆలోచించు నీ తల్లిదండ్రులను గురించి అంటూ రాసిన కవిత్వ ఖండికయే 'ఒక నిమిషం ఆగు'

"మెరిసేదంత బంగారమనీ
ఆచరం రహితంగా చరిధిస్తున్నావా?
ఆకర్షణ వలలో చిక్కి
సొల్లు కుక్కలా పరిగెడుతున్నావా?
ఒక నిమిషం ఆగు"

(ఒక నిమిషం ఆగు: పుట: 130)

అంటూ ఈ కవితా ఖండికను ప్రారంభించారు. ఈ ఖండికలో కవి యువతీ, యువకులను ఉద్దేశించి కొంతపరుష పదజాలాన్ని వాడినప్పటికీ అందులో తన బాధ్యత మనకు తెలుస్తుంది. తెలిసి తెలియని వయసులో ప్రేమ అంటూ అమ్మాయిల వెంటపడి వారి జీవితమే కాకుండా అమ్మాయి జీవితాన్ని పాడుచేస్తున్నారు. అలాగే ప్రేమ విఫలమమైతే మరణమే శరణ్యమంటూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

అలాగే కొంత మంది పర స్త్రీ, పర పురుషులతో ఉంటూతనను నమ్ముకున్నవారిని విస్మరించి వివాహేతర సంబంధాలకు తెరతీస్తున్నారు. ఇదంతా పాపం, అది మోసపు గొయ్యంటూ సమాజంలో జరుగుతున్న దురాక్రమాలను కవిత్వికరించి సమాజాన్ని తన కలంతోకనువిప్పు కలిగిస్తున్నారు.

"కలల్ని కంటూనే సాకారం ఊహించు
అనుకున్నది జరగకపోతే అవమానమనుకోకు
నేటి ఓటమి రేపటి మేలుకోలుగా
చిరకాల శత్రువులో చిరునవ్వులు కురిపించు
నీవు ఏది చేయాలనుకొన్న
ఒక నిమిషం ఆగు"

(ఒక నిమిషం ఆగు: పుట: 131)

అనే ఈ చివరి పంక్తులలో కవి దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంగారు చెప్పిన మాటలను గుర్తుచేశారు. 'కలలు కను వాటినిసాకారం చేసుకో' అన్న మాటలను ఈ కవిత్వంలో స్థిరీకరించారు. ఈ చివరి పంక్తులలో ప్రతీ ఒక్క యువతీ, యువకులలో ఆత్మవిస్వాశాన్ని నింపుతూ నీవు ఏది చేయాలన్న తల్లిదండ్రులను గుర్తుపెట్టుకో, నీ కోసం ఉన్న వారిని గుర్తుపెట్టుకోమంటూనే, నీవు ఏ పని చేసినా ఒక నిమిషం ఆగు అని నేటి సమాజంలోని యువతీ, యువకులకు మార్గదర్శనం చేశారు.

మన భారత దేశ జనాభాలలో ఎక్కువ శాతం ఉన్నది యువకులే కాబట్టి వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన మీద ఉంది. ఈ కవితా ఖండిక ద్వారా కవిలో మానవత్వం, దేశభక్తి, సామాజిక బాధ్యత అనే మూడు సుగుణాలను మనం పరికించవచ్చును.

# సింహావలోకనం

బహుజన కులాలకై ప్రముఖులు, సాహితీవేత్తలు తమవంతు కృషి చేసారు, చేస్తున్నారు. ముఖ్యంగా కవులైతే తమ సాహిత్య జ్ఞానంతో కవితలు, కథలు, నవలలు, వ్యాసాలు మొదలైన సాహిత్య ప్రక్రియల ద్వారా బహుజన కులాల చైతన్యానికి తమవంతు సేవ చేస్తున్నారు. ఇలా తన కవితల ద్వారా బహుజన ఉద్యమానికి ఊపిరి పోస్తున్నటువంటి వ్యక్తి సిద్దెంకి యాదగిరిగారు. నేను సిద్దెంకి యాదగిరిగారు రాసిన *"బతుకు పాఠం"* అనే కవితా సంపుటి నా ఎం. ఫిల్ పరిశోధన అంశంగా ఎంచుకున్నాను. నా పర్యావేక్షకుల సూచనమేరకు 'సిద్దెంకి యాదగిరి "బతుకుపాఠం" కవిత్వం సామాజిక అనుశీలన' అని నా ఎం. ఫిల్ పరిశోధన వ్యాసానికి శీర్షికను నిర్ణయించుకున్నాను

నేను ఎంచుకున్న '**సిద్దెంకి యాదగిరి *"బతుకుపాఠం"* కవిత్వం సామాజిక అనుశీలన**' అనే నా ఎం. ఫిల్ సిద్ధాంత వ్యాసంలోని మొదటి అధ్యాయం కవి జీవిత విశేషాలతో మొదలుపెట్టాను. ఈ అధ్యాయంలో కవి బాల్యం, విద్యాభ్యాసం, వృత్తి ప్రవృత్తి, సన్మానాలు సత్కారాలు, వివిధ సందర్భాల్లో ప్రముఖ సాహితీవేత్తల దగ్గర పొందిన ప్రశంసలు, *"బతుకు పాఠం"* కవితా సంపుటేకాక వీరు రాసిన ఇతర ప్రక్రియలకు సంబంధించిన రచనలు కూడా మొదటి అధ్యాయంలో క్రోడీకరించాను.

రెండో అధ్యాయంలో *"బతుకు పాఠం"* కవితా సంపుటిలోని వస్తువు వైవిధ్యం గురించి వివరించాను. ఆధునిక కాల సమాజంలో జరిగే పెనుమార్పులు, పరిణామాలు అనేక రంగాలపై ప్రభావం చూపుతూవుంది. అందులో సాహిత్య రంగం ఒకటి. ఆధునిక కాలంలోని కవితా వస్తువు చలనశీలమైనదని ఆధునిక విమర్శకుల అభిప్రాయం. కావున ప్రస్తుత సమాజంలోని సంఘటనలను కవి కవితల రూపాలలో రాసేటప్పుడు విభిన్నమైన, వైవిధ్యభరితమైన కవితా వస్తువులు రూపొందుతున్నాయి. *"బతుకు పాఠం"* కవితా సంపుటిలోని వస్తు వైవిధ్యాలను కులం, మతం, సామజిక చైతన్యం, వ్యవసాయ రంగం మొదలైన అంశాలను విభజించి విశ్లేషించాను.

మూడో అధ్యాయంలో *"బతుకు పాఠం"* కవితా సంపుటిలోని సామజిక అంశాలను సహేతుకంగా విశ్లేషించే ప్రయత్నం చేశాను. ఈ కవితా సంపుటి ముఖ్యంగా బహుజన దృక్పథానికి సంబంధించినది. ఈ కవితా సంపుటిలో బహుజన కులాలకు సంబంధించిన ప్రజలు ఏ విధంగా అణిచివేయబడుతున్నతీరును తెలిపె విధంగా సిద్దెంకి యాదగిరిగారు కవితలు రాసారు. కొన్ని రకాలైన సందర్భాలను కవులు వారి భావవ్యక్తీకరణల ద్వారా తెలిపే విధానం వైవిధ్యంతో కూడుకుని ఉంటుంది. అలాగే ఈ *"బతుకు పాఠం"* కవితా సంపుటిలో సమాజంలో జరిగే దురాక్రమాలను, బహుజన జాతుల ప్రజల అమాయకత్వపు మనస్తత్వం, అంతరించిపోతున్న సంస్కృతులు, మరుగున పడుతున్న కుల వృత్తులు, అన్యాయానికి గురవుతున్న కళాకారులు, ఒక ప్రాంతపు భాషను మాత్రమే కేంద్రీకరించుకొని సినీ రంగంలో హేళన చేయడం, అమ్మానాన్నల ప్రేమ, విశ్వవిద్యాలయాలలోని పోరాటం మొదలైనటువంటివి అంశాలు చోటుచేసుకుని ఉంది.

*"సాహిత్యం కులాన్ని పట్టించుకుని వెలువడిన విధానాన్ని బహుజన సాహిత్య దృక్పథం తెలుపుతుంది తప్ప, కులాన్ని ప్రోత్సహించదు".* (*బహుజన సాహిత్య దృక్పథం*: పుట: 19) ఇదేవిధంగా సిద్దెంకి యాదగిరిగారు దళిత రచయిత అయినప్పటికీ కులాలను పట్టించుకోకుండా బహుజన ప్రజల శ్రేయస్సుకు పాటుబడ్డ వ్యక్తి.

నేను '**సిద్దెంకి యాదగిరి *"బతుకుపాఠం"* కవిత్వం సామాజిక అనుశీలన**' అనే అంశంపై చేసిన ఈ పరిశోధనలో ఏవిధమైన తప్పులు, పొరపాట్లు ఉన్న సరే పాఠకులు నాకు తెలిపితే దానిని సరిచేసుకుంటాను. సిద్దెంకి యాదగిరిగారి జీవితాన్ని మరింతగా తెలుసుకోవడానికి వారి ముఖచిత్రంతో పాఏటు వారు ఇతర సాహితీ వేత్తలచే పొందిన సన్మానాలకు సంబంధించిన చిత్రాలనూ అనుబంధాలలో జోడిస్తున్నాను.

## ఉపయుక్తగ్రంథసూచి


1. ఆరుద్ర. సమగ్రాంధ్ర సాహిత్యం, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2002.
2. ఎల్లన్న, దరువు. ఓ యుద్ధం, దరువు ప్రచురణలు, హైదరాబాద్, 2011.
3. చంద్రశేఖర్, ఎస్జీడి. వచన కవిత్వం – కుందుర్తి పాత్ర, ఎస్జీడి పబ్లికేషన్స్, తిరుపతి, 1985.
4. తెలుగు అకాడమీ, తెలంగాణ ఉద్యమం – రాష్ట్ర అవతరణ – 2016.
5. తెలంగాణ–చరిత్ర సంస్కృతి, తెలుగు అకాడమీ, 2015.
6. నళిని, ఎస్. ఎస్. సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ, నవోదయాబుక్ హౌస్, హైదరాబాద్, 2009.
7. నారాయణ రెడ్డి, సింగిరెడ్డి. ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు: ప్రయోగములు. విశ్వంభరా విజన్ పబ్లికేషన్స్. 2001.
8. నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష, నవ్య పరిశోధక ప్రచురణలు – హైదరాబాద్, 1995.
9. బాపూజీ, బి. ఆర్. రాజకీయ పదాల డిక్షనరి–నవోదయ బుక్ హౌస్ హైదరాబాద్, 2021.
10. బ్రౌన్, సి. పి. బ్రౌణ్య తెలుగు–ఇంగ్లీష్ నిఘంటువు, పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్, 1980.
11. మధుసూదనరావు, త్రిపురనేని. సాహిత్యంలో వస్తు శిల్పాలు, చరిత్రగ్రాఫిక్స్, హైదరాబాద్ 1997.
12. యాదగిరి, సిద్దెంకి. మా తొవ్వ (కవితా సంపుటి) దరువు ప్రచురణలు, హైదరాబాద్, 2004.
13. యాదగిరి, సిద్దెంకి. బతుకు పాఠం (కవితా సంపుటి )దరువు ప్రచురణలు హైదరాబాద్, 2014.
14. యాదగిరి, సిద్దెంకి. తప్స(కథల సంపుటి) హైదరాబాద్, 2016.
15. యాదగిరి, సిద్దెంకి. అచ్చు ( కవితా సంపుటి) జంభు సాహితీ ప్రచురణలు హైదరాబాద్, 2020.

16. యాదగిరి, సిద్దెంకి. తొండం బొక్కెన (కథల సంకలనం) హైదరాబాద్, 2021.
17. రామస్వామి శాస్త్రి, వెంకటేశ్వర శాస్త్రి, వావిళ్ల. శంకర నారాయణ తెలుగు–ఇంగ్లీషు నిఘంటువు, విజయవాడ, 2011.
18. లక్ష్మీకాంతం, పింగళి. సాహిత్య శిల్ప సమీక్ష, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్ 2012.
19. లక్ష్మీనరసయ్య, జి. కవిత్వం చర్చనీయాంశాలు– కవిసంగమం పబ్లికేషన్స్ హైదరాబాద్, 2021.
20. వీరభద్రయ్య, ముదిగొండ. విమర్శ మౌలిక లక్షణాలు. తెలుగు అకాడమీ– హైదరాబాద్, 1990.
21. వెంకటేశ్వర రావు, దార్ల. సాహితీ సౌగంధి, మంజుశ్రీ ప్రచురణలు, హైదరాబాద్, 2016.
22. వెంకటస్వామి, ఎన్ (సం). పరిపాలన, న్యాయ పదకోశం (తెలుగు–ఇంగ్లీష్), తెలుగు అకాడమి, హైదరాబాద్, 1980.
23. వెంకయ్య, మామిడి. ఆంధ్రదీపిక, బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటూరు, 2014.
24. శరత్ జ్యోత్స్నారాణి, ఎస్. స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత – వస్తువు, రూపం, శిల్పం, జ్యోత్స్న కళాపీఠం, హైదరాబాద్, 2003.
25. శంకరనారాయణ, పి. తెలుగు–ఇంగ్లీష్ నిఘంటువు, శ్రీ వేంకటేశ్వర బుక్ డిపో, విజయవాడ, 2011.
26. శివారెడ్డి, ఏలూరి (ప్ర. సం), చెన్నయ్య, జె (సం). వచన కవిత్వం వస్తు శిల్పాలు, తెలంగాణ సారస్వత పరిషత్తు, హైదరాబాద్, 2020.
27. శ్రీధర్, వెల్దండి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వం– తెలంగాణ సాహిత్య అకాడమీ– హైదరాబాద్, 2017.
28. సత్యనారాయణ, ఎస్వీ. దళిత వాద– వివాదాలు(సం). విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్– హైదరాబాద్, 2000.
29. సీతారామాచార్యులు, బహుజనపల్లి. శబ్దరత్నాకరం, శ్రీ వేంకటేశ్వర బుక్ డిపో, విజయవాడ, 2012.

30. సూర్యధనుంజయ్, రఘు, ఎస్(సం). తెలంగాణ సాహిత్యం సమాలోచన– తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం హైదరాబాద్, 2019.
31. సూరన, పింగళి. కళాపూర్ణోదయం, భువన విజయం పబ్లికేషన్స్, విజయవాడ, 2004.

# అనుబంధం – I

## 1) మీ సాహితి ప్రస్థానం ఎప్పుడు మొదలైంది?

నా సాహితీ వ్యక్తీకరణకు పునాది గోనెపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిందని చెప్పాలి. అక్కడ అష్టకాల నరసింహ రామ శర్మగారు మాకు గురువు. వారు ఆ సమయంలో ఆత్మ వేదం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. దాని గురించి చెప్పారు పద్యం రాయడం వల్ల మనుషులు జీవిస్తారని వివరించారు. నాకు మరొక గురువులు సంజీవరెడ్డి గారు వారు రామప్ప మీద రాసిన పద్యాలు అద్భుతంగా ఆలపించాడు. అట్లా సాహిత్యం రాయాలని కుతూహలం కలిగింది. 1996లో అమ్మ పేరున మొదటి కవిత రాశాను. అలా సాహిత్యంలోకి ప్రవేశించాను. ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు వచన కవితలు రాయడం ప్రారంభించాను. వేముగంటి మురళీకృష్ణ పరిచయం కావడం నందిని సిధారెడ్డి గారు పరిచయం కావడంతోటి కొన్ని సాహితీ పుస్తకాలన్ని ఇవ్వడం జరిగింది. సాహితీ వాతావరణంలోకి నేను ప్రవేశించాను. మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగే సాహితీ కార్యక్రమాలకు హాజరయ్యేవాడిని. అందులో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నెమలి కన్ను మొదలైన పుస్తకాలు చదువుతుంటే చాలా ఆనందంగా అనిపించింది. కళాశాల గ్రంథాలయంలో శ్రీ శ్రీ గారి మహాప్రస్థానం దాశరథి కృష్ణమాచార్య సమగ్ర సాహిత్య సంపుటాలు మొదలైన పుస్తకాలు చదివాను కళాశాల స్థాయిలో జరిగే కవి సమ్మేళనం లో పాల్గొనే వాడిని.

## 2) మీకు ప్రేరణనిచ్చిన కవులు ఎవరు?

కవిత్వం రాస్తున్నప్పుడు నందిని సిధారెడ్డి గారు వేముగంటి మురళీకృష్ణమాచారి కొన్ని మేలుకువలు చెబుతుండేవారు. దేశపతి శ్రీనివాస్ సారు మరసం మిత్రులందరూ తన అభిప్రాయం వెల్లడి చేస్తూ గొప్ప కవితా పుస్తకాల్ని చదవాలని పూరికొలిపేవారు. అట్లా శ్రీశ్రీ సాహిత్యము శివారెడ్డి గారి ఆసుపత్రిగీతం మొదలైన పుస్తకాలు చదివాను. 1999 డిసెంబర్ 20వ తారీకు నాడు మిత్రులందరం కలిసి దరువు ఎల్లన్న కుంట శ్రీనివాస్ తో కలిసి దరువు కళాబృందం ప్రారంభించుకున్నాం. సాహిత్య సృజన చేయాలని బాధ్యత మరింత పెరిగింది. కవిత్వంలో ప్రేరణ ఇచ్చిన కవులు శ్రీశ్రీ కే శివారెడ్డి, సినారే, ఎన్,గోపి, నందిని సిధారెడ్డి, పప్పుల రాజిరెడ్డి, దర్భశయనం శ్రీనివాసాచార్య కవితలు చదువుతుంటే కొత్తదనం అనిపించేది.

**3) మీరు కవితలనేకాక ఏవైనా ఇతర ప్రక్రియల్లో రచనలు చేశారా?**

నేను కవిత్వంలో "*మా తొవ్వ*" (2008) "*బతుకు పాఠం*" (2014) "*అచ్చు*" (2020) మూడు కవితా సంపుటాలు అచ్చు వేశాను. నాకు ఇష్టమైన మరొక ప్రక్రియ కథా ప్రక్రియ. నేను రాసిన కథలన్నీ తప్ష గా 2016లో కథ సంపుటి వేసాను. 2022లో పిడుగు కథా సంపుటి ప్రచురించాను. ఇప్పటివరకు దాదాపు 33 కథలు రాశాను. నేను గుడిపల్లి నిరంజన్, తప్పేట ఓదయ్య మా ముగ్గురి సంపాదకత్వంలో దళిత కథ వార్షిక 2020 "తొండం బొక్కెన", 21 చిందూ నేల ప్రచురించాము. సమీక్ష వ్యాసాలు, పరిశోధక వ్యాసాలు, సామాజిక వ్యాసాలు రాశాను. 2023లో ముక్వారు పేరిట వ్యాస సంపుటిని తీసుకరాబోతున్నాను. ఒక నాటిక రాశాను. నవల ప్రారంభించి మధ్యలో ఆపేసాను.

**4) బతుకు పాఠం కవితా సంపుటిలో కులం ద్వారా అణిచివేతకు గురైన వారి బాధలను చిత్రించారు కదా మరి కుల నిర్మూలనకు చేయాల్సిన పనులు ఏమి?**

గొర్రె కాడికి గొర్రె పోతుంది. పశువుల కాడికి పశువుల పోతాయి. మనిషి కాడికి మనిషి పోలేక పోతుండు. జాతి ఒకటే అయిన అసమానతల వలన సమాజంలో ప్రతికూలతలు వచ్చి చేరాయి. మనుషులు కులం, మతంపేరిట విభజించబడకూడదు. అణగారిన కులాలు అంటే ఉన్నత కులాల వారికి ఒక రకమైన అసహ్య భావం ఉంటుంది. కుల నిర్మూలన జరగాలంటే ఒకే రకమైన విద్యావ్యవస్థ ఉండాలి. అన్ని వర్గాల వారు అందులో చదవాలి. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు కుల నిర్మూలన జరగాలంటే కులాంతర వివాహాలు జరగాలి. సాటి మనిషిని తోటి వాడిగా గౌరవించే పరిస్థితులు రావాలి. అందుకోసం సాహిత్యము సినిమా సామాజిక మధ్యమాలు అన్నీ కలిసి కృషి చేయాలి. అంతరాలులేని సమాజం ఉన్నప్పుడే అందరూ క్షేమంగా ఉంటారు.

**5) ఉద్యమాల మీద మీ అభిప్రాయం ఏమిటి? అందులో మరీ ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంపై మీ అభిప్రాయం?**

తెలంగాణ అంటేనే పోరు భావుట. త్యాగాల నేల. ఒకప్పుడు తెలంగాణ ప్రత్యేక దేశం. తన ఉనికి కోసం నిరంతరం ఇక్కడి ప్రజా కొట్లాడుతూనే ఉంది. ఉద్యమంటే ఒక లక్ష్యం కోసం విరామం ఎరగకుండా నిరంతరం చేసే పని. ఉద్యమం వల్లనే ప్రపంచం లోని అనేక సమస్యలకు పరిష్కారాలు లభించాయి. ఉద్యమాల వల్లనే ప్రపంచం మార్చబడింది. ఉద్యమాల వల్లనే సమస్తం జరిగాయి. ఉద్యమం అంటే పోరాట స్థాయి యొక్క ఆఖరి దశగా వర్ణించవచ్చు. ప్రపంచానికి గొప్ప దిక్సూచిగా పనిచేసిన ఉద్యమం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం. నిజామును గద్దె దించే వరకు అవిశ్రాంతంగా పోరాటం చేసి బానిస సంకెళ్లను తెంచింది. తెలుగు భాషా ప్రయత్నం రాష్ట్రాల పేరిట

చేసిన మోసమే ఆంధ్ర ప్రదేశ్. సమైక్యాంధ్ర రాష్ట్రంలో తెలంగాణ ప్రజల భాషకు, యాషకు, సంస్కృతి, సంప్రదాయాలకు విలువ లేకుండా పోయింది. దాని ఫలితంగా ఇక్కడి ప్రజలు తమ ప్రాంతీయ అస్తిత్వం కోసం అనేక పోరాటాలు చేయాల్సి వచ్చింది. ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ ఉద్యమం నుంచి మొదలుకుంటే తెలంగాణ మలిదశ ఉద్యమం వరకు కొనసాగింది. సాయుధ రైతాంగ పోరాటంలో దాదాపు 5000 మంది ఉద్యమకారులు ప్రాణాలు విడిచారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1969 లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కోసం పోలీస్ కాల్పులకు బలైన వారు 369 మంది ఉద్యమకారులు. మలిదశ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను చాటడానికి వెయ్యి మంది విద్యార్థులు యువకులు బలిదానమయ్యారు.

## 6) నేటి రాజకీయ వ్యవస్థ పై మీ అభిప్రాయం?

అందరికీ సమాన హక్కులు కల్పించిన భారత రాజ్యాంగం అందరికీ ఒకే విలువ ఒక ఓటు హక్కునిచ్చింది అంటే ప్రతి పౌరుడు రాజకీయ బాధ్యుడి అని తెలిపింది ఈనాడు ఉన్న రాజకీయం స్వార్థపరుత్వం పెరిగిపోయింది బంధుప్రీతి ఎక్కువైంది ఏ జీవో తీసిన ఏ చట్టాన్ని మార్చిన తమ వారి ప్రయోజనాలు ఎంతో వేరీస్ వేసుకొని చట్టాలను రూపొందిస్తున్నారు అమలు చేస్తున్నారు ఇంకా పారదర్శకత రావాలి అందరికీ సమన్యాయం కావాలి న్యాయవ్యవస్థ సంపూర్ణంగా రాజ్యాంగ మౌలిక సూత్రాలను అమలుపరచాలి అందుకోసం సరైన రాజకీయ నాయకులే అవసరం ప్రజలు మారితే రాజకీయం సులువుగా మారుతుంది ప్రజల్లో చైతన్యం రాజకీయానికి అసలైన పునాది.

## 7) మైకేల్ జాక్సన్ మీద స్మృతికావ్యం రాయడానికి గల కారణాలు?

ప్రపంచ ప్రఖ్యాత పాప్ సింగర్ మైకేల్ జాక్సన్ వారు సింగరే కాదు డాన్సర్ కూడా ఒక నల్లజాతీయుడై ఉండి అణిచివేత ఉన్న తెల్లజాతీయుల సమాజంలో దూసుకొచ్చిన ఒక నిరసన కెరటం మైకేల్ జాక్సన్ వారిని వారి సేవలను స్మృతి కావ్యంగా రాయడం అంటే భారతదేశంలో అణిచివేయబడుతున్న అనేకమంది కళాకారులకు సముచిత గౌరవం ఇవ్వడమేనని తెలియపరచడం.

## 8) రైతుల ఆత్మహత్యల మీద మీ అభిప్రాయం?

వడ్లు ఎన్ని పండినై అని అడుగుతరు కానీ ఎడ్లెన్నీ సచ్చినయ్ అని అడుగరు. అనేది తెలంగాణ సామెత. రైతు వేసిన పంటకు  పూచి లేదు. నకిలీ విత్తనాలు మోసం చేస్తాయి ఎవరిని అడగాలో తెలియదు, నకిలీ మందులు మోసం చేస్తాయి. రైతు అవసరాల కోసం అప్పు ఇవ్వని బ్యాంకుల అనేకంగా ఉన్నాయి. ఈ దేశాన్ని మోసం చేసి విదేశాలకు ప్రయాణం చేసే వారికి వేల కోట్ల డబ్బులు నమ్మే

బ్యాంకుల వ్యవస్థ మారాలి. రైతును మరింతగా ఆదుకోవాలి. రైతులకు ప్రభుత్వం చేయూతనివ్వడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత రైతుబంధు, రైతు భీమా మొదలైనవి ఇచ్చి ఆదుకుంటున్నది కానీ, ఇంకా రైతుల పట్ల సానుభూతి కరువైందనిచెప్పాలి. ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను నిరోధించాలని, రద్దు చేయాలని దాదాపు ఏడాది పాటు రోడ్లమీద రైతులు నిరసన తెలియజేశారు. ప్రభుత్వాలు రైతులను పట్టించుకోవాలి సబ్సిడీలు ఇవ్వాలి అప్పుడే రైతు ఆత్మహత్యలు ఆగుతాయి. వ్యవసాయం అంటే దండుగ కాదు పండుగని విధానాన్ని తేవాలి. వ్యవసాయం చేస్తున్న అబ్బాయిలకు పిల్లని ఇవ్వని పరిస్థితి నుంచి కోరి కోరి ఇచే పరిస్థితి రావాలి. రైతు సచ్చిన దేశం, ఎద్దు ఏడిసిన ఎవుసం, ఎప్పటికీ సర్వనాశనం.

**9) తెలంగాణ యాసను ఇతర ప్రాంతాలవాసులు ఏ విధంగా కించపరుస్తున్నారని మీరు అనుకుంటున్నారు?**

తెలంగాణ భాషను చాలా దారుణంగా కించపరచారనేది 100% నిజం. భాషలోనే బతుకున్నది. ఇక్కడి సంస్కృతి, ఆచార, వ్యవహారాలు, కట్టుబాట్లు ఇమిడి ఉన్న భాషను అనేక విధాలుగా వివక్షకు గురి చేశారు. తెలంగాణ పదాలను చులకన చేసి మాట్లాడడం తెలంగాణ భాష విలన్లకు పెట్టడం తెలంగాణ భాషను తక్కువ చేసి మాట్లాడడం ఇవన్నీ ఆంధ్రోళ్లు చేసిన ఎత్తుగడ.

**10) "*బతుకు పాఠం*" అనే శీర్షికను మీరే ఎంచుకున్నారా లేక ఇతర సన్నిహితులు ఎవరైనా సూచించారా?**


బతుకు పాఠం అనే శీర్షికను నేనే ఎంచుకున్నాను. బతుకు పాఠం అనే కవిత రాస్తున్నప్పుడు నాలో కలిగిన పరివర్తననే నీ ముందు నిలిచిన ఉపాధ్యాయుడిని. నీకు ఎవరి పాఠం అవసరం లేదు నా బతుకు పాఠమే నీ భవిష్యత్తుకు పాఠమై, దిక్సూచి గా నిలుస్తుందని నా జీవితాన్ని ఉదాహరించాను. అదే బతుకు పాఠం.

**11) మీ కవిత్వం మాండలిక భాషలోనే రాయడానికి గల కారణాలు?**

మీరు అడిగింది కొంతవరకు నిజం. అవసరాన్ని బట్టి వ్యవహారికము ఆధునికము ఏ సందర్భంలో ఏది ప్రయోగించాలో అది మాత్రమే ప్రయోగిస్తాను. అధిక శాతం నా కవిత్వం మాండలిక భాషలోనే సాగుతుంది. ముందుగా మాండలికంలోని భాషా సోయగాన్ని ఆస్వాదించే మనసులు ఈరోజు కూచించుకుపోతున్నాయి. కొన్ని పదాలు మరుగున పడిపోతున్నాయి. సాహిత్యంలోకి తీసుకురాక పోవడం వల్ల కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఆయా సందర్భాల్లో ఆయా పదాలను వాడితేనే అర్థం సరిపోతుంది. కాబట్టి అలాగా వాడుతున్నాను. అరువు తెచ్చుకున్న భాషలోకి మనల్ని మనం మర్చిపోతూ పరాయికరణ చెందుతున్న సందర్భంలో మన అస్తిత్వాన్ని, వాస్తవ స్థితిని చెప్పాలంటే మన మాండలికమే ప్రధానమైన వనరుగా భావించాను. ఎందుకంటే ఎవరి కొలతలకు అనుగుణంగా వారు దుస్తులు కుట్టించుకుంటారు. వేరే వారి కొలతలు కలిగిన దుస్తుల్ని మనం కొనుక్కొని ధరిస్తే ఎక్కడో ఒక దగ్గర తేడా వస్తుంది. అది మనది కాదని తేలిపోతుంది. తెలిసిపోతుంది. పరాయి భాష

సరితూగని భాష వినియోగిస్తే అడుక్కొచ్చిన అంగీలు తొడుక్కుంటే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. అలాగని సంపూర్ణంగా మాండలికంలోనే రాయలేదు. అవసరాన్ని బట్టి అటు వ్యవహారికము ఇటు ఆధునికము అన్ని రకాల భాషను ఉపయోగించాను. ఉపయోగిస్తారు కూడా.

# అనుబంధం – II




"*బతుకు పాఠం*" కవితాసంపుటి ముఖచిత్రం




"*బతుకు పాఠం*" కవితాసంపుటి కవి సిద్దెంకి యాదగిరిగారు.





ప్రముఖ కవి, విమర్శకులు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ ఆచార్య సి. నారాయణ రెడ్డిగారితో సిద్దెంకి యాదగిరిగారు.



డిప్యూటి స్పీకర్ T. పద్మారావు గౌడ్, నందిని సిధారెడ్డి, నాలేశ్వరం శంకరం మొదలైన ప్రముఖులచే సన్మానం పొందుతున్న సిద్దెంకి యాదగిరిగారు.



ప్రముఖ విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారితో సిద్దెంకి యాదగిరిగారు.



తెలంగాణ ప్రముఖ కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ గారితో సిద్దెంకి యాదగిరిగారు.




తెలంగాణ రచయితల సంఘ సభ్యులతో సిద్దెంకి యాదగిరిగారు.




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి కవి సమ్మేళనంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. మామిడి హరికృష్ణగారి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న సిద్దెంకి యాదగిరిగారు.




దళిత దిగ్గజ కవులైన పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గార్ల చేతుల మీదుగా మెమోంటోను అందుకుంటున్న సిద్దెంకి యాదగిరిగారు.



ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్ గారితో సిద్దెంకి యాదగిరిగారు.




ప్రముఖ కవి శివారెడ్డిగారితో సిద్దెంకి యాదగిరిగారు.




ప్రముఖ కవి, రచయితలు ఆచార్య కొలకలూరి ఇనాక్, జూలూరి గౌరీ శంకర్, ఆయాచితం శ్రీధర్, ప్రొ. కాశీం, సంగిశెట్టి శ్రీనివాస్, జూపాక సుభద్ర, డా. గోగు శ్యామల, డా. తైదల అంజయ్య, మేర్సి మార్గరెట్, గుడిపల్లి నిరంజన్, తప్పెట ఓదయ్య, కే.పి. లక్ష్మీ నరసింహగార్లతో సిద్దెంకి యాదగిరిగారు.



సామాజిక ఉద్యమకారులు మందకృష్ణ గారితో సిద్దెంకి యాదగిరిగారు.



ప్రముఖ కవి, రచయిత, సాహితీ పరిశోధకులు కపిలవాయి లింగమూర్తిగారితో సిద్దెంకి యాదగిరిగారు.




ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డిగారితో సిద్దెంకి యాదగిరిగారి కుటుంబ సభ్యులు